www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 9-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 282 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి రా. 10.26 తదుపరి చతుర్దశి; నక్షత్రం: జ్యేష్ఠ రా. 9.12 తదుపరి మూల; వర్జ్యం: తె.4.41-6.11; దుర్ముహూర్తం: ఉ.9.04-9.48, రా.10.09-10.59; అమృతఘడియలు: మ.12.43-2.15; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.53 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మదీనలో స్మృతి ఇరానీ!

తొలి ముస్లిమేతర ప్రముఖురాలిగా కేంద్ర మంత్రి రికార్డు

మస్జిదే ఖుబా, ఉహుద్ పర్వత ప్రాంతాల సందర్శన

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ముస్లింలకు పవిత్రమైన మదీనలో పర్యటించి కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి స్మృతి ఇరానీ సంచలనం సృష్టించారు. మదీన నగరంలో పర్యటించిన తొలి ముస్లిమేతర ప్రముఖురాలిగా ఆమె చరిత్రకెక్కారు. మదీనలో స్మృతి పర్యటించిన వీడియోలు ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా

మిగతా 2వ పేజీలో...



అలా ఎలా వదిలేస్తారు?

బిల్కిస్‌బానో కేసులో దోషులు 2 వారాల్లోగా లొంగిపోవాలి

వారికి రెమిషన్ ఇచ్చే హక్కు గుజరాత్ ప్రభుత్వానికి లేదు

అలా ఇవ్వడం అధికార దుర్వినియోగమే: సుప్రీం

దోషుల్లో ఒకరితో గుజరాత్ సర్కార్ కుమ్మక్కు

తీవ్రంగా ఆక్షేపించిన సుప్రీం త్రిసభ్య ధర్మాసనం

2022లో ఒక దోషి సుప్రీం కోర్టును మోసగించి, పొందిన అనుకూల ఉత్తర్వులు చెల్లవని వెల్లడి

న్యాయం అంటే ఇదీ.. కోర్టుకు కృతజ్ఞతలు: బిల్కిస్



న్యూఢిల్లీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బిల్కిస్‌బానో రేప్ కేసులో శిక్ష పడ్డ 11 మంది దోషులకు గుజరాత్ ప్రభుత్వం ఇచ్చిన రెమిషన్ (శిక్షాకాలం తగ్గింపు)ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. దోషులంతా రెండు వారాల్లోగా సంబంధిత జైలు అధికారుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది. అలోగా వారిని తిరిగి జైలుకు పంపాలని గుజరాత్ సర్కారును ఆదేశించింది. కేసు విచారణ మహారాష్ట్రలో జరిగి, వారికి శిక్ష కూడా అక్కడే పడ్డందున.. దోషులకు రెమిషన్ మంజూరు చేసే హక్కు గుజరాత్ సర్కారుకు లేదని స్పష్టం చేసింది. తనకు లేని అధికారాన్ని గుజరాత్ ప్రభుత్వం (మహారాష్ట్ర సర్కారు నుంచి) చేజిక్కించుకుని, అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆక్షేపించింది. ఈ కేసులో దోషి అయిన రాధేశ్యామ్ షా 2022లో సుప్రీంకోర్టును మోసగించడం, వాస్తవాలను తప్పుగా చూపించడం, దాచడం ద్వారా తనకు అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకున్నాడని

మిగతా 2వ పేజీలో...

'నేరస్థుల రక్షకుడు' ఎవరో

మళ్లీ తెలిసింది

బిల్కిస్ బానో కేసులో సుప్రీం తీర్పుపై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు

2

ఈ తీర్పుతో న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకం మరింత బలపడింది: ప్రియాంక

తీర్పును స్వాగతించిన సీపీఎం, టీఎంసీ

బిల్కిస్ బానో బంధువుల సంబరాలు



ప్రజాపాలనపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

12 సీట్లు గెలవాలి

అసెంబ్లీ ఎన్నికల కన్నా ఎక్కువ ఓట్లు సాధించాలి.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ పిలుపు

ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటా

వారంలో మూడు రోజులు సాయంత్రం కలుస్తా

ఈ నెల 26 తర్వాత జిల్లాల పర్యటన చేపడతా

ముఖ్యమంత్రిగా తొలి సభ ఇంద్రవెల్లిలో..

అమరుల స్మృతివనం ఏర్పాటుకు శంకుస్థాపన

సంక్రాంతి తర్వాత ఇందిరమ్మ కమిటీలు వేస్తాం

ప్రభుత్వంతో పనులు చేయిస్తానంటూ ప్రజల వద్ద ఎవరైనా డబ్బులు తీసుకుంటే చర్యలు

ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఉపేక్షించం: రేవంత్

ఐదు జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం భేటీ.. లోక్‌సభ ఎన్నికలపై సమీక్ష

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో కనీసం 12 స్థానాల్లో గెలిపించుకుందామని టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆ పార్టీ ఎమ్మెల్యేలతో అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించేలా కృషి చేయాలన్నారు. సోమవారం లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఐదు ఉమ్మడి జిల్లాలు ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పార్టీ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన అభ్యర్థులతో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26 తర్వాత తాను జిల్లాల పర్యటన చేపట్టనున్నట్లు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే పర్యటన ప్రారంభించనున్నట్లు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడిగా తన తొలి సభను ఇంద్రవెల్లిలో నిర్వహించానని, ముఖ్యమంత్రిగానూ తొలి సభను అక్కడే నిర్వహిస్తానని చెప్పారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఇంద్రవెల్లిలో అమరుల స్మారక స్మృతి వనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. స్మృతివనం నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదిలాబాద్ జిల్లా

మిగతా 13వ పేజీలో...



సీఎంను కలిసిన కోకాకోలా ప్రతినిధులు

తెలంగాణలో కొత్త ప్లాంట్లపై

కోకాకోలా ఆసక్తి!

సీఎంతో కంపెనీ ప్రతినిధుల భేటీ

బిల్ట్ మిల్లును పునరుద్ధరించాలి

13

ప్రక్రియను వేగవంతం చేయండి

ఫిన్‌క్వెస్ట్, ఐటీసీ ప్రతినిధులతో రేవంత్

కోడ్‌లో కొట్టేశారు!

ఎన్నికల సమయంలో ఫార్ములా-ఈ రేస్‌కు 54 కోట్ల ముందస్తు చెల్లింపులు

మంత్రికి తెలియదు.. క్యాబినెట్, ఆర్థిక శాఖ ఆమోదమూ లేదు

హెచ్ఎండీఏ సీనియర్ ఐఏఎస్ 'కుమ్మక్కు' నిర్ణయం

ఒప్పందమే చట్ట విరుద్ధం.. ఉల్లంఘన జరిగిందెక్కడ?

ప్రభుత్వంతో కాదు.. ఓ అధికారి స్థాయిలో జరిగిందది

నిబంధనలు పాటించని అధికారిపై క్రమశిక్షణ చర్యలు

షోకాజ్ నోటీసు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

నిధులు ఎలా విడుదల చేశారని నిలదీత

చట్టవ్యతిరేక ఒప్పందాలు కుదుర్చుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన మీపైనా చర్యలు తీసుకోవచ్చు

ఐఎఫ్ఏ నోటీసుకు రాష్ట్ర సర్కారు ఘాటు సమాధానం

తీసుకున్న రూ.కోట్ల సొమ్ము తిరిగిచ్చేయాలని డిమాండ్



హైదరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న సమయం అది (30.10.2023). కొత్త ప్రాజెక్టులకు పైసా మంజూరు చేయాలన్నా ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరి. అలాంటి సమయంలో.. అవేమీ లేకుండానే.. కనీసం సంబంధిత శాఖ మంత్రికి తెలియకుండానే.. క్యాబినెట్, ఆర్థికశాఖ అనుమతులు లేకుండానే.. హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ రేస్ నిర్వహణకు హెచ్ఎండీఏ ఒప్పందం కుదుర్చుకుంది. దాని నిర్వహణ కోసం రూ. 54 కోట్లు ముందస్తుగా చెల్లించేసింది. ముందస్తు నోటీసులేవీ ఇవ్వకుండానే ఆ ఒప్పందాన్ని అతిక్రమించి రేస్‌ను రద్దు చేసినందుకు మున్సిపల్ శాఖకు లీగల్ నోటీసులు ఇస్తామంటూ ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆటోమొబైల్స్ (ఎఫ్ఐఏ) ప్రకటించిన నేపథ్యంలో ఈ అక్రమాలన్నీ వెలుగులోకి వచ్చాయి. ఒప్పందం, నిధుల విడుదల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ

మిగతా 12వ పేజీలో...



లబ్ధిదారుల ఎంపికకు

సబ్ కమిటీ

డిప్యూటీ సీఎం నేతృత్వంలో ఏర్పాటు

ప్రజా పాలనలో 1.25 కోట్ల దరఖాస్తులు.. 25 నుంచి దరఖాస్తుల కంప్యూటరీకరణ

క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపాకే ఎంపిక.. ప్రభుత్వంపై కారుకూతలు కూస్తే ఊరుకోం

మాజీ మంత్రులైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు.. మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

రాష్ట్రాన్ని దివాలా తీయించిన బీఆర్ఎస్.. ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతోంది: పొన్నం

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సమాచార, ప్రసారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సబ్ కమిటీకి డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నేతృత్వం వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా పాలనలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తు పత్రాలను ఆధార్, రేషన్‌కార్డుతో లింక్ చేస్తామన్నారు. నిజమైన లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్ర స్థాయిలో దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. సోమవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. ప్రజా పాలనలో అభయహస్తం కింద ఆరు గ్యారెంటీ పథకాల కోసం, రేషన్ కార్డులు, ఇతర అవసరాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1.25 కోట్ల దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో ఆరు గ్యారెంటీ పథకాలకు 1.05 కోట్ల దరఖాస్తులు రాగా, రేషన్ కార్డు, భూములు, ఇతర ప్రయోజనాలకు సంబంధించి మరో 20 లక్షల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. వీటిని ఈ నెల 25 నుంచి 30వ తేదీవరకు కంప్యూటరీకరణ చేస్తామని, అనంతరం క్షేత్ర స్థాయిలో దరఖాస్తుల

మిగతా 13వ పేజీలో...



జీరో టికెట్ తీసుకోకుంటే

రూ. 500 జరిమానా

బస్సుల్లో ఉచిత ప్రయాణానికి ఒరిజినల్ గుర్తింపు కార్డు తప్పనిసరి

14

డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, ఓటరు కార్డుల్లో ఏది ఉన్నా ఓకే

టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్



నల్లగొండ మునిసిపల్ అవిశ్వాస తీర్మానానికి హాజరైన కౌన్సిలర్లు

బీఆర్ఎస్ చేజారిన నల్లగొండ మునిసిపాలిటీ

మునిసిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

నాటి ప్రతీకారాన్ని తీర్చుకున్న కాంగ్రెస్

నల్లగొండ, జనవరి 8: నల్లగొండ మునిసిపాలిటీ 'హస్త'గతంకానుంది. మునిసిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై కాంగ్రెస్ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో ఆయన చైర్మన్ పదవిని కోల్పోయారు. ఫలితంగా నల్లగొండ మునిసిపల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. గత నెలలో సైదిరెడ్డిపై కాంగ్రెస్

మిగతా 12వ పేజీలో...

పథకాలు రద్దు చేస్తే లబ్ధిదారులతో

కలిసి పోరాటం

- ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ 420 హామీలు
- అప్పులు, శ్వేతపత్రాలంటూ దాటవేసే డ్రామాలు
- రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ బీఆర్ఎస్‌తోనే సాధ్యం
- ఈ సారి నిజామాబాద్ ఎంపీ సీటు మాదే: కేటీఆర్



హైదరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): దళిత బంధు, గృహలక్ష్మి, బీసీలకు రూ.లక్ష సాయం, గొర్రెల పంపిణీ కార్యక్రమాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని.. ఇలా చేస్తే వాటి లబ్ధిదారులతో కలిసి పోరాటం చేస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. రైతు బంధు డబ్బులు వేయకుండా మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ అస్తవ్యస్త పనితీరు, పాలనను పార్టీ కేడర్ ఎప్పటికప్పుడు ఎండగట్టాలని సూచించారు. కార్యకర్తల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీలో క్షేత్రస్థాయి నుంచి మార్పులు, చేర్పులు

మిగతా 12వ పేజీలో...



భారత్ కన్నెర్ర చేస్తే జరిగేదిదే.. ట్రెండింగ్‌లో 'బాయ్‌కాట్ మాల్దీవ్స్'

సెలెబ్రిటీలు, సామాన్యుల నిరసన.. హోటళ్లు, విమాన టికెట్ల రద్దు

విమాన బుకింగ్స్ నిలిపేసిన ఈజ్‌మైట్రిప్

ఆ దేశ మంత్రుల అనుచిత వ్యాఖ్యలతో భారత్‌లో ఆగ్రహావేశాలు

లక్షద్వీప్‌పై పెరిగిన ఆసక్తి.. ఊపందుకున్న 'చలో లక్షద్వీప్'

2

భారత్-మాల్దీవుల మధ్య దౌత్య యుద్ధం!

ఢిల్లీలోని ఆ దేశ హైకమిషన్‌కు సమన్లు

మోదీపై వ్యాఖ్యల పట్ల వివరణ కోరిన ఎంఈఏ.. ఆ వెంటనే మాల్దీవుల్లోని మన రాయబారితో అక్కడి విదేశాంగ శాఖ భేటీ

ప్రభుత్వ అభిప్రాయం కాదని వెల్లడి

ఫిర్ ఏక్ బార్..

మోదీ సర్కార్!

ఇదే బీజేపీ నినాదం.. యువ ఓటర్లపై దృష్టి

రాష్ట్రవ్యాప్తంగా యువ సమ్మేళనాలు

పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో కిషన్‌రెడ్డి భేటీ

తెలంగాణలో బీఆర్ఎస్ అవసరం లేదని వ్యాఖ్య



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో యువ ఓటర్లను ఆకర్షించాలని బీజేపీ నిర్ణయించింది. వారిని పెద్దఎత్తున పార్టీలో చేర్చుకోవాలని సంకల్పించింది. ఇందుకు అనుగుణంగా, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో యువ సమ్మేళనాలు విస్తృతంగా నిర్వహించనుంది. కొత్తగా నమోదైన యువ ఓటర్ల వద్దకు వెళ్లేందుకు సిద్ధమవుతోంది. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పార్లమెంటు

మిగతా 12వ పేజీలో...

అప్పులెలా తీరుస్తారు?

6 గ్యారెంటీలు ఎలా అమలు చేస్తారు?

కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేయాలి

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి



మాల్దీవుల టూరిజం మటాష్!

భారత్‌లో ఊపందుకున్న 'చలో లక్షద్వీప్' ఉద్యమం

ట్రెండింగ్‌లో 'బాయ్‌కాట్ మాల్దీవ్స్'.. హోటల్ బుకింగ్స్, విమాన టికెట్లు రద్దు

ఆ దేశ మంత్రుల అనుచిత వ్యాఖ్యలతో భారత్‌లో తీవ్రమవుతున్న ఆగ్రహావేశాలు

నీలి రంగులో మెరిసిపోయే సముద్రపు సోయగాలు.. తెల్లటి ఇసుక తిన్నెలు.. ఆహ్లాదాన్నిచ్చే ప్రకృతి అందాలు.. వెరసి మాల్దీవులు..! హాలిడేస్‌లో జీవితాన్ని సరదాగా గడపడానికి అందరూ ఎంచుకునే అందమైన పర్యాటక ప్రాంతం. భారతీయులు ఎక్కువగా ఇష్టపడే హాలిడే స్పాట్..! అయితే ఇదంతా ఇక గతం..! ప్రధాని మోదీపై మాల్దీవులకు చెందిన ముగ్గురు మంత్రులు మరియం షియూనా, మాల్షా షరీఫ్, మజూమ్ మాజిద్.. చేసిన అనుచిత వ్యాఖ్యల అనంతరం పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఆ వ్యాఖ్యలపై ఆగ్రహావేశాలతో ఉన్న భారతీయులంతా ఇప్పుడు మాల్దీవులను బహిష్కరిస్తున్నారు. బాలీవుడ్ సెలెబ్రిటీల నుంచి బడాబడా వ్యాపారులు, సాధారణ పర్యాటకుల వరకూ అందరూ 'బాయ్‌కాట్ మాల్దీవ్స్'కు మద్దతు తెలుపుతున్నారు. గతవారం లక్షద్వీప్‌లో పర్యటించిన ప్రధాని మోదీ బీచ్‌లను సందర్శించి అక్కడ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చిన తర్వాత ఈ రగడ మొదలైంది. మాల్దీవుల మంత్రులు భారత్‌కు వ్యతిరేకంగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. మోదీని విదూషకుడిగా.. ఇజ్రాయెల్ చేతిలో కీలుబొమ్మగా అభివర్ణించారు. దీనిపై దుమారం రేగడంతో మాల్దీవుల ప్రభుత్వం ముగ్గురు మంత్రులను సస్పెండ్ చేసింది. అయినప్పటికీ భారతీయుల ఆగ్రహం చల్లారలేదు. చాలామంది ఈ ద్వీపదేశానికి వెళ్లాల్సి ఉన్న తమ పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు. గతేడాది ప్రపంచవ్యాప్తంగా మొత్తం 17,57,939 మంది పర్యాటకులు మాల్దీవులకు వెళ్లారు. ఇందులో 2,09,198లక్షల మందితో భారత్ టాప్‌లో ఉండగా.. రష్యా (2,09,146), చైనా (1,87,118) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మాల్దీవుల ఆర్థిక వ్యవస్థకు పర్యాటక రంగమే కీలకం. కాబట్టి ఇప్పుడు భారతీయులు దీన్ని బహిష్కరిస్తే ఆ దేశ ఆర్థిక రంగానికి కోలుకోలేని దెబ్బేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

8వేల హోటల్ బుకింగ్స్ రద్దు..!

భారత్‌లోని సోషల్ మీడియాలో ఇప్పుడు 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' అనే హ్యాష్‌ట్యాగ్ తెగ ట్రెండ్ అవుతోంది. అయితే ఆ దేశంపై ఆగ్రహావేశాలు కేవలం సోషల్ మీడియా పోస్టులకే పరిమితం కాలేదు. వేలాది మంది భారతీయులు ఇప్పటికే వచ్చే నెలల్లో అక్కడికి వెళ్లేందుకు బుక్ చేసుకున్న విమాన టికెట్లు, హోటల్ రూమ్‌లను రద్దు చేసుకుంటున్నారు. వివాదం నేపథ్యంలో ఇప్పటి వరకూ దాదాపు 8000 హోటల్ బుకింగ్స్, 2,500 విమాన టికెట్లను భారతీయులు రద్దు చేసుకున్నారు. కాగా, ప్రధాని మోదీ పర్యటన తర్వాత భారత్‌లోని ఒక చిన్న కేంద్రపాలిత ప్రాంతమైన లక్షద్వీప్‌పై ఆసక్తి పెరిగింది. అయితే.. మాల్దీవుల మంత్రులు చేసిన అనుచిత వ్యాఖ్యల తర్వాత సామాజిక మాధ్యమాల్లో 'చలో లక్షద్వీప్' ఉద్యమం ఊపందుకుంది.

భారత్‌పై మాల్దీవులు ఎలా ఆధారపడుతోంది?

మాల్దీవుల్లో పర్యాటక పరిశ్రమకు మద్దతునిచ్చేందుకు ఈ దేశంలోని 34 ద్వీపాల్లో నీరు, పారిశుధ్యం వంటి మౌలికవసతుల ప్రాజెక్టుల్లో భారత్ భాగస్వామ్యమైందని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. హనిమధూ అంతర్జాతీయ విమానాశ్రయ పునర్నిర్మాణ ప్రాజెక్టు, గన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు రీ డెవలప్‌మెంట్ వంటి ఎనిమిది ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. భారత్‌లోని లగ్జరీ హోటళ్లయిన తాజ్, ఒబెరాయ్ వంటి సంస్థలు కూడా ఇక్కడ తమ సేవలందిస్తున్నాయి. అలాగే ఇక్కడి పరిశ్రమల్లో మానవ వనరుల అవసరాన్ని కూడా భారత్ భర్తీ చేస్తోంది. ఈ దేశం పర్యాటకంతోపాటు వ్యవసాయం, చేపల వేటపై ఎక్కువగా ఆధారపడుతోంది. దీనికి 1974 నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఐలాండ్ రిసార్ట్స్ అభివృద్ధి, సముద్ర ఉత్పత్తుల ఎగుమతి, వివిధ వాణిజ్య వెంచర్ల కోసం రుణ సాయం అందిస్తోంది.

నష్ట నివారణ చర్యలు చేపట్టిందా..!

భారత్ అవసరం తమకు ఎంతగానో ఉందని ఆ దేశ నాయకులు గుర్తించారు. అందుకే జరగబోయే నష్టాన్ని గుర్తించి నష్ట నివారణ చర్యలకు దిగుతున్నారు. మాల్దీవుల విదేశాంగ మంత్రి మూసా జమీర్ మాట్లాడుతూ.. విదేశీ నేతలపై ఇలాంటి వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదని అన్నారు. ఏదేమైనప్పటికీ ఆయా వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమని, వాటితో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. తమ దేశం తన భాగస్వాములందరితో ముఖ్యంగా పొరుగు దేశాలతో సానుకూలంగా ఉండేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

లక్ష్యద్వీప్‌పై ఆసక్తి పెరిగింది: మేక్‌మైట్రిప్..

లక్షద్వీప్‌లో ప్రధాని మోదీ పర్యటన తర్వాత తమ ఆన్‌లైన్ వేదికలో ఈ దీవుల కోసం వెతికే వారి సంఖ్య 3,400 శాతం పెరిగిందని ప్రముఖ ఆన్‌లైన్ సంస్థ మేక్‌మై ట్రిప్ సోమవారం ఎక్స్ (ట్విటర్) వేదికగా వెల్లడించింది. అద్భుతమైన ఈ బీచ్‌లను అన్వేషించేలా భారత పర్యాటకులను ప్రోత్సహించేందుకు త్వరలోనే సరికొత్త ఆఫర్లు, డిస్కౌంట్లు అందజేస్తామని ఆ సంస్థ ప్రకటించింది.. మరోవైపు, మాల్దీవుల మంత్రుల వ్యాఖ్యల నేపథ్యంలో దేశీయ ప్రయాణ సంస్థ ఈజ్‌మైట్రిప్ ఆ దేశానికి విమాన టికెట్ల బుకింగ్‌ను నిలిపివేసింది. ఈ విషయాన్ని ఆ సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన నిషాంత్ పిట్టి ఎక్స్ (ట్విటర్)లో పేర్కొన్నారు. 2008లో ప్రారంభమైన ఈ సంస్థ ఢిల్లీ కేంద్రంగా సేవలందిస్తోంది. అలాగే ఇటీవల మోదీ పర్యటించిన లక్షద్వీప్‌ను ప్రమోట్ చేయడానికి ఈ సంస్థ ప్రత్యేక ఆఫర్లతో ముందుకొచ్చింది.

లక్షద్వీప్‌లో డీశాలినేషన్‌కు రెడీ: ఇజ్రాయెల్

ఒకపక్క భారత్-మాల్దీవుల మధ్య వివాదం ముదురుతున్న తరుణంలో.. లక్షద్వీప్‌లో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా ఇజ్రాయెల్ కీలక నిర్ణయం తీసుకుంది. లక్షద్వీప్‌లో డీశాలినేషన్ (లవణ నిర్మూలన) కార్యక్రమాన్ని చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. 'డీశాలినేషన్ ప్రక్రియను ప్రారంభించాలన్న భారత ప్రభుత్వ అభ్యర్థన మేరకు మేం గతేడాది నుంచి లక్షద్వీప్‌లో ఉన్నాం. మంగళవారం నుంచే ఆ పనులు ప్రారంభిస్తున్నాం' అని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం అధికారిక ఎక్స్ (ట్విటర్)లో వెల్లడించింది. లక్షద్వీప్‌లోని కొన్ని బీచ్‌ల ఫొటోలు పంచుకుంటూ.. "సహజసిద్ధమైన, నీటి అడుగున ఉండే అందాలను ఇప్పటికీ చూడని వారికోసం కొన్ని చిత్రాలు ఇక్కడ ఉన్నాయి" అని ట్వీట్ చేసింది.

- సెంట్రల్ డెస్క్



అన్ని వేళలా అండగా ఉన్నా కూడా


2021లో ప్రపంచవ్యాప్తంగా కొవిడ్ విజృంభిస్తున్న సమయంలో మాల్దీవులకు భారత్ వ్యాక్సిన్లు అందించింది. భారత్ నుంచి వ్యాక్సిన్లు పొందిన తొలి దేశం ఇదే కావడం గమనార్హం. వ్యాక్సిన్ల ఎగుమతి ఆంక్షలు, దేశీయ అవసరాలు ఉన్నప్పటికీ ఆ ఏడాది ఆ దేశానికి మూడు నెలల్లోనే 3 లక్షల డోసులు పంపించింది. ఇప్పుడే కాదు కొన్నేళ్లుగా భారత్ ఈ దేశానికి ఆపన్న హస్తం అందిస్తూనే ఉంది. కొవిడ్ సమయంలో వూహాన్ నుంచి మాల్దీవుల ప్రజలను తరలించడంలో సహాయం చేయడం.. మాలేకు వైద్య బృందాలను పంపడం.. హనిమధూ విమానాశ్రయ అభివృద్ధి.. ఇలా మాల్దీవులకు భారత్ చేసిన సహాయాల జాబితా చాలా పెద్దదే. అలాగే పలువురు మాల్దీవుల అధికారులు భారత్‌లోని వివిధ ఇనిస్టిట్యూట్‌లలో శిక్షణ పొందుతున్నారు.

భారత్-మాల్దీవుల మధ్య దౌత్య యుద్ధం!

» ఢిల్లీలో మాల్దీవుల హైకమిషన్‌కు సమన్లు

న్యూఢిల్లీ/మాలె, జనవరి 8: ప్రధాని మోదీపై మాల్దీవ్స్ మంత్రులు, ఎంపీ కామెంట్ చేయడంపై భారత్‌లోని ఆ దేశ హైకమిషనర్ ఇబ్రహీం షాహిబ్‌కు విదేశాంగ శాఖ(ఎంఈఏ) సోమవారం సమన్లు జారీ చేసింది. దాంతో ఆయన పార్లమెంట్ సౌత్‌బ్లాక్‌లోని ఎంఈఏ కార్యాలయంలో ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఎంఈఏ అధికారులు మాల్దీవ్స్ మంత్రుల వ్యాఖ్యలపై వివరణ కోరినట్లు తెలిసింది. ఇది జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే.. మాల్దీవుల ఎంఈఏ అక్కడి భారత హైకమిషనర్ మును మహావర్‌ను పిలిపించి, భేటీ అయ్యింది. అయితే.. ఇది ముందస్తుగా నిర్ణయించిన సమావేశమని మాలెలోని భారత హైకమిషనర్ కార్యాలయం ఎక్స్‌లో పోస్టు చేయగా.. మాల్దీవుల మీడియా సంస్థలు మాత్రం మంత్రుల పోస్టులపై మాల్దీవ్స్ ఎంఈఏ వివరణ ఇచ్చినట్లు కథనాలను ప్రసారం చేశాయి. "మంత్రులు, ఎంపీ వ్యాఖ్యలు పూర్తిగా వారి వ్యక్తిగతం. ఆ వ్యాఖ్యలతో ప్రభుత్వానికి సంబంధం లేదు. భారత్‌తో ఎప్పటికీ స్నేహహస్తాన్ని కోరుకుంటాం" అని భారత హైకమిషనర్‌కు తెలిపినట్లు ఆ కథనాల్లో పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా, భారత్‌తో దౌత్య సంబంధాలు దెబ్బతినే పరిస్థితి ఉత్పన్నమైన నేపథ్యంలో మాల్దీవుల అధ్యక్షుడు మయిజ్జు హడావుడిగా చైనా పర్యటనకు వెళ్లడం గమనార్హం. మాల్దీవులను సమానస్థాయి భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు చైనా అధికారిక పత్రిక గ్లోబల్ టైమ్స్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.

లోకం తీరు



మదీనాలో స్మృతి ఇరానీ!

(మొదటి పేజీ తరువాయి)

మారడంతో సంప్రదాయక ముస్లిం వర్గాలు ఉలిక్కిపడ్డాయి. ఇది నమ్మలేని చాలామంది ఫోన్లు చేసి మరీ ఆరా తీశారు. హజ్ కోటాపై సౌదీ అరేబియాతో ఒప్పందం చేసుకోవడానికి స్మృతి ఇరానీ, విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి వి.మురళీధరన్ రెండ్రోజుల పర్యటన నిమిత్తం సౌదీకి వచ్చారు. ఆదివారం సౌదీ అరేబియా హజ్ మంత్రితో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం సోమవారం స్మృతి తన అధికారిక బృందంతో కలిసి జెద్దా నుంచి రైలులో మదీనకు వెళ్లారు. అక్కడ మస్జీదే నబ్వీ సరిహద్దు ప్రహరీ గోడ వరకు వెళ్లిన ఆమె.. అనంతరం మస్జీదే ఖుబా, ఉహద్ పర్వత ప్రాంతాన్ని కూడా సందర్శించారు. మదీనలోని భారత పర్యాటకులను కలసి యాత్రకు సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. 'ఇస్లాం ఆవిర్భవించిన ఈ ప్రాంతాన్ని సందర్శించడం చరిత్రాత్మకం. సౌదీ అధికారుల సాయంతో మదీనలోని పలు పవిత్ర స్థలాలను దర్శించుకున్నాం' అని 'ఎక్స్'లో పేర్కొంటూ పలు ఫొటోలను స్మృతి పోస్టు చేశారు. మదీనలో సాధారణంగా ముస్లింలకు మాత్రమే ప్రవేశముంటుంది కానీ గత కొంతకాలంగా ముస్లిమేతరులను కూడా అనుమతిస్తున్నారు. అయితే వీరు మస్జీదే నబ్వీ సరిహద్దు గోడ వరకు మాత్రమే వెళ్లవచ్చు.



'నేరస్థుల రక్షకుడు' ఎవరో మళ్లీ తెలిసింది

» బిల్కిస్ కేసులో సుప్రీం తీర్పుపై రాహుల్

న్యూఢిల్లీ, జనవరి8 (ఆంధ్రజ్యోతి): బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో 'నేరస్థుల రక్షకుడు' ఎవరో మరోసారి దేశానికి తెలిసిపోయిందని కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో లబ్ధి కోసం న్యాయాన్ని హత్య చేసే ధోరణి ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమని ఆయన ఎక్స్ వేదికగా విమర్శించారు. బిల్కిస్‌బానో పోరాటం బీజేపీ ప్రభుత్వ అహంకారపూరిత విధానానికి వ్యతిరేకంగా సాధించిన విజయానికి చిహ్నమని రాహుల్ అన్నారు. బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు తీర్పుతో బీజేపీ అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలకు సంబంధించిన ముసుగు తొలగిపోయిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక అన్నారు. ఈ తీర్పుతో ప్రజలకు న్యాయ వ్యవస్థపై ఉన్న నమ్మకం మరింత బలపడిందని తెలిపారు. సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నట్లు నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా పేర్కొన్నారు. బిల్కిస్ బానో కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పు ఎంతో బలమైనది, ధైర్యమైనదని బెంగాల్ సీఎం మమతాబెనర్జీ అన్నారు. సుప్రీంతీర్పు గుజరాత్ ప్రభుత్వానికి గట్టి చెంప దెబ్బలాంటిదని సీపీఎం నేత బృందాకారాట్ చెప్పారు. "బిల్కిస్ బానోకు ఈ రోజు న్యాయం జరిగింది. సామూహిక అత్యాచారం కేసు సాక్షుల్లో నేనూ ఒకణ్ని. గుజరాత్ సర్కారు నిర్ణయాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు 11 మంది నిందితులు వెంటనే లొంగిపోవాలని ఆదేశించింది. మాకు ఈరోజు న్యాయం జరిగినట్లు భావిస్తున్నా" అని అబ్దుల్ రజాక్ మన్సూరి చెప్పారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నా

» బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బిల్కిస్ బానో కేసులో దోషుల ముందస్తు విడుదలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె ఎక్స్ ద్వారా స్పందించారు. మహిళల పట్ల నిబద్ధత విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బలమైన సందేశాన్ని ఇస్తోందని, న్యాయం గెలిచిందన్నారు. బిల్కిస్ బానో దోషులను ముందస్తు విడుదల చేస్తూ గుజరాత్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు సరికాదని, వాటిని రద్దు చేయాలని కోరుతూ గతేడాది మేనెలలో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు.

సుప్రీం తీర్పు హర్షణీయం: కేటీఆర్

బిల్కిస్‌బానో కేసులో బాధితులకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టు ఇచ్చిన అనూహ్యమైన తీర్పు హర్షణీయమని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా న్యాయమూర్తులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గుజరాత్ ప్రభుత్వంపై, అధికార దుర్వినియోగానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని తాను ఆశిస్తున్నానన్నారు. దేశంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన అన్ని ప్రభుత్వాలు తమ రాజకీయ అవసరాలకనుగుణంగా పనిచేయడం కుదరదనే విషయాన్ని ఈ తీర్పు గుర్తుచేస్తుందని పేర్కొన్నారు.

అలా ఎలా వదిలేస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్న ధర్మాసనం.. 2022 మే 13న అతడి రెమిషన్ పిటిషన్‌ను పరిశీలించాలంటూ గుజరాత్ సర్కారుకు అప్పట్లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. గత తీర్పులను పరిగణనలోకి తీసుకోకుండా ఇచ్చినందున కూడా ఆ తీర్పు చెల్లదని తేల్చిచెప్పింది. సదరు దోషితో కలిసి వ్యవహరించిందంటూ గుజరాత్ సర్కారుపై సుప్రీం ధర్మాసనం తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ కేసులో 11 మంది దోషుల శిక్షకాలాన్ని తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ బిల్కిస్ బానో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరికొందరు కూడా ఈ కేసులో ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలు చేశారు. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆ కేసులపై ఆగస్టులో ప్రారంభించి 11 రోజులపాటు విచారణ జరిపి.. అక్టోబరు 12న తీర్పు రిజర్వు చేసింది. 251 పేజీల తీర్పును సోమవారం వెల్లడించింది. నేర శిక్షా స్మృతిలోని సెక్షన్ 432 ప్రకారం దోషులకు శిక్షకాలం తగ్గించడానికి గుజరాత్ ప్రభుత్వానికి అధికారం లేదని.. ఈ కేసు విచారణ మహారాష్ట్రలో జరిగింది కాబట్టి, శిక్షా కాలాన్ని తగ్గించాలనుకుంటే ఆ అధికారం మహారాష్ట్ర ప్రభుత్వానికే ఉంటుందని ధర్మాసనం పేర్కొంది.

కేసు పూర్వాపరాలు..

2002లో గుజరాత్‌లో గోద్రా రైలు దహనం అనంతరం ఆ రాష్ట్రవ్యాప్తంగా ఘర్షణలు చెలరేగాయి. ఆ ఏడాది మార్చి 3న, ఐదు నెలల గర్భిణిగా ఉన్న బిల్కిస్ బానోపై కొంతమంది అత్యాచారం చేశారు. ఆమె మూడేళ్ల కూతురుతో సహా ఏడుగురు కుటుంబ సభ్యులను హత్యచేశారు. విచారణ అనంతరం ముంబై సెషన్స్ కోర్టు 2008లో.. 11 మందిని దోషులుగా నిర్ధారించి జీవిత ఖైదు విధించింది. 2017 మేలో బాంబే హైకోర్టు ఆ తీర్పును సమర్థించింది. 2019లో సుప్రీంకోర్టు సైతం.. బిల్కిస్‌బానోకు రూ.50 లక్షల పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు ఇవ్వాల్సిందిగా గుజరాత్ సర్కారును ఆదేశించింది. ఇదిలా ఉండగా.. దోషులలో ఒకరైన రాధేశ్యామ్ షా శిక్షకాలాన్ని తగ్గించాలన్న తన అభ్యర్థనను పరిశీలించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని 2019లో గుజరాత్ హైకోర్టుకు వెళ్లాడు. కానీ, ఆ హక్కు మహారాష్ట్ర సర్కారుకే ఉందంటూ హైకోర్టు అతడి అభ్యర్థనను తోసిపుచ్చింది. 2020లో మరోసారి అతడు గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా.. రెండోసారీ అతడి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేదు. అనంతరం అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. కానీ.. తాను ఇదే అభ్యర్థనతో గుజరాత్ హైకోర్టును ఆశ్రయించిన విషయాన్ని, కోర్టు రెండుసార్లు తిరస్కరించిన విషయాన్ని, రెమిషన్ కోరుతూ మహారాష్ట్ర సర్కారుకు దరఖాస్తు చేసుకున్న విషయాన్నీ సుప్రీం ధర్మాసనం వద్ద దాచాడు. సుప్రీం కోర్టు అతడి అభ్యర్థనను పరిశీలించి.. నేరం గుజరాత్‌లోనే జరిగింది కాబట్టి అతడి రెమిషన్ పిటిషన్‌ను పరిశీలించాల్సింది గుజరాత్ ప్రభుత్వమేనని అభిప్రాయపడింది. రాధేశ్యామ్ పిటిషన్‌ను పరిశీలించాలంటూ 2022 మేలో గుజరాత్ సర్కారును ఆదేశించింది. దీంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం 2022 ఆగస్టు 15న అతడిని విడుదల చేసింది. రాధేశ్యామ్ షా విషయంలో సుప్రీం తీర్పు ఆధారంగా మిగతా దోషులను కూడా విడుదల చేసింది. ఆ నిర్ణయంపై దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమయ్యాయి. కాగా.. సుప్రీం తీర్పు వెలువడగానే బిల్కిస్‌బానో బంధువులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకొన్నారు.



బిల్కిస్ బానో కేసులో దోషులు 2022 ఆగస్టు 15న జైలు నుంచి విడుదలైనప్పటి చిత్రం(ఫైల్)

'నేడు నాకు నిజంగా కొత్త సంవత్సరం వచ్చినట్లుంది. మనసు తేలికపడి, కన్నీళ్లు వచ్చేశాయి. ఏడాదిన్నర కాలంలో మొట్టమొదటిసారిగా మనసారా నవ్వగలిగాను. నా పిల్లల్ని హత్తుకోగలిగాను. నా గుండెలపై నుంచి కొండంత బండరాయిని తొలగించినట్లయింది. దీంతో హాయిగా ఊపిరి పీల్చుకోగలిగాను. న్యాయం అంటే ఇదీ. నాకూ, నా పిల్లలకు, మహిళలందరికీ న్యాయం చేసినందుకు, అందరికీ సమన్యాయం జరుగుతుందన్న నమ్మకం కలిగించినందుకు గౌరవనీయ సుప్రీం కోర్టుకు కృతజ్ఞతలు'. - బిల్కిస్ బానో



ఈడీ మళ్లీ వస్తే జనం మళ్లీ తరుముతారు

కోల్‌కతా, జనవరి 8: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)పై పశ్చిమబెంగాల్ వ్యవసాయ శాఖ మంత్రి శోభన్‌దేవ్ ఛటోపాధ్యాయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈడీ అధికారులు తనిఖీల పేరుతో మళ్లీ వస్తే జనం మరోసారి తరుముతారని అన్నారు. గత శుక్రవారం బెంగాల్ అటవీశాఖ మంత్రి జ్యోతిప్రియ మల్లిక్ అనుచరుడు షాజహాన్ షేక్ నివాసంలో తనిఖీలు నిర్వహించిన ఈడీ అధికారులపై తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డ విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శోభన్‌దేవ్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం వద్ద ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్నుశాఖ ఉంటే.. తమ వద్ద వారి దుర్మార్గాలను ఎదుర్కొనే యువత ఉన్నారని వ్యాఖ్యానించారు.

దివ్యాంగులకు సాయం కోసం హెల్ప్‌లైన్

గోవా, జనవరి 8: దివ్యాంగులకు ఏ సమయంలోనైనా ఎలాంటి సాయమైనా అందించేందుకు తొలిసారిగా జాతీయ స్థాయి హెల్ప్‌లైన్ సోమవారం ఇక్కడ ప్రారంభమయింది. టోల్ ఫ్రీ నెంబరైన 1800 22 2014కు ఫోన్ చేసి తమ సమస్యను వివరించి సాయం కోరవచ్చు. ఇది 24/7 విధానంలో పని చేస్తుంది. ఇక్కడ నిర్వహిస్తున్న పర్పుల్ ఫెస్టివల్ ఇంటర్నేషనల్‌లో కేంద్ర సామాజిక న్యాయం శాఖ సహాయ మంత్రి రామదాస్ అథావలే, వికలాంగుల వ్యవహారాల శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌లు ప్రారంభించారు. 21 అంగవైకల్యాల్లోని 153 కేటగిరీలకు సంబంధించి ఎలాంటి సమాచారం కావాల్సి వచ్చినా అందజేస్తారు. విద్య, ఉపాధి, శిక్షణ సహా ఇతర సమాచారాన్ని ఈ నెంబరుకు ఫోన్ చేసి పొందవచ్చు.

ఆ వృద్ధ దంపతులు టికెట్లు కొంటే లాటరీ పక్కా!

20 ఏళ్లలో రూ.200 కోట్ల సంపాదన



న్యూఢిల్లీ, జనవరి 8: లాటరీ తగలడం అంటే మాటలా? అదృష్టం ఉండాలి అని అనుకుంటూ ఉంటాం. అమెరికాలోని ఆ వృద్ధ దంపతులకు మాత్రం టికెట్లు కొన్నప్పుడల్లా లాటరీ తగిలి తీరుతుంది. ఏదైనా మాయో.. మంత్రమో అనుకునేరు. లాటరీ నిర్వహణలోని లొసుగులే వారికి కనకవర్షం కురిపిస్తున్నాయి. పక్కాగా లాటరీ తగులుతుందని లెక్కలు వేసుకొని.. కొన్న టికెట్ల విలువకు 40-50% మేర లాభం వస్తుందని బేరీజు వేసుకొని మరీ టికెట్లు కొంటారు. ఇలా 20 ఏళ్లలో ఏకంగా 200 కోట్లు సంపాదించారు. మిషిగాన్‌లోని ఎవర్ట్ ప్రాంతంలో జెర్రీ-మార్జ్ సెల్బీ అనే దంపతులు 2003లో విన్‌ఫాల్ అనే లాటరీ గేమ్ గురించి జెర్రీ తెలుసుకున్నారు. ఆయనకు గణిత ప్రజ్ఞ మెండు. టికెట్ల కొనుగోలులో వ్యూహం ప్రకారం వెళితే పక్కాగా డబ్బు సంపాదించవచ్చునని తెలుసుకున్నారు. విన్‌ఫాల్ జాక్‌పాట్ సొమ్ము రూ.40 కోట్లకు చేరినప్పుడు.. తీసిన ఆ 'బంపర్ టికెట్' ఎవ్వరికీ తగలకపోతే రోల్‌డౌన్ చేస్తారు. అప్పటికే అమ్ముడుపోయిన, అమ్మకానికి చూపిన కొన్ని టికెట్లకు ఆ డబ్బు వెళుతుంది. ఈ లెక్క ప్రకారం జాక్‌పాట్ టికెట్‌లోని చివరి నాలుగు నంబర్లలో నాలుగు, మూడు, రెండు, కనీసం ఒక నంబరు ఉన్నా.. లాటరీ రూపంలో పెద్ద మొత్తంలో డబ్బు వస్తుంది. బంపర్ టికెట్‌కే లాటరీ తగిలినా.. ఆ టికెట్ నంబర్లతో సంబంధం ఉన్న కొన్ని టికెట్లకు ఎంతో కొంత ఇస్తారు. దీన్నే జెర్రీ తన 'సంపాదన'కు ఆధారంగా చేసుకున్నారు. డాలర్‌కు ఒక టికెట్ చొప్పున 1,100 డాలర్లతో 1,100 టికెట్లు కొంటే ఎంతలేదన్నా 1,900 డాలర్లు పొందొచ్చని జెర్రీ లెక్కలు వేసుకున్నారు. తొలుత ప్రయోగాత్మకంగా 3,600 డాలర్లు వెచ్చించి టికెట్లు కొని.. 6,300 డాలర్లు సంపాదించారు. తర్వాత టికెట్ల కొనుగోలుకు ప్రత్యేక సంస్థనే ఏర్పాటు చేసుకొని.. తనకు తెలిసినవాళ్లను సభ్యులుగా చేర్చుకున్నారు. విన్‌ఫాల్ కంపెనీ నుంచి లాటరీ ప్రకటన విడుదలయ్యాక కనీసం ఒక్క లాటరీ అయినా తగలాంటే ఎన్ని టికెట్లు కొనాలి? పెట్టుబడి పోనూ ఎంత మిగులుతుంది? అనేవి లెక్కగట్టేందుకు తనకు రెండే రెండు నిమిషాలు పడుతుందని జెర్రీ చెప్పారు. తొమ్మిదేళ్లలో 26 మిలియన్ డాలర్లు సంపాదించామని, దీనికి సంబంధించి 8మిలియన్ డాలర్ల మేరకు పన్ను చెల్లించామని జెర్రీ సతీమణి సెల్బీ చెప్పారు.

అమెరికన్లు భారత్ బాట పట్టాలి

» సాంకేతికతలో తిరుగులేని స్థాయికి ఇండియా

» పీఈఎస్ వర్సిటీ ఛాన్స్‌లర్ ఎంఆర్ దొరస్వామి

» ఆయన 'ఆత్మకథ'ను ఆవిష్కరించిన సుధామూర్తి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుధామూర్తి

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అమెరికన్లు విద్య కోసం భారత్ బాట పట్టాలన్నదే తన ఆకాంక్ష అని పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ యూనివర్సిటీ (పీఈఎస్) చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి అన్నారు. భారత్ ఆవిష్కరణల దిశగానే కాకుండా సాంకేతికతలోనూ తిరుగులేని స్థాయికి చేరిందని చెప్పారు. పీఈఎస్ విద్యా సంస్థల స్వర్ణోత్సవాలను బెంగళూరులో 4రోజులు ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు వేడుకలకు హాజరయ్యారు. విదేశీ యూనివర్సిటీలకు ఏమాత్రం తీసిపోని రీతిలో రూ.400 కోట్లతో నిర్మించిన గోల్డెన్ జూబ్లీభవన్‌లో ఉత్సవాలు జరిగాయి. ఈ వేడుకల్లో దొరస్వామి రచించిన 'కనసు ననసాయితు'(కల సాకారమైంది) పుస్తకాన్ని ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొరస్వామి మాట్లాడుతూ "చిత్తూరు జిల్లాలోని రైతు కుటుంబంలో జన్మించి చదువు కోసం బెంగళూరు వచ్చాను. 1972లో 40 మంది విద్యార్థులతో పీయూ కళాశాలను ప్రారంభించి, నేడు దాన్ని దేశంలోనే ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీగా తీర్చిదిద్దాను. కుప్పంలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశాను. బెంగళూరులోనూ మెడికల్ కాలేజీ అందుబాటులోకి వచ్చింది. నాకు సమాజం ఎంతో ఇచ్చింది. బెంగళూరులో ప్రభుత్వ బడిని దత్తత తీసుకుని విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాను"అని అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి, మెడికల్ కళాశాలల డైరెక్టర్ రూపా సురేశ్ పాల్గొన్నారు.

చంద్రుడి వైపు నాసా పెరెగ్రైన్ ల్యాండర్-1

వచ్చేనెల 2న మూన్‌పై ల్యాండింగ్

న్యూఢిల్లీ, జనవరి 8: చంద్రునిపై పరిశోధనల కోసం పెరెగ్రైన్ ల్యాండర్-1ను అమెరికా విజయవంతంగా ప్రయోగించింది. సోమవారం తెల్లవారుజామున ఫ్లోరిడాలోని కేప్ కెనెవెరల్ స్పేస్ స్టేషన్ నుంచి పెరెగ్రైన్ ల్యాండర్-1తో కూడిన వుల్కాన్ సెంటోర్ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. 2024 ఫిబ్రవరి 2న ఇది చందమామపై ల్యాండ్ కానుంది. 1972 తర్వాత అపోలో మిషన్ తర్వాత అంటే.. 51ఏళ్ల తర్వాత నాసా నుంచి అమెరికా చంద్రుడిపైకి పంపుతున్న లూనార్ మిషన్ ఇదే కావడం గమనార్హం. 2030 తర్వాత చంద్రుడిపైకి మానవ సహిత మిషన్‌కు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ వాతావరణ పరిస్థితులను పెరెగ్రైన్ ల్యాండర్-1 అధ్యయనం చేయనుంది. ల్యాండర్‌లోని ఐదు పేలోడ్స్, 15 ఇతర భాగాలు చంద్రుడి మీద రేడియేషన్ స్థాయులు, నీటి, మంచు జాడలు, అయిస్కాంత క్షేత్రాలపై అధ్యయనం చేయనున్నాయి.

పత్రాల పాత్రంలో నలిగి..

- సీసీఐ నిబంధనలతో పత్తి రైతుకు గోస
- భూమి తాలూకు పత్రాలు లేక ఇక్కట్లు
- దళారుల చేతిలో గిరిజనేతర రైతుల దగా
- క్వింటాకు రూ.500-700 దాకా నష్టం


ఆసిఫాబాద్ పట్టణంలోని సీసీఐ కొనుగోలు కేంద్రంలో ఆరు బయట నిల్వ చేసిన పత్తి

ఆసిఫాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిబంధనలతో పత్తిరైతు దగా పడుతున్నాడు. పంటను కొనుగోలు చేసేందుకు ధ్రువీకరణ పత్రాలు అడుగుతుండటంతో ఆ పత్రాలు లేని రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. వాస్తవానికి సీజన్‌కు ముందే మండల వ్యవసాయ అధికారుల వద్ద పంట తాలుకు వివరాలు నమోదు చేయించాలి. సాగుభూమి సర్వేనంబరు, ఎంత విస్తీర్ణంలో పంట వేస్తున్నారు? అనే వివరాలు రాయించాలి. పంట చేతికొచ్చిన తర్వాత సీసీఐ.. సదరు ధ్రువీకరణ పత్రాల ఆధారంగానే పంటను కొనుగోలు చేస్తుంది. అయితే ఏజెన్సీ ప్రాంతంలోని 'వన్ ఆఫ్ సెవంటీ' నోటిఫై ల్యాండ్స్‌లో దాదాపు 25వేల నుంచి 30వేల దాకా గిరిజనేతర రైతులు ఉన్నారు. వీరంతా 1970 తర్వాత ఇక్కడికి రావడంతో పట్టాలు రాలేదు. ఫలితంగా వీరి సాగు వివరాలు మండల వ్యవసాయ కార్యాలయాల్లో నమోదయ్యే ప్రశ్న సహజంగానే తలెత్తదు. ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తంగా 17 సీసీఐ కొనుగోలు కేంద్రాలున్నాయి. కేంద్ర ప్రభుత్వం పత్తికి రూ.7,020 మద్దతు ధర నిర్ణయించింది. అదే సమయంలో దళారులు కేవలం రూ.6,400 నుంచి రూ.6,800 దాకా ధర చెల్లించి కొంటున్నారు. అయితే గిరిజనేతర రైతులకు భూ రికార్డుల వివరాలేవీ లేకపోవడంతో దళారులనే ఆశ్రయించి.. క్వింటాకు రూ.500-700 దాకా నష్టపోతున్నారు. దళారులేమో సీసీఐ అధికారుల అండతో నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రైతుల పేరిట దర్జాగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రైతుల్లో కొందరి వద్ద ధ్రువపత్రాలు ఉన్నా చెత్త, తేమ పేరిట సీసీఐ కొర్రీలు పెడుతుండటంతో విసిగిపోయి దళారులకే అమ్ముకుంటున్నారు.

కొనుగోలు చేసింది 6లక్షల క్వింటాళ్లే..

జిల్లాలో ఈ ఏడాది మొత్తం 3,15,443 వేల ఎకరాలలో పత్తి పంట సాగు చేసినట్లు అంచనా. ఈ లెక్కన మంచి దిగుబడి వస్తే జిల్లాలో 21 లక్షల క్వింటాళ్లకు పైగా పత్తి మార్కెట్‌కు రావాల్సి ఉంది. ప్రస్తుతం సీజన్ ముగింపు దశకు వచ్చినా మార్కెట్‌కు కేవలం 6.07 లక్షల క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఇందులో సీసీఐ ద్వారా 4.50 వేల క్వింటాళ్లు కొనుగోలు చేశారు. ప్రైవేట్ వ్యాపారులు 1.57 వేలక్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. దీన్నిబట్టి ఈ ఏడాది దిగుబడులు గణనీయంగా పడిపోయాయనే విషయం స్పష్టమవుతోంది.

ఐనవోలు ఎస్సైపై సస్పెన్షన్ వేటు

- గంజాయి కేసు విషయంలో అలసత్వం ఫలితం


ఎస్సై నవీన్‌కుమార్

హనుమకొండ క్రైం, జనవరి 8: వరంగల్ జిల్లా ఐనవోలు పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వి. నవీన్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. నవీన్ కుమార్‌ను ఎస్సై బాధ్యతల నుంచి తాత్కాలికంగా తప్పిస్తూ సీపీ అంబర్ కిశోర్ ఝా సోమవారం ఆదేశాలిచ్చారు. నాలుగు రోజుల క్రితం వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న గంజాయి కేసులో ఎన్డీపీఎస్ గైడ్‌లైన్ ప్రకారం కేసు నమోదు చేయకుండా విధులపై అలసత్వం ప్రదర్శించినందుకు నవీన్‌కుమార్‌పై వేటు పడింది. ఈ నెల 6న ఐనవోలు మండలంలో ఎండు గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి సుమారు రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేసే అధికారం లేకపోవడంతో నిందితులను ఐనవోలు పోలీసులకు అప్పగించారు. కేసు విషయంలో నిందితులకు ఎస్సై నవీన్‌కుమార్ సహకరించినట్టు పోలీసు ఉన్నతాధికారులకు స్టేషన్ నుంచి ఫిర్యాదు అందింది. దాంతో సీపీ అంబర్ కిశోర్ ఝా నిఘా విభాగం అధికారులతో విచారణ జరిపి ఎస్సైపై సస్పెన్షన్ వేటు వేశారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

ఖమ్మం జిల్లా పెనుబల్లికి చెందిన ఇంజనీర్ మృతి


సాయిరాజీవ్‌రెడ్డి(ఫైల్)

పెనుబల్లి, జనవరి 8: అమెరికా టెక్సాస్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం జిల్లాకి చెందిన యువ ఇంజనీర్ ముక్కర సాయి రాజీవ్‌రెడ్డి(32) మృతిచెందాడు. పెనుబల్లి మండలం వీఎంబంజర్ గ్రామానికి చెందిన కల్లూరు షుగర్ ఫ్యాక్టరీ సీడీసీ చైర్మన్ భూపాల్ రెడ్డి కుమారుడు రాజీవ్. గత ఐదేళ్లుగా టెక్సాస్‌లో ఉంటూ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల కిందటే పెళ్లిచేసుకున్న అతను 4నెలల క్రితమే భార్యను తన వెంట టెక్సాస్‌కు తీసుకెళ్లాడు. అయితే ఇంటికి అవసరమైన సరుకులు తీసుకునేందుకు ఆదివారం కారులో బయటకు వెళ్లిన రాజీవ్ తిరిగి వస్తుండగా డివైడర్ వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో కారు అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతణ్ని అక్కడి పోలీసులు హెలికాప్టర్‌లో ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ రాజీవ్ మృతిచెందాడు. అమెరికాలో ఉంటున్న బంధువుల ద్వారా కుమారుడి మరణవార్త తెలుసుకున్న రాజీవ్ తండ్రి, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే రాజీవ్ తల్లి శివకుమారి కూడా నాలుగేళ్ల క్రితం జనవరి ఒకటో తేదీన మృతిచెందింది. భార్య, కుమారుడు జనవరి నెలలోనే మృతిచెందారని తలచుకుంటూ భూపాల్‌రెడ్డి కన్నీటిపర్యంతమవుతున్నారు.

లైంగికంగా వేధిస్తున్న ప్రొఫెసర్

ప్రధానికి 500 మంది విద్యార్థినుల ఫిర్యాదు

సిర్సా, జనవరి 8: హరియాణాలోని సిర్సాలో ఉన్న చౌదరి దేవీలాల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఒకరు తమను లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ 500 మంది విద్యార్థినులు ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఆ ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు, మొత్తం వ్యవహారంపై రిటైర్డు హైకోర్టు జడ్జితో దర్యాప్తు జరిపించాలని కోరారు. ఈ లేఖ ప్రతులను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్, హోం మంత్రి, వైస్‌ఛాన్సలర్, జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు పంపించారు.

సాగర్ నిర్వహణ కృష్ణా బోర్డు చేతికి!

సోమవారం రెండు గేట్లను ఎత్తి ఏపీకి నీటిని విడుదల చేసిన బోర్డు అధికారులు

నేడు కృష్ణా బోర్డు ప్రత్యేక సమావేశం



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ డ్యామ్ నిర్వహణను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) తాత్కాలికంగా తన ఆధీనంలోకి తీసుకుంది. సోమవారం బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్లు రఘునాథ్, శివశంకరయ్య కలిసి సాగర్‌లోని 5, 7వ గేట్లను ఎత్తి ఏపీకి నీటిని విడుదల చేశారు. సోమవారం రాత్రంతా వెయ్యి క్యూసెక్కులు, మంగళవారం ఉదయం నుంచి రోజుకు 4-5 వేల క్యూసెక్కుల చొప్పున.. మొత్తంగా 3.3 టీఎంసీలను సాగర్ కుడి కాలువ నుంచి ఏపీ తాగునీటి అవసరాల కోసం విడుదల చేయనున్నారు. 3.3 టీఎంసీల నీళ్లు వదలగానే కృష్ణా బోర్డు యంత్రాంగమే గేట్లను స్వయంగా మూసివేయనుంది. సాగర్ కుడి కాలువ నుంచి 5 టీఎంసీల నీటిని విడుదల చేస్తూ కృష్ణాబోర్డు ఈ నెల 5న వాటర్ రిలీజ్ ఆర్డర్ ఇచ్చింది. అయితే, గత నవంబరు 29న సాగర్ డ్యామ్‌లో ఏపీ వైపు ఉన్న గేట్లను, డ్యామ్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే 5 టీఎంసీల్లో 1.7 టీఎంసీలకు ఏపీ ఇప్పటికే బలవంతంగా తరలించింది. దీంతో మిగిలిన 3.3 టీఎంసీలను కేఆర్ఎంబీ విడుదల తాజాగా చేయనుంది. కాగా, నాగార్జునసాగర్ డ్యామ్ నిర్వహణపై చర్చించడానికి తెలుగు రాష్ట్రాల అధికారులతో కృష్ణాబోర్డు మంగళవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. సాగర్, శ్రీశైలం డ్యామ్‌ల నిర్వహణను తమకే అప్పగించాలని, అప్పుడే వివాదాలు ఉండవని బోర్డు కోరనున్నట్లు సమాచారం. అయితే, నీటి వాటాలు తేలకుండా ప్రాజెక్టుల నిర్వహణను ఎలా అప్పగిస్తామని తెలంగాణ ప్రభుత్వం బోర్డు ముందు వాదించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం నాగార్జునసాగర్ తాత్కాలికంగా తెలంగాణ నిర్వహణలో ఉంది. అయితే నీళ్లు ఎవరు విడుదల చేయాలనే అంశంపై సందిగ్ధం కొనసాగుతోంది. దీనిపై సోమవారం ఉదయం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) మురళీధర్, నాగార్జున సాగర్ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్ కృష్ణాబోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌ను కలిశారు. చట్ట ప్రకారం నీటిని విడుదల చేసే అధికారం తమకే ఉందని, కుదరకపోతే కృష్ణాబోర్డు మాత్రమే నీటిని విడుదల చేయాలని మురళీధర్ స్పష్టం చేశారు. ఏపీ నీటిని విడుదల చేస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. దీంతో, శివ్‌నందన్‌కుమార్ హుటాహుటిన బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్ గుప్తా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రఘునాథ్, శివశంకరయ్యను సాగర్‌కు పంపించారు. ఇండెంట్ ప్రకారం ఏపీకి నీటిని విడుదల చేయాలని నిర్దేశించారు. మరోవైపు మిగిలిన 3.3 టీఎంసీల నీటిని విడుదల చేసుకోవడానికి ఏపీ యత్నించగా సీఆర్‌పీఎఫ్ బలగాలు అడ్డుకున్నాయి. తాజాగా బోర్డు రంగంలోకి దిగి గేట్లను తెరిచింది.

'గోదావరి-కావేరి'కి ఛత్తీస్‌గఢ్ గ్రీన్ సిగ్నల్

గోదావరి నదిలో తాము వాడుకోని 148 టీఎంసీల నీళ్లను గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టుకు తరలించడానికి ఛత్తీస్‌గఢ్ అంగీకారం వ్యక్తం చేసింది. మరోవైపు, గోదావరి-కావేరీ ప్రాజెక్టు అనుసంధాన ప్రాజెక్టు ముసాయిదా డీపీఆర్‌ను జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) ఫైనల్ చేసింది. ఈ డీపీఆర్‌ను త్వరలోనే సంబంధిత రాష్ట్రాలకు పంపించనున్నారు. ప్రాజెక్టు డీపీఆర్‌తో పాటు ఎంవోయూలను రాష్ట్రాలకు పంపించి, నెలాఖరులోగా ప్రభావిత రాష్ట్రాల నీటి/జల వనరుల శాఖ ముఖ్యకార్యదర్శులు/కార్యదర్శులతో ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం నిర్వహించనుంది. గోదావరి-కావేరి అనుసంధానంపై ఫిబ్రవరిలో సంబంధిత రాష్ట్రాల సీఎంలతో సమావేశం నిర్వహించాలని ఎన్‌డబ్ల్యూడీఏ లాంఛనంగా నిర్ణయం తీసుకుం ది. ప్రస్తుతం ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ.74,326 కోట్లుగా లెక్కలు వేశారు. ప్రాజెక్టు చేపట్టిన ఐదేళ్లలోపు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టులో భాగంగా ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీని నిర్మించనున్నారు.


మార్కెట్ గేటు వద్ద ధర తగ్గించారని ధర్నా చేస్తున్న మిర్చి రైతులు

మార్కెట్ గేటు వద్ద మిర్చి రైతుల ధర్నా

- తక్కువ ధర ఇస్తున్నారంటూ వ్యాపారులపై ఆగ్రహం
- పోలీసులు, అధికారుల చొరవతో సద్దుమణిగిన సమస్య

వరంగల్‌టౌన్, జనవరి 8: వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో వ్యాపారులు (ఖరీదుదారులు) మిర్చి ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ రైతులు ఆందోళనకు దిగారు. సోమవారం ఉదయం మార్కెట్లో మిర్చి పాట పాడి, తేజ రకం మిర్చికి క్వింటాలుకు రూ.20,100 నిర్ణయించారు. కానీ వ్యాపారులుల్లోని కొందరు 18 వేల నుంచి 13 వేల చొప్పున ధరను నిర్ణయించి కొనుగోలుకు సిద్ధమయ్యారు. వ్యాపారులంతా కుమ్మక్కై ధరలు తగ్గించారని ఆరోపిస్తూ రైతులు మార్కెట్ ప్రధాన గేటు ముందు ఆందోళనకు దిగారు. రైతులను, వ్యాపారులను కార్యాలయానికి పిలిపించి మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు మల్లేశం, ప్రసాద్‌రావు, పోలీసు ఉన్నతాధికారులు ఏసీపీ సతీష్ బాబు, డీసీపీ రవిందర్ ఇరువురితో చర్చించారు. నాణ్యతను బట్టి ధర పలుకుతుందని వ్యాపారులు చెబుతుండగా, క్వింటాలుకు రూ.18వేలు పలికిన మిర్చి, క్వింటాలుకు రూ.13వేలు పలికిన మిర్చి ఒకే రీతిలో ఉందని, అలాంటప్పుడు అంత తక్కువ ధరకు ఎలా కొంటారని రైతులు ప్రశ్నించారు. ధర విషయంలో సమన్యాయం చేస్తామని అధికారులు నచ్చచెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

కాళేశ్వరం, టీఎస్‌పీఎస్సీ కుంభకోణాలపై సీబీఐ విచారణ చేయాలి

- 17 పార్లమెంట్ స్థానాల్లో పోటీ: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం అవినీతి, అక్రమాలు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ కుంభకోణాలపై సీబీఐ విచారణ చేయించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరం గుత్తేదారులను బ్లాక్‌లిస్టులో పెట్టాలని, మిషన్ భగీరథ్ ప్రాజెక్టులో జరిగిన అవినీతి మీద కూడా విచారణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. టీఎస్‌పీఎస్సీని తక్షణమే ప్రక్షాళన చేసి, జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాల నుంచి బీఎస్పీ పోటీ చేస్తుందని, పొత్తుల మీద అధినేత్రి మాయావతి నిర్ణయమే ఫైనల్ అని ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఎన్‌హెచ్‌ల నిర్మాణంలో వేగం పెంచాలి

ప్రజారవాణా కోసం భూములిచ్చే రైతుల త్యాగాలు గుర్తించాలి

భూ నిర్వాసితులకు పరిహారం అందించాలి

పనులపై సమీక్షలో మంత్రి తుమ్మల


సమీక్ష నిర్వహిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, ఖమ్మం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణాల్లో వేగం పెంచాలని ఆర్ అండ్ బీ అధికారులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం జిల్లావ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల పనుల పురోగతి, రైతులకు అందించే పరిహారంపై సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఖమ్మం- దేవరపల్లి, అమరావతి-నాగ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారుల పనుల పురోగతిపై తుమ్మల చర్చించారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేకు సంబంధించి జిల్లా, రాష్ట్ర సరిహద్దు వరకు ఎంట్రీ, ఎగ్జిట్, అండర్ పాస్‌ల నిర్మాణాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. విజయవాడ- జగదల్‌పూర్ హైవే వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవేకు ప్రవేశ, ముగింపు ద్వారాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫలితంగా సత్తుపల్లి ప్రాంత ప్రజలతోపాటు నూజివీడు, తిరువూరు ప్రాంతాల వాసులకు రవాణా సౌకర్యం సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేలో ఖమ్మం నియోజకవర్గం పరిధిలో అవసరమైన అన్నిచోట్ల సర్వీసు రోడ్లు, అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి చెప్పారు. రైతులు, ప్రజల రవాణాకు అనుకూలంగా ఉండేలా, అన్నిరకాల వాహనాలు రాకపోకలు సాగించేలా, రైతుల ఉత్పత్తులు తరలించుకునేలా అండర్‌పాస్‌లు చేపట్టాలని ఆయన అన్నారు. అమరావతి-నాగ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించిన అలైన్‌మెంట్‌పై పునఃపరిశీలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

రైతుల త్యాగాలు గుర్తించాలి:

భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ రేటుకు అనుగుణంగా పరిహారం చెలించేలా చర్యలు తీసుకోవాలని తుమ్మల ఆదేశించారు. ప్రజా రవాణా కోసం విలువైన భూములను ఇస్తున్న రైతుల త్యాగాలు గుర్తించి వారికి న్యాయం చేయాలన్నారు. ఖమ్మం నియోజకవర్గం తోపాటు పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారి కోసం కొత్తగా చేపట్టే భూసేకరణలో నిర్వాసితులకు అన్యాయం జరగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. నిర్వాసిత రైతులకు మార్కెట్ రేటు కన్నా అధికంగా పరిహారం చెల్లించేలా చూడాలన్నారు. అలాగే రహదారి పక్కనే సాగు చేసుకునే రైతాంగానికి భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు తుమ్మల దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ శాఖ సెక్రటరీ శ్రీనివాసరాజుతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కుమారుడు కొట్టడం వల్లేనని సందేహాలు

షాద్‌నగర్‌లో ఘటన.. కేసు నమోదు

షాద్‌నగర్ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాత్రి ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. తెల్లారి లేచే సరికి ఓ ఇంట్లో మహిళ అనుమానాస్పద స్థితిలో చనిపోయి ఉంది. ముందు రోజు కుమారుడితో ఘర్షణ జరగడం, ఆ గొడవలో అతడు తల్లిని కొట్టడం అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని కేశంపేట రోడ్డులో నివాసం ఉంటున్న సుగుణమ్మ(42) కూలీ పనులు చేసుకుంటూ కుమారుడు శివ(18)తో కలిసి ఉంటోంది. ఆమె కల్లు, సారాకు అలవాటు పడి కుమారుడిని తరచూ డబ్బులు అడిగేది. ఆదివారం ఉదయం మద్యం తాగేందుకు రూ.20 ఇవ్వాలని శివను అడిగింది. అతడు ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో తల్లిపై శివ దాడి చేశాడు. ఆ తర్వాత అతడు కూలీ పనికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి రాగా.. తల్లి మద్యం తాగి ఉండటంతో మళ్లీ ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రాత్రి కూడా తల్లీ కుమారుల మధ్య గొడవ జరిగింది. సోమవారం ఉదయం నిద్ర లేచిన శివ.. తల్లి చనిపోయి ఉండటాన్ని గమనించాడు. వెంటనే తన సోదరికి విషయం చెప్పడంతో ఆమె వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'సమగ్ర శిక్షా అభియాన్' వేతనాలు పెండింగ్

- రెండు నెలలుగా నిరీక్షిస్తున్న ఉద్యోగులు
- పండుగపూట పస్తులుంచొద్దంటూ విజ్ఞప్తి

వరంగల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతినెలా వేతనాలు సరిగ్గా రావడం లేదు. రాష్ట్ర విద్యాశాఖలో పనిచేస్తున్న కొంతమంది ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఫారెన్ సర్వీస్ కింద కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని సమగ్ర శిక్షా అభియాన్ విభాగంలో విధులు కేటాయిస్తారు. ఈ విభాగంలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయ, ఉద్యోగులకు సమగ్ర శిక్షా అభియాన్ బడ్జెట్ నుంచే వేతనాలు చెల్లిస్తారు. ఇందుకోసం కేంద్రం 60 శాతం నిధులు, రాష్ట్రం 40 శాతం నిధులు చెల్లించాల్సి ఉంటుంది. విద్యాశాఖ పరిధిలోని డీఈవో కార్యాలయాల్లో పనిచేస్తున్న సెక్టోరల్ అధికారులు, కొంత మంది సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల సిబ్బంది, ఎమ్మార్సీల్లో పనిచేస్తున్న సీఆర్పీలు, ఐఈఆర్పీలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, ఆఫీస్ సబార్డినేట్లు... ఇలా సుమారు 25 వేల మంది ఉద్యోగులు సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్నారు. వీరందరికీ సమగ్ర శిక్ష అభియాన్ విభాగం నుంచే వేతనాలు చెల్లిస్తారు. అయితే గత ప్రభుత్వం తన వాటా అయిన 40 శాతం నిధులను చెల్లించకపోవడంతో ఉద్యోగులకు నవంబరు, డిసెంబరు వేతనాలు ఇంకా అందలేదు. విద్యాశాఖ ఉద్యోగులైనప్పటికీ ఫారెన్ సర్వీస్‌లో ఉంచి, వేతనాలు చెల్లించపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారుతోందని, ఈఎంఐలు, తదితర చెల్లింపులకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోతున్నారు. పండుగ పూట పస్తులు ఉంచకుండా తమకు వేతనాలు చెల్లించేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైటీపీఎస్‌పై మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ

- కేంద్ర పర్యావరణ శాఖ తాజాగా ఆదేశాలు
- వారం రోజుల్లో పూర్తికి అధికారుల సన్నాహాలు
- ప్రారంభానికి నోచుకోని రెండు యూనిట్లు


నల్లగొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్

మిర్యాలగూడ, జనవరి 8: యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్(వైటీపీఎస్) నిర్మాణంలో తలెత్తే పర్యావరణ సమస్యలపై గ్రామసభల ద్వారా మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని కేంద్ర పర్యావరణశాఖ తాజాగా ఆదేశాలు జారీచేసింది. వాస్తవానికి ఈ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం 2017లోనే పర్యావరణ అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.34వేల కోట్లు ఖర్చు చేశారు. 90% పనులు పూర్తయ్యాయి. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు(మొత్తం ఐదు యూనిట్లు) ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ దశలో ప్రాజెక్టు నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలన్న కేంద్రం తాజా ఆదేశాలతో విద్యుత్ ఉత్పత్తి పనులు ప్రారంభానికి ముందే నిలిచిపోయాయి. మిగులు విద్యుత్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం నల్లగొండ జిల్లా వీర్లపాలెం వద్ద వైటీపీఎస్ నిర్మాణాన్ని చేపట్టింది. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5 యూనిట్లతో 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి జూన్ 26, 2017న కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు ఇచ్చింది. అదే ఏడాది అక్టోబరు 17న జెన్‌కో రూ.29వేల కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ బాధ్యతలను బీహెచ్ఈఎల్‌కు అప్పగించింది.

ప్రాజెక్టుకు 5కి.మీ పరిధిలో..

వైటీపీఎస్ నిర్మాణంతో ఆమ్రాబాద్ అభయారణ్యంలోని వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉందని ముంబైకి చెందిన చెందిన కన్జర్వేషన్ యాక్షన్ ట్రస్ట్, విశాఖకు చెందిన సమత స్వచ్ఛంద సంస్థ నేషనల్ గ్రీన్ ట్రిబున్యల్(ఎన్జీటీ)లో కేసులు వేశాయి. దీంతో, వైటీపీఎస్‌కు ఇచ్చిన అనుమతులను 2022 అక్టోబరులో ఎన్జీటీ నిలిపివేసింది. థర్మల్ పవర్ స్టేషన్ ప్రహరీకి అమ్రాబాద్ వన్యప్రాణుల అభయారణ్యం 14.3 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు రాష్ట్ర అటవీ శాఖ ఇచ్చిన నివేదికను జెన్‌కో పర్యావరణ శాఖ దృష్టికి తీసుకెళ్లింది. గతంలో అనుమతుల మంజూరైన సమయంలో ప్రజాభిప్రాయ సేకరణ చేసినందున ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణకు అనుమతించాలని గ్రీన్ ట్రిబ్యునల్‌ను కోరింది. జెన్‌కో విజ్ఞాపనను కేంద్రం తిరస్కరించింది. ప్రాజెక్టుకు 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రజల అభిప్రాయాలను ఆఫ్‌లైన్‌లో తీసుకోవాలని డిసెంబరు 31న ఆదేశించింది. దీంతో వారం రోజుల్లోగా ప్రజాభిప్రాయసేకరణను పూర్తి చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సుప్రీం అభిశంసన

బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు సోమవారం ప్రకటించిన తీర్పు ప్రశంసనీయమైనది. ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, కుటుంబీకుల హత్యలకు కారకులైన 11 మంది దోషులకు రెమిషన్ ఇచ్చి విడుదల చేసిన గుజరాత్ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహాన్ని చవిచూసింది. రెండువారాల్లో వీరంతా జైలు అధికారులకు లొంగిపోవాలంటూ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. దోషులకు రెమిషన్ మంజూరు చేసే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదనడంతో పాటు, ఒక దోషి గత ఏడాది సుప్రీంకోర్టు బెంచ్ నుంచి తెచ్చుకున్న ఆదేశాలను సైతం ప్రస్తుత తీర్పు రద్దుచేయడం విశేషమైనది.

అధికారాలను దుర్వినియోగం చేయడం వేరు, లేని అధికారాలను ప్రయోగించి ఇంతటి దుశ్చర్యకు పాల్పడటం వేరు. ఈ పదకొండుమంది దోషుల రెమిషన్ విషయంలో గుజరాత్ ప్రభుత్వం అన్ని విధాలుగా పక్షపాతంతో, నిస్సిగ్గుగా వ్యవహరించిందన్నది సుప్రీంకోర్టు తీర్పు సారాంశం. దోషులంతా జీవితఖైదు పడినవారు. సత్ప్రవర్తన పేరుతోనో, ఇతరత్రా చారిత్రక సందర్భాల్లోనో కొందరికి రెమిషన్ వర్తింపచేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేకపోలేదు. అయితే, సదరు కేసు విచారణ జరిగిన, శిక్షవిధించిన రాష్ట్రానికి మాత్రమే ఈ సిఫార్సు అధికారం ఉన్నందున, ఈ పదకొండుమంది విషయంలో ఆ పనిచేయాల్సింది మహారాష్ట్ర తప్ప, గుజరాత్ కాదు. మరణశిక్షపడిన ఖైదీలకు రెమిషన్ వర్తించదంటూ 2014నాటి చట్టం స్పష్టం చేస్తున్నందున, గుజరాత్ ప్రభుత్వం తెలివిగా 1992నాటి రెమిషన్ విధానాన్ని వీరికి వర్తింపచేసింది.

ఈ పదకొండు మందితోనూ గుజరాత్ ప్రభుత్వం కుమ్మక్కయిందని సుప్రీంకోర్టు ఇప్పుడు అంటున్నది కానీ, వీరి రెమిషన్‌కు సిఫార్సు చేయడానికి గుజరాత్ ప్రభుత్వం నియమించిన పానెల్ పూర్తిగా అధికారపెద్దలతో నిండిపోవడం, 2022 గుజరాత్ ఎన్నికలకు సరిగ్గా నాలుగునెలల ముందు వీరంతా విడుదల కావడం తెలిసినవే. వారి విడుదలను పాలకపక్షం ఓ పండుగలాగా నిర్వహించింది. తిలకాలు దిద్ది, హారతులు పట్టి, స్వీట్లు నోట్లో పెట్టి, ఊరేగించి మరీ వారిని జైలు నుంచి తీసుకువచ్చారు. ఆ తరువాత సమయం, సందర్భం వచ్చినప్పుడల్లా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు వీరందరినీ తమతోపాటు వేదికలమీద సైతం కూచోబెట్టుకున్నారు.

రాధేశ్యామ్ అనే పిటిషన్‌దారు సుప్రీంకోర్టును తప్పుదోవపట్టించారంటూనే, 2022 మే నెలలో ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పును తప్పుబట్టడానికి, ఆ తీర్పుకు దోహదం చేసిన గుజరాత్ ప్రభుత్వం కుట్రను జస్టిస్ నాగరత్నమ్మ ఇప్పుడు ఏకిపారేశారు. రెమిషన్ విషయాన్ని మహారాష్ట్రతో తేల్చుకోమని గుజరాత్ కోర్టు చెబితే, మహారాష్ట్ర కాదు పొమ్మంటే, ఈ విషయాలన్నీ దాచి ఆ దోషి సుప్రీంకోర్టునుంచి గుజరాత్ ప్రభుత్వానికి అతడి విజ్ఞప్తిని పరిశీలించాల్సిందిగా ఆదేశాలు ఇప్పించుకోగలిగాడు. దీనిపై రివ్యూ పిటిషన్ ఎందుకు వేయలేదని గుజరాత్ ప్రభుత్వాన్ని ఇప్పుడు సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కానీ, ఆ ఒక్క పిటిషన్‌తో ఆ ఖైదీకే కాదు, అస్మదీయులందరికీ రెమిషన్ ఇచ్చి గుజరాత్ పాలకులు ఎన్నికలముందు తమ రాజకీయప్రయోజనం నెరవేర్చుకున్నారు.

మరో మూడేళ్ళలో చీఫ్ జస్టిస్ కాబోతున్న జస్టిస్ బీవీ నాగరత్న వెలువరించిన ఈ తీర్పు ప్రజాస్వామిక వాదుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. ఇటీవలి చాలా తీర్పులు ఆలయాల చుట్టూ, అధికారకేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న తరుణంలో ప్రభుత్వాల మెడలు వంచారామె అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దనోట్ల రద్దు తీర్పులో సైతం మిగతా నలుగురు న్యాయమూర్తులతో విభేదిస్తూ ఆమె రాసిన అసమ్మతి తీర్పు మోదీ నిర్ణయాన్ని మెత్తనిమాటలతో బాగా తప్పుబట్టింది. ప్రక్రియ యావత్తూ ఏకపక్షంగా సాగిందని, ఇది చట్టవ్యతిరేకమైన చర్యనీ తేల్చారామె. కులం, మతం, హోదాతో నిమిత్తం లేకుండా సమాజంలోని ప్రతీ మహిళా గౌరవాన్ని పొందాల్సిందే, ఒక మహిళపై అత్యంత పాశవికంగా వ్యవహరించినవారు కూడా రెమిషన్‌కు అర్హులవుతారా?, బాధితులను దృష్టిలో పెట్టుకున్నప్పుడే కదా అది పరిపూర్ణ న్యాయం అవుతుంది అంటూ జస్టిస్ బీవీ నాగరత్న ఇప్పుడు ఎంతో ఘాటుగా, లోతుగా ఇచ్చిన ఈ తీర్పు చరిత్రలో నిలిచిపోతుంది.

రాహుల్ విఫల విన్యాసాలు

రాజకీయాల్లో ప్రజలను మాటలతో మభ్యపెట్టడం, కొత్త కొత్త నినాదాలను సృష్టించడంలో కాంగ్రెస్‌ను మించిన పార్టీ మరేదీ లేదు. ఆ పార్టీ లక్ష్యం ఒక్కటే– గాంధీ– నెహ్రూల కుటుంబానికి ఏదో రకంగా అధికారం దక్కేలా చూడడం. గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ ఇందుకు విఫల పోరాటం చేస్తూనే ఉన్నది. జనవరి 14 నుంచి భారత్ జోడో న్యాయ యాత్రను జరిపేందుకు రాహుల్ గాంధీ సిద్ధమవుతున్నారని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. భారత్ జోడోయాత్ర పేరుతో 2022–23లో రాహుల్ కొన్ని రాష్ట్రాలు తిరిగారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆ యాత్రకు కొద్దిగా పేరు మార్చి మరికొన్ని రాష్ట్రాలు తిరగాలని రాహుల్ నిర్ణయించారు. విభిన్న సామాజిక వర్గాలను కలపడం జోడో యాత్ర లక్ష్యమైతే ఆ వర్గాలను కలపడమే కాక వారికి రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయాన్ని సమకూర్చేందుకు పోరాడడం తాజా యాత్ర లక్ష్యమని కాంగ్రెస్ చెప్పుకుంది.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

రాహుల్ గాంధీని ఎన్నిసార్లు ఏ రూపంలో ప్రయోగించినా ఫలితం ఏమీ ఉండదు. 2004లో రాజకీయాల్లో ప్రవేశించిన రాహుల్ గాంధీ ఈ రెండు దశాబ్దాల్లో కాంగ్రెస్ పార్టీపై కానీ, దేశ ప్రజలపై కానీ చూపిన ప్రభావం అంటూ ఏమీ లేదు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా, యువజన కాంగ్రెస్ తదితర అనుబంధ సంస్థల ఇన్‌చార్జిగా, ఉపాధ్యక్షుడుగా, చివరకు అధ్యక్షుడుగా ఆయన ఏ బాధ్యత చేపట్టినా విజయవంతం కాలేకపోయారు. 2014 ఎన్నికలలో కాంగ్రెస్‌కు ఆయనే సారథ్యం వహించారు కదా. ఏమయింది? కనీవినీ ఎరుగని రీతిలో కాంగ్రెస్ ఘోరంగా దెబ్బతింది. 2009లో 206 సీట్లు సాధించిన కాంగ్రెస్ 2014లో 44 సీట్లకు పడిపోయింది. 2019 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు ఆయనే ప్రచార సారథ్యం వహించినప్పటికీ లోక్‌సభలో కాంగ్రెస్ పదిశాతం సీట్లను కూడా సాధించలేకపోయింది. దీనితో ఆయన అవమాన భారంతో సీనియర్లను నిందిస్తూ పార్టీ అధ్యక్ష పదవికే రాజీనామా చేశారు. అయినప్పటికీ ఒక కుటుంబానికి విధేయంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు రాహుల్ తప్ప మరో గత్యంతరం లేకుండా పోయింది.

దేశంలో అన్ని వర్గాలను కలుపుతానంటూ జోడోయాత్ర నిర్వహించిన రాహుల్ ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది. మధ్యప్రదేశ్‌లో రాహుల్ తన సోదరి ప్రియాంకతో కలిసి 21 నియోజకవర్గాల్లో పర్యటిస్తే కాంగ్రెస్ కేవలం 4సీట్లలో గెలిచింది. ఆయన పర్యటించిన బుర్హన్‌పూర్, ఇండోర్, మాల్వా, ఉజ్జయిని ప్రాంతాల్లో కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారు. రాజస్థాన్‌లో 12 నియోజకవర్గాల్లో రాహుల్ యాత్ర సాగితే వాటిలో కాంగ్రెస్ కేవలం 3 సీట్లు మాత్రమే గెలుచుంది. ఝూల్వార్, దౌసా, సవాయి, మధోపూర్, ఆల్వార్ జిల్లాల ప్రజలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పారు. తెలంగాణలో కూడా రాహుల్ యాత్ర వల్ల కాంగ్రెస్‌కు ప్రయోజనం జరిగిందని ప్రగల్భాలు పలుకుతున్నారు కాని 29 నియోజకవర్గాల్లో రాహుల్ పర్యటిస్తే కాంగ్రెస్ కేవలం 12 సీట్లలోనే గెలిచింది. హైదరాబాద్‌తో సహా అనేక ప్రాంతాల్లో రాహుల్ యాత్ర ప్రభావం ఏమీ లేదు. మొదటి విడత యాత్రలోనే రాహుల్ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనపడ్డా మరో విడత యాత్రకోసం రాహుల్‌ను ప్రోత్సహించడం కాంగ్రెస్ భావ దారిద్ర్యానికి నిదర్శనం.



రెండు దశాబ్దాల క్రితం రాజకీయాల్లో ప్రవేశించిన రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీపై కానీ, దేశ ప్రజలపై కానీ చూపిన ప్రభావం ఏమీ లేదు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా, యువజన కాంగ్రెస్ తదితర అనుబంధ సంస్థల ఇన్‌ఛార్జిగా, పార్టీ ఉపాధ్యక్షుడుగా, చివరకు అధ్యక్షుడుగా ఆయన ఏ బాధ్యత చేపట్టినా విజయవంతం కాలేకపోయారు.

రెండో జోడో యాత్రకు రాహుల్ ఎందుకు పూనుకున్నారు? ఈ దేశంలో వివిధ వర్గాలను ఆయన యాత్ర కలుపుతుందట! రాహుల్ జోడో యాత్ర చేయకముందు భారతీయులంతా విడిపోయి ఉన్నారా? నిజానికి ఈ దేశంలో విచ్ఛిన్నకర రాజకీయాలు చేసింది కాంగ్రెస్ పార్టీయే కాదూ? కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు కాంగ్రెస్ హయాంలోనే హింసాకాండతో వేర్పాటువాదంతో భగ్గుమన్నాయి. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో మత కల్లోలాలు జరిగాయి. ఢిల్లీలో 2 వేలమంది సిక్కుల ఊచకోత జరిగింది. కాంగ్రెస్ హయాంలోనే. పంజాబ్‌లో ఆపరేషన్ బ్లూస్టార్ జరిగింది. ఆ పార్టీ ప్రభుత్వాల హయాంలో జరిగినన్ని కుల, మత, ప్రాంతీయ ఘర్షణలు ఏ పార్టీ హయాంలో జరగలేదు. ఇదేమిటని ప్రశ్నించినందుకు ప్రతిపక్షాలను జైళ్లలో బంధించి ప్రజల ప్రజాస్వామ్య హక్కులను హరించారు. కుటుంబ పాలన, అవినీతి, ఆశ్రిత పక్షపాతం పెచ్చరిల్లింది కాంగ్రెస్ హయాంలోనే. రాహుల్ యాత్ర ద్వారా కాంగ్రెస్ తన గత పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. అందుకోసం తాను ప్రాయశ్చిత్త యాత్ర జరుపుతున్నట్లు రాహుల్ ప్రకటించాలి.

తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు చేరుతున్నాయో లేదో తెలుసుకునేందుకు మోదీ, ఆయన మంత్రులు, బీజేపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నేరుగా ప్రజలను కలుసుకునేందుకు నవంబర్ 15న ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర అత్యంత విజయవంతమైంది. కేవలం 50 రోజుల్లోనే బీజేపీ నేతలు 11 కోట్ల మందిని చేరుకున్నారు. మోదీ ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర భారత ప్రజలను ఏకం చేసింది. రాహుల్ జోడో యాత్ర ఏ వర్గాన్నీ ఏకం చేసిన దాఖలాలు లేవు. అభివృద్ధి, సంస్కృతి పరిరక్షణ ద్వారానే ప్రజలను ఏకం చేయగలమని మోదీ రుజువు చేశారు. కాని కులం పేరిట, మతం పేరిట ప్రజలను విడదీసిన చరిత్ర ఉన్న కాంగ్రెస్ ప్రజలను ఏ విధంగా ఏకం చేయగలుగుతుంది?

రెండో విడత యాత్రలో రాహుల్ ఈ దేశ ప్రజలకు ఆర్థిక సామాజిక న్యాయం అందిస్తామని చెబుతారట. తమకు ఆర్థిక, సామాజిక న్యాయం భారతీయ జనతా పార్టీ హయాంలోనే లభిస్తోందని ప్రజలు గ్రహించినందునే గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టారు. మూడోసారి పట్టం కట్టేందుకు సిద్ధమవుతున్నారని ప్రజల ప్రతిస్పందనను బట్టి అర్థమవుతోంది. రాహుల్ యాత్ర జరుపుతోంది ప్రధానంగా తమ కుటుంబానికి న్యాయం అందించమని ప్రజలను వేడుకోవడం కోసమే. ఆ కుటుంబానికి న్యాయం చేయడమంటే దేశానికి అన్యాయం చేయడమే. కాంగ్రెస్ పార్టీ దౌర్భాగ్యం ఏమిటంటే ఒక కుటుంబం తమ భవిష్యత్తు కోసం ఆ పార్టీని వాడుకుంటుంటే, కుటుంబ భవిష్యత్తులోనే తమ భవిష్యత్తు ఉన్నదని ఆ పార్టీ నేతలు భావించడం!

కుటుంబ పరిధికి మించి ఆలోచించలేని దుస్థితిలో ఉన్నందువల్లే కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిలపై ఆధారపడుతోంది. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో పుట్టగతులు లేవు. ఆస్తుల పంపకంలో తనకు న్యాయం జరగనందుకే షర్మిల ఇప్పుడు అన్నమీద కోపంతో కాంగ్రెస్ పార్టీలో చేరారనడంలో సందేహం లేదు. జగనే కనుక ఆమెను చేరదీసి ఏదో పదవితో పాటు ఆస్తిని పంచి ఇచ్చి ఉంటే ఆమె జగనన్న బాణంగానే ఇప్పటి వరకూ పనిచేస్తుండేవారు కాదా? తెలంగాణలో షర్మిల ఎందుకు సొంత పార్టీ పెట్టారు? ఆ పార్టీని ఎందుకు మూసివేసి కాంగ్రెస్‌తో చేతులు కలిపారు? ఇప్పుడు ఆమె ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను ఉద్ధరించగలరని రాహుల్ గాంధీ ఆశపడుతున్నట్లు కనపడుతోంది. తెలంగాణ నుంచి పారిపోయిన నేత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను ఏమి ఉద్ధరించగలరు?

కృత్రిమ మేధపై పోరు తప్పదు!

సృష్టికి ప్రతి సృష్టి చేస్తోంది కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్– ఎఐ). ఇదొక విప్లవాత్మక పరిణామం– ముఖ్యంగా సమాచార రంగంలో. చాట్ జిపిటి, ఇతర ఎఐ వేదికలను సృష్టిస్తున్న, ఉత్పత్తి చేస్తున్న ఓపెన్ ఎఐ, మైక్రోసాఫ్ట్ కంపెనీలపై విఖ్యాత మీడియా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్' కోర్టులో దావా వేసింది. తాము సంచితం చేసిన అపార పాత్రికేయ సమాచారాన్ని తమ అనుమతి లేకుండా చాట్ జిపిటి స్వేచ్ఛగా వినియోగించుకోవడం న్యాయవిరుద్ధమని ఆ సుప్రసిద్ధ పత్రిక ఘోషిస్తోంది. తమ వ్యాసాలు, వార్తలను విరివిగా వినియోగించుకుంటున్నందుకు చాట్ జిపిటి ఉత్పత్తిదారులు తమకు వందల కోట్ల డాలర్ల (ఈ మొత్తం కచ్చితంగా ఎంత అనేది ఇదమిత్థంగా తెలియదు)ను చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. 2024 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలలో అసంఖ్యాక ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును ఉపయోగించుకోనున్నారు. అయితే ఈ ప్రపంచవ్యాప్త ప్రజాస్వామ్య పోరాటాల కంటే తమ మేధాసంపత్తి హక్కులను కాపాడుకునేందుకు ఆ అమెరికన్ మీడియా సంస్థ చేస్తున్న న్యాయపోరాటం చాలా ప్రత్యేకమైనది. న్యాయ నిర్ణయం ఎలా ఉంటుందనే విషయమై సకల దేశాల ప్రజలూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు.



akbar

మీడియా సంస్థలే కాదు, పలువురు సృజనశీలురు కూడా వైయక్తికంగానూ సమష్టిగానూ ఎఐ కంపెనీలపై తమ మేధో శ్రమను అనుమతి లేకుండా ఉపయోగించుకుంటున్నందుకు భారీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ న్యాయ స్థానాలకు వెళ్లారు. 'హాలీవుడ్ రిపోర్టర్' ఎడిటర్ జూలియన్ శాంక్టన్ నేతృత్వంలో పలువురు సాహిత్యేతర గ్రంథ రచయితలు ఒక కేసు వేశారు. ప్రతిష్ఠాత్మక పులిట్జర్ పురస్కార గ్రహీతలు కూడా ఎఐ కంపెనీలపై వ్యాజ్యాలలో భాగస్వాములు అవుతున్నారు. ప్రముఖ రచయితలు జోనాథన్ ఫ్రాంజెన్, జార్జి ఆరఆర్ మార్టిన్, జాన్ గ్రిషామ్‌లు ఈ వ్యాజ్యదారులలో అగ్రగాములుగా ఉన్నారు. కృత్రిమ మేధ నుంచి తమ వృత్తిగత మనుగడకు ఎనలేని ముప్పు వాటిల్లుతుందని హాలీవుడ్ సృజనాత్మక, సాంకేతిక కళాకారులు ఆందోళన చెందుతున్నారు. వీరు ఇప్పటికే సమ్మెలు చేసి, నిరసన ప్రదర్శనలు నిర్వహించి ఎఐతో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లను విశాల ప్రపంచం దృష్టికి తీసుకువచ్చారు. ఎఐ కంపెనీలకు వ్యతిరేకంగా న్యూయార్క్ టైమ్స్ చేస్తున్న న్యాయపోరాటమే, మరే వ్యాజ్యం కంటే కూడా ఎక్కువగా ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. దశాబ్దాలుగా ఆ పత్రిక తన పాత్రికేయ ప్రజ్ఞతో సంచితం చేసిన అపార సమాచారాన్ని చాట్ జిపిటి తన కార్యకలాపాలకు అనుమతి లేకుండా ఆధారం చేసుకోవడమే అందుకు కారణమని మరి చెప్పనవసరం లేదు.

సాహిత్యం, తత్వ శాస్త్రం, వేవ్ మెకానిక్స్, విండ్ సర్ఫింగ్ మొదలైన సమస్త వైవిధ్య జ్ఞాన రంగాలకు సంబంధించి ఇంటర్నెట్‌లో లభ్యమవుతున్న సమాచారాన్ని చాట్ జిపిటి స్వేచ్ఛగా వినియోగించుకుంటుంది. ఈ స్వేచ్ఛా వినియోగమే ఎఐకు తీవ్ర సవాళ్లను, న్యాయపరమైన సమస్యలను తీసుకువస్తోంది. దాని న్యాయబద్ధతను ప్రశ్నించేలా చేస్తోంది. వైజ్ఞానిక కాల్పనిక సాహిత్య దిగ్గజం ఐజాక్ అసిమోవ్ (1920–92) 1942లో రచించిన 'రన్ ఎరౌండ్' అనే కథలో ప్రస్తుత పరిణామాన్ని ఊహించారు. 'రోబోటిక్స్ మూడు నియమాల'ను ఆయన ఆ కథలో ప్రకటించారు. ఆ మూడింటిలో మొదటి సూత్రం ఒక రోబో ఒక మనిషికి హాని చేయబోదు లేదా నిష్క్రియాపరత్వంతో ఒక మనిషి తనకు హాని చేసేందుకు అనుమతించదు'. మిగతా రెండు నియమాలు దీని నుంచి నిష్పన్నమైనవే. మానవుల పట్ల రోబోలు హింసాత్మకంగా ప్రవర్తించడాన్ని అనుమతించకూడదన్న సత్య వచనాన్ని పలు తరాల పాఠకులు చదువుతూ వస్తున్నారు. అయితే ప్రస్తుత పరిణామాలు భిన్నమైనవి హింసకు ఇచ్చే నిర్వచనం ప్రకారం దాని పరిధిని విశాలం చేయవచ్చు. మానవుల విశిష్టతకు ముప్పు కలిగించే విధంగా యంత్రాలను అనుమతించకూడదన్న అర్థంలో అసిమోవ్ మొదటి నియమాన్ని చదవండి. అప్పుడు కృత్రిమ మేధపై జరుగుతున్న చర్చ వాస్తవికంగా లేదని అర్థమవుతుంది.

ఒక ఏడాది కాలంలోనే ఎఐ అనేక రంగాలలో ఉద్యోగాలను మటు మాయం చేయనున్నదనే విషయమై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అది ఆర్థికపరమైన ఆందోళన మాత్రమే. ప్రతీ సాంకేతిక విప్లవమూ అనేక విషయాలను అనావశ్యకం చేస్తుంది. కంప్యూటర్ విప్లవం గురించి చెప్పేదేముంది? టైపిస్టులు, టెలిఫోన్ స్విచ్ బోర్డ్ ఆపరేటర్లు, డేటా టాబ్యులేటర్లు, అకౌంటెంట్స్ అవసరం లేకుండా చేసింది. ఈ మార్పునే ఎఐ విప్లవం మరింత తీవ్రం చేస్తోంది. సాంకేతిక విప్లవాలు ఆర్థిక వ్యవస్థల్లో పెనుమార్పులను అనివార్యం చేస్తాయి. ఆ మార్పులు అల్లకల్లోలంగా ఉండడం కద్దు. విప్లవాత్మక మార్పు సంభవించిన కొద్దికాలానికే దాని మూలంగా నెలకొన్న సంక్షోభ పరిస్థితులు సర్వసాధారణమైపోతాయి. ప్రజలు వాటికి అలవాటుపడతారు. తమ శ్రమకు మరింత ప్రతిఫలం లభించే ప్రదేశాలకు కొంతమంది కార్మికులు వెళతారు. మరి కొంతమంది శ్రామికులు కొత్త పని వాతావరణంలో ఇమడలేక పాతకాలం చేతివృత్తులు మొదలైన వాటిని తమ జీవనాధారాలుగా చేసుకుంటారు. కొత్త సాంకేతికతలు ప్రభవించిన ప్రతీ సందర్భంలోనూ ఆర్థిక కార్యకలాపాలు, సామాజిక వ్యవహారాలలో క్రియాశీలంగా ఉన్నవారికి అవి కొత్త కర్తవ్యాలను నిర్దేశిస్తాయి. వారు నిర్వహించే పాత్రలను మార్చివేస్తాయి. వారిపై బృహత్ కార్యభారాన్ని మోపుతాయి. ఈ అనూహ్య పరిస్థితులను తట్టుకుని నిలబడినవారు కొత్త సాంకేతికతను తమకు సహాయకారిగా పరిగణిస్తారు. రైతులు సాగు పనులను పర్యవేక్షించడానికే పరిమితం కాకుండా హార్వెస్టర్ల (కోతలు, నూర్పిళ్ల యంత్రాలు) డ్రైవర్లుగానూ పనిచేయవలసిరావడం తప్పనిసరి అవుతుంది. గృహ సేవకులు మైక్రోవేవ్ ఓవెన్ల, వాషింగ్ మెషీన్లను ఉపయోగించుకోవడం నేర్చుకుంటారు. చెప్పవచ్చిన దేమిటంటే చాట్ జిపిటి రంగంలోకి ప్రవేశించిన తరువాత దాని వినియోగదారులు అది నిర్దేశించే కొత్త కార్య సరళికి అలవాటుపడ్డారు. ఆవశ్యక నవీన నైపుణ్యాలను నేర్చుకున్నారు.

సమాచార రంగంలో వినూత్న సంచలనాలకు వేదిక అయిన చాట్ జిపిటిలో మనకు తరచు వచ్చే మొదటి ఆదేశం : 'నీవు నా సహాయకుడువి అని భావించుకోండి'. రేడియాలజీ నుంచి ఓషనోగ్రఫీ దాకా, డేటా ఎంట్రీ నుంచి ఈ–మెయిల్ మార్కెటింగ్ దాకా వివిధ రంగాలలో మనకు ఆ నవీన సాంకేతికత అనేకానేక విధాలుగా సహాయపడుతుంది. అయితే ఆ సహాయ చర్యలు చచ్చే చికాకు కలిగించేవి అని కూడా మనం గుర్తించాలి, అంగీకరించాలి.

సరే, మేధో సంపత్తి సంబంధిత వాణిజ్య రంగంలోకి ఎఐ ప్రవేశం ఉత్తేజాన్ని కలిగించింది, వ్యాకులతను సృష్టించింది, ఆరాటాన్ని పెంపొందించింది. సృజనశీలుర సొంత మేధో ఉత్పత్తులను అది అపారంగా నిక్షిప్తం చేసుకోవలసి ఉన్నది. ఎందుకంటే వినియోగదారుడు (యూజర్) అడిగిన సమాచారాన్ని సమకూర్చడానికి చాట్ జిపిటికి ఏదో ఒక మేధో సంపత్తి ఆధారం ఉండి తీరాలి. ముందుగా నిక్షిప్తం చేసిన సమాచారం ప్రాతిపదికన అది సమాధానాలు ఇవ్వడం సాధ్యమవుతుంది. ఇలా వినియోగదారుల ప్రశ్నలకు చాట్ జిపిటి ప్రతిస్పందనలు దాని సొంత మేధో సంపత్తిగా ఆవిర్భవిస్తాయి. అయితే మేధో సంపత్తిని సృష్టించే సృజనశీలురు ఈ ఎఐ ఉత్పత్తుల తీరుతెన్నులను సహజంగానే ఆక్షేపిస్తారు. ఎందుకంటే అది ఒక విధమైన చౌర్యం. ఎఐ చాలా ఉద్యోగాలను మటుమాయం చేయడం, డిజిటల్ టెక్నాలజీ తోడ్పాటుతో నకిలీ ఫోటోలు, దృశ్యాలు, గళాలు సృష్టించడం మొదలైనవి నూటికి నూరుశాతం వాస్తవాలు, అంతకు మించి ఎంతో ఆందోళనకర వ్యవహారాలూ పరిణామాలూ. ఇవన్నీ ఎఐ పుణ్యమేనని మరి చెప్పనవసరం లేదు. ఈ నకిలీ సృష్టికాండకు వ్యతిరేకంగా ఎంతో మంది హెచ్చరికలు చేస్తున్నారు. అయితే పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నవారు ఎవరూ కనిపించడం లేదు! ఈ కొత్త సంవత్సరంలో ఇతోధికంగా అభివృద్ధి చెందనున్న ఎఐ ఆధారిత పరిశ్రమలకు మొట్టమొదటి సవాల్ సృజనాత్మక మేధోశ్రమ చేసే వారి నుంచే వస్తుంది.

మానవాళి విశిష్టత ఏమిటి? మానవుని విలక్షణతను ఎలా అర్థం చేసుకోవాలి? మానుషత్వాన్ని ఎలా నిర్వచించాలి? సహస్రాబ్దాలుగా సకల సమాజాలలోని విజ్ఞులు ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవడానికి ఆరాటపడుతున్నారు. ఏ దివ్యశక్తి మానవుడిని జీవకోటిలో ప్రత్యేకంగా నిలబెట్టింది? భాషా? చింతనా సామర్థ్యమా? ఆత్మీయ సమూహం, సొంత సమాజం సమష్టి అనుభవాలను పదిలపరచి భావి తరాలకు అందివ్వడమా? కృత్రిమ మేధ మౌలికతను ప్రశ్నిస్తున్న సవాళ్లు, ఆ అతి నవీన సాంకేతికత తీరుతెన్నులపై ఆక్షేపణల నుంచి అంతిమంగా ఆ ప్రశ్నలకు నిశ్చితమైన, నిర్ణయాత్మకమైన సమాధానాలు లభించే అవకాశమున్నది. మేధో నైపుణ్యాలు విలువకట్టలేని మానవ సంపద. తమ సృజనశీలతను రక్షించుకునే విషయంలో మానవులు ఎటువంటి రాజీకి అంగీకరించరు.

మానవ సృజనాత్మకత వెల లేనిది. వెల నిర్ణయించేందుకు ఎవరూ సాహసించలేనిది. పాత్రికేయ ప్రజ్ఞ ఆ సృజనాత్మకత ఫలితమే. కనుకనే దశాబ్దాలుగా ఆ ప్రజ్ఞతో తాము సంచితం చేసిన విజ్ఞాన, సమాచార భాండారాన్ని తన సొంతం అన్నట్టుగా చాట్ జిపిటి వినియోగించుకోవడాన్ని విఖ్యాత మీడియా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్' నిరసిస్తోంది. అనిర్దిష్ట మొత్తంలో వందల కోట్ల డాలర్లను తమకు చెల్లించి తీరాల్సిందేనని ఖండితంగా డిమాండ్ చేస్తూ ఆ అధునాతన సాంకేతికత ఉత్పత్తిదారులు అయిన ఎఐ కంపెనీలపై కోర్టులో దావా వేసింది. తమను ఇంత శక్తిమంతులుగా, అపర సృష్టికర్తలుగా చేసిన సృజనాత్మక శ్రమను ఇప్పుడు ఒక యంత్రానికి వదిలివేసేందుకు మానవులు అంగీకరిస్తారా? అంగీకరించరు. ఎందుకంటే అలా యాంత్రిక బానిసలు కావడం వల్ల మానవ జీవితం ఎటువంటి మినహాయింపు లేకుండా పూర్తిగా అర్థరహితమై పోతుంది. మరి కింకర్తవ్యమేమిటి? ఈ ధరిత్రిపై నడయాడుతున్న సృజనశీలురు అందరూ కృత్రిమ మేధకు వ్యతిరేకంగా సమైక్యమవడమే.

● ప్రతీక్ కంజీలాల్
ఎడిటర్, ది 'ఇండియా కేబుల్'

ఆత్మవిమర్శ మొదలుపెట్టండి!

కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ళ పాలనలో పునాది లేకుండా నిర్మించిన బంగారు తెలంగాణను, మేడిపండు చందంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను, వారి అభివృద్ధి వెనుక నిజానిజాల్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెర తీసి తెలంగాణ సమాజం ముందు ఉంచారు. ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించని గత నాయకుల పాలనలో సంక్షేమ పథకాలు అందక, సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఎక్కడికక్కడే బందీ అయిపోయారు. అభివృద్ధి అంటే హైదరాబాదు చుట్టూరా గుళ్ళు, సచివాలయం, విగ్రహాలు, పె[illegible]వర్లు, కలెక్టరేట్లు కట్టడం కాదు. అభివృద్ధి పట్నం నుంచి పల్లె వరకు సమానంగా అందాలి. పేదలకు ఇల్లు, పని చేసుకోవడానికి భూమి, తాగు సాగునీటి సౌకర్యం, రైతుకు గిట్టుబాటు ధర, ధాన్యాన్ని నిలువ చేసుకోవడానికి గ్రామస్థాయిలో గిడ్డంగి నిర్మాణ వ్యవస్థ, విద్యార్థులు చదువుకోడానికి అధునాతనమైన స్కూళ్ళూ కాలేజీలూ యూనివర్సిటీల నిర్మాణం, ప్రజలకు అందుబాటులో ఆసుపత్రులు, రోడ్డు రవాణా వ్యవస్థ, ప్రతి మారుమూల గ్రామానికి కరెంటు సౌకర్యం, నిరుద్యోగులకు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం... ఇలా అన్ని స్థాయిలలోనూ అభివృద్ధి జరిగినప్పుడే ఆ ప్రాంత ఆర్థిక వ్యవస్థ ముందంజ వేస్తుంది.



కానీ కేసీఆర్ పాలనలో వీటన్నిటిని మరిచి కేవలం మందు షాపులను పెంచి ప్రజలను తాగుడికి బానిసలు చేశారు. లక్షల కోట్లతో నాసిరకమైన నీటి ప్రాజెక్టులు కట్టి రాష్ట్రం ఆదాయాన్ని దుబారా ఖర్చు పెట్టారు. ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు విపరీతమైన ఆదరణ రావడానికి కారణం కేసీఆర్ హయాంలో తొమ్మిదిన్నరేళ్ళపాటు జరిగిన నిర్లక్ష్యపూరిత పాలనే!

నెల రోజులు కూడా పూర్తి కాని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వారు పెట్టిన 'ప్రజావాణి' కార్యక్రమానికి ఒక మహిళ నాలుగు సార్లు వస్తే పట్టించుకోలేదంటూ వారి పేపర్‌లో రాసుకున్నారు బాగానే ఉంది. కానీ ఈ తొమ్మిదిన్నరేళ్ళలో మీ ప్రభుత్వం చుట్టూ ఆ మహిళ ఎన్నిసార్లు తిరిగి ఉంటుందో, అలాంటి ఇంకెందరో ప్రజలు లెక్కకు మించిన ఆర్థిక సమస్యలతో మీ ఎమ్మెల్యేల చుట్టూ, అధికారుల చుట్టూ ఇంకెన్నిసార్లు తిరిగి ఉంటారో కూడా ఆలోచించి ఉండాల్సింది. అలాంటివారిని ఏ రోజైనా పట్టించుకున్న, కలిసిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు గానీ, మంత్రులు గానీ ఉన్నారా? కేసీఆర్ కుటుంబంలోని ఆ నలుగురికి మాత్రమే మాట్లాడే, పరిపాలించే అధికారం ఉన్నట్లు నియంతృత్వ ధోరణితో వ్యవహరించారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో అధికారం, అధికారులు ప్రజల చెంతకు చేరడంతో అనేక సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. అంటే ఇది మీ పాలనా లోపమేనని ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోండి.

బీఆర్ఎస్ పార్టీ చేసిన అవినీతిని, నియంతృత్వ పాలనను ఎండగడితే ప్రతీకారం ఎట్లా అవుతుంది? మీరు రెండు పర్యాయాలు పరిపాలన చేసినప్పుడు ప్రతి పనిలో గత పాలకుల పాలనను పనిగట్టుకొని అహంకారపూరితంగా విమర్శించలేదా? 'గతంలో తెలంగాణ మొత్తం ఎడారిగా ఉండే మేము వచ్చినాకనే జనసంచారం జరిగింది, సస్యశ్యామలంగా వర్ధిల్లుతుంది' అన్న స్థాయిలో గొప్పలు చెప్పుకోలేదా? '32 మెడికల్ కాలేజీలు కాదు, 32 యూట్యూబ్ ఛానల్స్ పెట్టివుంటే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టి గెలిచేవారు' అంటూ ఒక నెటిజన్ పెట్టిన పోస్టును ప్రచారం చేస్తున్న కేటీఆర్. మరి పేపర్ లీకేజీలను, నిరుద్యోగుల సమస్యలను, అక్రమ అరెస్టులను, రాష్ట్రంలో ఇంకా అనేక సమస్యలను దృష్టికి తెచ్చేందుకు అప్పట్లో నెటిజెన్లు చేసిన ట్వీట్లను ఎలా నిర్లక్ష్యం చేశారో కూడా గుర్తు తెచ్చుకోవాలి. ట్వీట్లు పెట్టడం మాని వాస్తవ పరిస్థితులు తెలుసుకోవడానికి గ్రామాల్లోని ప్రజల దగ్గరకు వెళ్లివుంటే ఏది నిజమో ఏది అబద్ధమో తెలుస్తుండే! ఈ పదేళ్ళ కాలంలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మొత్తం మీ గుప్పిట్లోనే కదా ఉన్నది, మీ చుట్టునే కదా ఈ ఛానల్స్ తిరిగింది, మరి అప్పుడు జరిగింది తప్పుడు ప్రచారం కాదా?

కేసీఆర్ కుటుంబంలోని వ్యక్తులు పాలించిందే పాలన అన్నవిధంగా గత తొమ్మిదిన్నరేళ్ళూ గడిచాయన్నది నగ్నసత్యం. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఖర్చు పెట్టే ప్రతి రూపాయి తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలకు ఉపయోగపడే విధంగా, సామాజిక న్యాయమే లక్ష్యంగా ఉంటుందని రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారు. అందుకే ఈ కొత్త సంవత్సరం 'రైతు, మహిళా, యువత నామ సంవత్సరంగా' తొలి అడుగులు వేస్తుంది.

– మండ్ల రవి, ఉస్మానియా యూనివర్సిటీ

విద్యాభారత వైతాళికురాలు

'ఫాతిమాషేక్' ఈ మధ్య కాలంలో బాగా వినబడుతున్న ఒక ప్రముఖమైన పేరు. ఆధునిక భారతదేశ తొలి టీచర్ సావిత్రిబాయి పూలేతో కలిసి ఉపాధ్యాయురాలిగా, సంస్కర్తగా ఆమె పని చేశారు. ఒక్క ఫాతిమాషేక్ కాదు సామాజికంగా అనేక ఉద్యమాలు, సంస్కరణల్లో పాటుపడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీ మహిళలను చరిత్రలో కనుమరుగు చేశారు. అందువల్ల భారత సమాజానికి వారి వీరోచిత పోరాటాలు, త్యాగాలు, బలాలు, చైతన్యాలు భావి తరాలకు తెలియకుండా పోయాయి. అట్లా పోవడానికి ఆధిపత్య కుల, ఆధిపత్య మత వివక్షలే కారణం. వారి చరిత్రలు అక్కడక్కడా ఆయా ప్రాంతాల్లో, స్థానిక భాషల్లో, స్థానిక చరిత్రల్లో, మట్టి పొరల్లో తవ్వి తీస్తే దొరుకుతున్నాయి.

ఫాతిమాషేక్ ఆధునిక భారతదేశ తొలి ముస్లిం టీచర్ అనే విషయం సావిత్రిబాయి పూలే తన భర్త మహాత్మా జ్యోతిరావు పూలేకి రాసిన లేఖలో బయటపడింది. ఆ లేఖను ఆసరాగా చేసుకుని బ్రిటీష్ మిషనరీ లేఖలు, రిపోర్టులు, వ్యాసాలు, ఉర్దూ పుస్తకాలు, మరాఠి పుస్తకాలు, పత్రికలు, హిందీ పుస్తకాలు, సాహిత్యాలు, పుణె నగర స్థానిక మౌఖిక సమాచారాన్ని బట్టి జరిగిన పరిశోధనల్లో ఫాతిమాషేక్ కుటుంబానికి సంబంధించిన సమాచారం తెలియవచ్చినా ఆమె గురించిన సమాచారం లభ్యం కాలేదు. పుణె బుధవార్‌పేట్‌లో మౌఖికంగా చాలా సమాచారం ప్రచారంలో ఉందనీ, దీని ఆధారంగా ఫాతిమాషేక్ మీద విస్తృత సాహిత్యం వచ్చిందనీ పరిశోధక విశ్లేషణ.

భారతదేశం భిన్న సమాజాల అస్తిత్వ దేశం. దేశానికి అన్ని సమాజాల, సమూహాల సేవ, చైతన్యాల చరిత్రలు స్ఫూర్తి కావాలి. కుల, మత, జెండర్ సామాజిక అస్తిత్వాల చరిత్రలు తెలిసినప్పుడే ఆయా సమూహాల మధ్య పరస్పర గౌరవం, సామరస్య, మానవీయ స్నేహాలకు బలమైన పునాదులు ఏర్పడతాయి.

స్థానిక మౌఖిక సమాచారం విస్తృత వ్యాప్తిలో ఉన్నందువల్ల మహారాష్ట్ర బహుజన కులాల ఉద్యమకారులు, రచయితలు, చరిత్రకారులు, పరిశోధకులు, కళాకారులు ఎక్కడ, ఏ ఉద్యమం చేసినా సావిత్రిబాయి, జ్యోతిరావ్ పూలేలతో పాటు ఫాతిమాషేక్ స్మరణను ప్రస్తావించడం భాగమైనందువల్ల ఆ ఉదాత్తురాలి గురించి విశాల దేశానికి వెల్లడి అయింది. విద్యారంగంలో విస్మరించలేని కృషి చేసినందువల్లే ఫాతిమా చరిత్రను మహారాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ పాఠ్య పుస్తకం రెండవ తరగతి బాలభారతిగా పెట్టడం అనివార్యమైంది. కానీ ఫాతిమా ఒక్క ఉర్దూ వాళ్ళకే పాఠాలు చెప్పలేదు. అన్ని కులాల, మతాల వాళ్లను, మహిళలను విద్యావంతులను చేసిన గొప్ప సామాజిక అధ్యాపకురాలు. అట్లాంటి అధ్యాపకురాలిని ఉర్దూ పాఠం వరకే కుదించడం ఆమె విశాల మానవీయ చరిత్రకు అన్యాయం చేసినట్లే అవుతుంది. ఆమె చరిత్రను మరాఠీ పాఠ్యాంశాల్లోనే కాక మొత్తం భారతీయ భాషల్లోకి కూడా తేవాల్సి ఉంది.

అన్ని కులాల, మతాల వాళ్లను, మహిళలను విద్యావంతులను చేసిన గొప్ప సామాజిక అధ్యాపకురాలు ఫాతిమాషేక్. అన్ని భారతీయ భాషలలోని పాఠ్యపుస్తకాలలోనూ ఆమె చరిత్ర ఉండాలి.



ఫాతిమాషేక్ పుణెలోని గంజిపేట్ నివాసి. ఆమె జననం జనవరి 9, 1831. వీరి కుటుంబం ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి గంజిపేట్‌లో స్థిరపడిన చేనేత వస్త్ర వ్యాపారులు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకుని అన్న ఉస్మాన్ షేక్ ఆలనలో పెరిగింది. అణగారిన కులాలకు, మహిళలకు పాఠశాలలు పెట్టేందుకు, కులవివక్షను వ్యతిరేకిస్తున్న పూలే దంపతులను జ్యోతిబా తండ్రి బైటకు వెళ్లగొట్టినప్పుడు వారికి ఆశ్రయం ఇవ్వడమే గాక తమ ఇంటిలోని ఒక భాగాన్ని పాఠశాలగా ఇచ్చిన ఉదాత్తుడు ఉస్మాన్ షేక్.

ఎన్నో నిషేధాల్ని ధిక్కరించి బడుగువర్గాలవారి కోసం విద్యావ్యవస్థల్ని ఏర్పాటు చేసే గొప్ప లక్ష్యాలున్న పూలే దంపతులకు అండగా నిలిచారు ఫాతిమా, ఆమె సోదరుడు ఉస్మాన్. అట్లనే జ్యోతిరావ్ పూలే చదువు మధ్యలో ఆగిపోతే, తిరిగి జ్యోతిరావ్‌ను పాఠశాలకు పంపాలని ఆయన తండ్రిని ఒప్పించి, చివరికి ఒక మంచి మిషనరీ స్కూల్లో చేర్పించిన పండితుడు, బహుభాషాకోవిదుడు గంజిపేట్ నివాసి మున్షీ గఫార్‌బేగ్. తల్లిదండ్రుల్లేని ఫాతిమా ఆమె అన్న ఉస్మాన్‌కి కూడా ఆయనే పెద్దదిక్కు. ఈయన సహకారంతోనే ఫాతిమా కుటుంబం గంజిపేటలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నది. అట్లా జ్యోతిరావ్‌కు ముస్లిం సమాజాలతో చాలా సన్నిహిత సంబంధాలున్నాయి. ఆ సంబంధాల వల్లనే ఆయన 'మానవ మహమ్మద్' అనే స్తుతి గీతం రాశారు.

ఫాతిమాషేక్‌కి మరాఠి, ఇంగ్లీషు విద్యలతో పాటు విద్యాబోధన శిక్షణ కూడా పూలే దంపతులే అందించారు. ఫాతిమాషేక్, సావిత్రిబాయి పూలేలు కలిసి అహ్మద్‌నగర్‌లో టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసి బాలికా పాఠశాలల్ని గొప్పగా తీర్చిదిద్దారు. పూలే దంపతులు బాలికలకు ప్రత్యేక పాఠశాలలను 1848లోనే పెట్టి ఇంకా అనేక పాఠశాలల్ని నడిపారు. ఆ పాఠశాలలకు అధ్యాపకులుగా పూలే దంపతులు ఎక్కువగా బహుజన కులాల విద్యావంతులను ప్రోత్సహించారు.

బాలికల పాఠశాలలకు మగ టీచర్లుంటే తల్లిదండ్రులు తమ ఆడపిల్లల్ని పంపేవారు కాదు. అసలు ఆడపిల్లలకు 'చదువు చెరుపు' అనే భావనలో ఉండేవారు. మహిళా టీచర్లు లేరు. అట్లాంటి పరిస్థితుల్లో సావిత్రిబాయి చదువుకొని వారికి పాఠాలు చెప్పింది. ఆమె ఆదర్శంగా ఫాతిమా కూడా పూలే పాఠశాలలో చదువుకొని పాఠాలు చెప్పడానికి ముందుకొచ్చింది. వీరిద్దరూ అహ్మద్‌నగర్‌లోని 'మేడమ్ సింథియా ఫెరారె' మిషనరీలో పూర్తిస్థాయి ఉపాధ్యాయులుగా ప్రభుత్వ గుర్తింపు ఉన్న విద్యాసంస్థలో టీచర్ ట్రైనింగ్ చేసిన తొలి మహిళా అధ్యాపకులుగా సర్టిఫికెట్ పొందారు. అట్లా ఉపాధ్యాయ వృత్తివిద్యా శిక్షణ పొందిన తొలి ముస్లిం మహిళ ఫాతిమాషేక్.


పాఠశాలకు తమ ఆడపిల్లల్ని పంపని ఇండ్లకు పోయి బాలికా విద్య ప్రాముఖ్యత, అవసరాన్ని చెప్పి, తిరిగి బాలికలను పాఠశాలకు రప్పించేవారు సావిత్రిబాయి, ఫాతిమా. దీనిని ముస్లిం సమాజాలు, మత పెద్దలు తీవ్రంగా వ్యతిరేకించేవారు, దాడులు చేసేవారు. పాఠశాలకు వెళ్ళనిచ్చేవారు కాదు. ఇంకో వైపు హిందూ అగ్రవర్ణాల నుంచి కూడా దాడులు, వ్యతిరేకతలు, అడ్డంకులెదురయ్యేవి. వాటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొన్నది ఫాతిమాషేక్. పరదా చాటు ఇంటి నుంచి బైటకొచ్చి ఇల్లిల్లూ తిరిగి ఇతర బాలికలతో పాటు ముస్లిం బాలికలను కూడా పాఠశాలలో చేర్పించడం ఒక ముస్లిం మహిళగా పెద్ద సాహసమే. ఎన్ని కష్టాలెదురైనా బాలికా పాఠశాలలను ధైర్యంగా కర్తవ్య దీక్షతో ఉపాధ్యాయినిగా ముందుకు నడిపారు. సావిత్రిబాయి ఆరోగ్యం బాగోలేక పుట్టింటికి పోయినపుడు... ఫాతిమా సేవలుండగా పాఠశాలలకు లోటు రాదు, ఆమెకు ఎక్కువ శ్రమ ఇస్తున్నానని జ్యోతిరావు పూలేకి రాసిన ఉత్తరాన్ని బట్టి ఫాతిమాషేక్ వారికి ఎంత ప్రథమురాలో అర్థం అవుతుంది. ఇదే ఫాతిమాషేక్ చరిత్రకు ఆయువు పట్టు.

పూలే పాఠశాల నుంచి ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా అణగారిన కులాలకు, మతాల సమాజాలకు ఉపాధ్యాయినిగా, సామాజిక కార్యకర్తగా, సంఘసంస్కర్తగా, సావిత్రిబాయి పూలే సహచరిణిగా ఫాతిమా చరిత్రలో ఎప్పటికీ నిలిచే ఉంటారు. ఆధునిక భారతదేశ మొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమాషేక్ గురించి సమగ్రంగా తెలుగు ప్రజలకు తెలియజేసిన జర్నలిస్టు, పరిశోధకులు, రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ అభినందనీయులు.

■ సుభద్ర జె.



- చాలినంత సిబ్బంది నియామకం
- ప్రైవేటు ఆపరేటర్ల సాయం
- సిబ్బందికి తగిన శిక్షణ
- పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్తలు
- డేటా ఎంట్రీకి ప్రత్యేక పోర్టల్
- సర్వర్‌తో పాటు డెస్క్‌టాప్, మొబైల్ సపోర్టు



చురుగ్గా ప్రజాపాలన డేటా ఎంట్రీ

మూడు షిఫ్టుల్లో పనులు

హనుమకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీల అమలు కోసం స్వీకరించిన దరఖాస్తుల డేటాఎంట్రీ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, మునిసిపాలిటీలు, వరంగల్ మహానగర పాలక సంస్థలో ముమ్మరంగా సాగుతోంది. డేటా ఎంట్రీ ఆపరేటర్లు దరఖాస్తులోని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో నిమగ్నమై ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీలోగా అన్ని దరఖాస్తుల వివరాలను ఎంట్రీ చేయడానికి శ్రమిస్తున్నారు. డిసెంబరు 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలై ఈనెల 6వ తేదీతో ముగిసింది. ఆరోజు నుంచే డేటాఎంట్రీని మొదలు పెట్టారు. పథకాల లబ్ధి కోసం జిల్లా వ్యాప్తంగా 2,50,367 లక్షల దరఖాస్తులు దాఖలయ్యాయి.

ఐదు గ్యారెంటీలకే...

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ముఖ్యంగా ఐదు పథకాలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలు వీటిలో ఉన్నాయి. రూ. 500 లకు గ్యాస్ సిలిండర్, మహిళకు రూ. 2500 నగదు బదిలీ, పెన్షన్ల పెంపు, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల నగదు సాయం, కొత్త రేషన్ కార్డుల జారీ కోసం దరఖాస్తులను తీసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ. 5 లక్షలు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని తెలిపింది. గృహజ్యోతి పథకం కింద పేదలకు ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు కూడా హామీ ఇచ్చింది.

పథకాల వారీగా ఎంట్రీ

ప్రతీ పథకానికి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోనవసరం లేకుండా ఏ పథకానికి అర్హులైనవారు ఆ పథకానికి అవసరమైన వివరాలు మాత్రమే దరఖాస్తు ఫారంలో నింపారు. ఒకే ఫారమ్‌లో అన్ని పథకాలకు సంబంధించిన కాలమ్స్ ఇచ్చారు. దరఖాస్తులో లబ్ధిదారులు టిక్ పెట్టిన పథకాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆ తర్వాత ఈ వివరాలన్నింటిని క్రోడీకరిస్తారు. దీంతో ఏ లబ్ధిదారుడు ఏ పథకం కింద దరఖాస్తు చేసుకున్నది స్పష్టమవుతుంది. ఏ పథకం కింద ఎంత మంది దరఖాస్తు చేసుకున్నది తెలుస్తుంది. డేటాఎంట్రీ పూర్తయిన తర్వాత పరిశీలన చేపడతారు. ఏ పథకం కింద ఎవరు అర్హులో నిర్ణయిస్తారు. ఆ మేరకు వారిని ఎంపిక చేసి సమాచారం అందిస్తారు.

సిబ్బందికి శిక్షణ

ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, టీం లీడర్లు డేటాఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలంటే దరఖాస్తుల స్వీకరణతో పాటు డేటాఎంట్రీ కూడా చాలా ముఖ్యమైంది. దరఖాస్తులోని వివరాలను ఆన్‌లైన్ చేసిన తర్వాత ఆ వివరాలతోనే పరిశీలన చేస్తారు. ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయడంలో ఎలాంటి పొరపాట్లు జరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లు అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. డేటాఎంట్రీ చేయించే బాధ్యత టీం లీడర్‌దే. డేటాఎంట్రీ సంబంధిత ఎంపీడీవో, తహసీల్దార్, మునిసిపల్ కార్యాలయాల్లో మాత్రమే చేయాలన్న ఆదేశాలు ఉన్నాయి. నిర్ణీత సమయంలోగా డేటాఎంట్రీ పూర్తి చేసేలా అధికారులు స్పష్టమైన ప్రణాళికలను రూపొందించుకున్నారు. ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే సందేహాల నివృత్తికి జిల్లా స్థాయిలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. దీనికి ఫోన్ చేసి సందేహాలను తీర్చుకోవచ్చు. డేటాఎంట్రీ శిక్షణలో భాగంగా డేటాఎంట్రీ ఏ విధంగా చేయాలన్నదానిపై మాస్టర్ ట్రెయినర్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్లు చేశారు. డేటాఎంట్రీ కార్యక్రమాన్ని మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

మూడు షిఫ్టుల్లో..

ఒక్కో దరఖాస్తు ఎంట్రీకి ఎంత సమయం పడుతుందో అంచనా వేసి ఆ మేరకు అధికారులు సిబ్బందిని నియమించారు. కొన్ని మండలాల్లో తక్కువ, మరికొన్నింటిలో ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. వీటి సంఖ్యను బట్టి డేటాఎంట్రీ ఆపరేటర్లను కేటాయించారు. డేటాఎంట్రీకి ఒక సర్వర్‌తో పాటు ఒక పోర్టల్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆన్‌లైన్‌లో దీనికి మొబలైతో పాటు డెస్క్‌టాప్ సపోర్టు కూడా ఉంది. డేటా

మిగతా 8వ పేజీలో..

పకడ్బందీగా దరఖాస్తుల కంప్యూటరీకరణ

పరిశీలించిన కలెక్టర్ సిక్తా



కంప్యూటరీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

హనుమకొండ రూరల్, జనవరి 8 : అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించిందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. బొల్లికుంట సమీపంలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియను కలెక్టర్ సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఎనిమిది రోజులపాటు ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను పకడ్బందీగా కంప్యూటరీకరణ చేయాలని సూచించారు. దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేసేటప్పుడు తప్పులు దొర్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. దరఖాస్తుదారుడు ఏయే పథకాలకు దరఖాస్తు చేసుకున్నారో ఆ వివరాలన్నీ నమోదు చేయాలని తెలిపారు. గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందికి కలెక్టర్ సూచించారు.



పింగిళి కళాశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, జనవరి 8: వడ్డెపల్లిలోని పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రాంగణంలో మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సోమవారం వాణిజ్య శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో రోల్ 'ఆఫ్ ఇనిస్టిట్యూషన్ ఇన్ ప్రమోటింగ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ ఇండియా' అనే అంశంపై నిర్వహించిన ప్రారంభ జాతీయ సభను ఆయన ప్రారంభించారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళిగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. పింగిళి మహిళా కళాశాల ఎంతో చారిత్రాత్మకమైందని ఈ కళాశాల పేరు తెలియని వారు ఉండరని అన్నారు. ఈ కళాశాల తమ తాతదని, ఇందులో తమ తల్లి విద్యార్థిగా చదువుకున్నట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొట్టమొదటి మహిళా విద్యా కేంద్రంగా గుర్తింపు పొందిన కళాశాల అని తెలిపారు. ఈ కళాశాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు.

సీసీఈ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ డీటీ చారి మాట్లాడుతూ మహిళలు సమాజంలో అన్ని రంగాల్లో ముందు వరసలో ఉంటున్నారని చెప్పారు. వర్తక, వాణిజ్య రంగాల్లో కాకుండా ఆర్థిక రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని తెలిపారు. ఈ సదస్సులో ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, సదస్సు నిర్వాహకులు డాక్టర్ రజిత, డాక్టర్ భాస్కర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. సుహాసిని పాల్గొన్నారు.

చిగురించిన ఆశలు

'బిల్ట్' పునరుద్ధరణపై ప్రభుత్వం ఫోకస్

ములుగు, జనవరి 8: బిల్ట్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకేస్తోంది. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలోని ఈ కర్మాగారం 2014లో మూతపడగా దాన్ని పునరుద్ధరించేందుకు రేవంత్ సర్కారు కసరత్తు చేస్తోంది. బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం అడుగు వేసిందని తెలుస్తోంది. నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆదేశాలతో బిల్ట్ ఆస్తులపై హక్కులు పొందిన ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్స్ సొల్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ హర్షిక్ పటేల్, ఐటీసీ పేపర్ బోర్డులు, స్పెషాలిటీ పేపర్స్ విభాగం సీఈవో వాదిరాజ్ కులకర్ణితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సమావేశమయ్యారు. కర్మాగారాన్ని తెరిపించేందుకు ప్రభుత్వం ద్వారా పూర్తి సహకారం అందిస్తామని హామీనిచ్చారు. దీనిపై ఐటీసీ, ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్స్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. దీంతో అడుగంటిన ఆశలు చిగురిస్తున్నాయి.



ప్రశ్నించే గొంతుకను నేను..

- గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలపర్చండి..
- ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్



మాట్లాడుతున్న బక్క జడ్సన్

వడ్డెపల్లి, జనవరి 8: రానున్న ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రశ్నించే గొంతుకను బలపర్చాలని ఏఐసీసీ సభ్యులు, ఉమ్మడి రాష్ట్ర వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బక్క జడ్సన్ అన్నారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణలో ఏమీ దక్కకుండా చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు బొంద పెట్టారని అన్నారు. ఏ ఆకాంక్ష కోసం రాష్ట్రం ఏర్పడిందో ఆ కల నెరవేరేందుకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోరాట పటిమ గల గొంతుకకే మద్దతు తెలుపాలని గ్రాడ్యుయేట్లను కోరారు.

తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలే గెలిపించారని పార్టీ కార్యకర్తల మనోధైర్యం విజయానికి దోహదం చేసిందని అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్నట్లు చెప్పారు. గురుకుల పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురుకుల పాఠశాలల్లో ఒక విద్యార్థి భోజనం ఖర్చుకు 2016 నుంచి రూ. 31 రోజుకు చెల్లిస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు కూడా ఇదేవిధంగా డబ్బు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని చెప్పారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని సెంట్రల్ జైలును తాకట్టు పెట్టడం, ములుగు ట్రైబల్ టూరిజంలో జరిగిన అక్రమాలతో పాటు స్త్రీ నిధిలో జరిగిన అవకతవకలు అక్రమంగా ఉద్యోగుల తొలగింపుపైన పోరాటం చేస్తామని అన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ కోసం కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మహ్మద్ అంకూస్, చాగంటి అనిల్, తుల రవి పాల్గొన్నారు.

మిర్చి రైతుల ఆందోళన

- తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారంటూ ధర్నా
- ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఉద్రిక్తత
- పోలీసులు, అధికారుల చొరవతో సద్దుమణిగిన సమస్య



ఏనుమాముల మార్కెట్ ప్రధాన గేటు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

వరంగల్ టౌన్, జనవరి 8: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో వ్యాపారులు (ఖరీదుదారులు) మిర్చి ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. ఉదయం మార్కెట్లో యథావిధిగా మిర్చి జెండా పాట (నాణ్యత గల మిర్చి ధరను నిర్ణయిస్తారు) పాడారు. తేజ రకం మిర్చికి క్వింటాకు రూ.20,100 నిర్ణయించారు. మార్కెట్‌కు వండర్ హాట్, తేజ, యూఎస్-341, దేశీ ఇలా సుమారు 20 రకాల మిర్చి అమ్మకానికి వస్తాయి. నాణ్యతను బట్టి ఒక్కో రకానికి ఒక్కో ధరను వ్యాపారులు నిర్ణయించి కొనుగోలు చేస్తారు. అయితే సోమవారం తేజ రకానికి క్వింటాకు రూ.20,100 జెండా పాట పాడగా, వ్యాపారులు రూ.17వేలు, రూ.18వేలు, రూ.13 వేల చొప్పున ధర నిర్ణయించి కొనుగోలుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో తక్కువ ధర పలికిన రైతులు గొడవకు దిగారు.

విషయం తెలుసుకున్న మిగతా రైతులు పెద్ద ఎత్తున చేరుకుని తమకు కూడా ధరలు తగ్గించారని, గత ఏడాదితో పోల్చుకుంటే అధ్వానంగా ఉన్నాయని ఆరోపించారు. ఈ క్రమంలో మార్కెట్ ప్రధాన గేటు ముందు ఆందోళనకు దిగి కొద్ది సేపు ధర్నా చేశారు. సమాచారం అందుకున్న మార్కెట్ కార్యదర్శి సంగయ్య వెంటనే డీఎంవో ప్రసాదరావుకు, మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్, మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి మల్లేశంకు పరిస్థితిని వివరించారు. అలాగే స్థానిక సీఐ మహేందర్... ఏసీపీ సతీష్‌బాబు, డీసీపీ రవిందర్‌ల దృష్టికి తీసుకెళ్లడంతో వారు మార్కెట్‌కు చేరుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

ఎవరి వాదన వారిదే...

వ్యాపారుల పక్షాన చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డిని, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు లింగారెడ్డిని, ఆందోళన చేస్తున్న రైతులను కార్యాలయానికి పిలిపించి మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు మల్లేశం, ప్రసాద్‌రావు, ఏసీపీ సతీష్ బాబు, డీసీపీ రవిందర్ చర్చించారు. వ్యాపారులు, రైతులు ఎవరికి వారు తమ వాదన వినిపించారు. నాణ్యతను బట్టి ధర పలుకుతుందని వ్యాపారులు చెప్పగా, క్వింటాకు రూ.17 వేలు పలికిన మిర్చి, క్వింటా రూ.13వేలు పలికిన మిర్చి ఒకే రీతిలో ఉందని, అలాంటప్పుడు అంత తక్కువ ధరకు ఎలా కొంటారని రైతులు ప్రశ్నించారు.

మిర్చిలో నాణ్యత ఉంటే ఒక ఖరీదుదారు కాకపోతే మరో ఖరీదుదారుడికి ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చని, లేదా మంచి ధర పలికినప్పుడే అమ్ముకోవాలని అప్పటి వరకు కోల్డ్ స్టోరేజీలో పెట్టుకోవచ్చని వ్యాపారులు తమ వాదన వినిపించారు. అధికారులు ఇరువర్గాలకు నచ్చచెప్పారు. తక్కువ ధర పలికిందనిపిస్తే ఆ రైతుల వద్దకు మార్కెట్ అధికారులు, ఖరీదుదారులు, పోలీసులు వచ్చి పరిశీలించి నాణ్యతకు అనుగుణంగా ధర పెట్టేందుకు మరో ఖరీదుదారుడిచే కొనుగోలు చేయించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇరువర్గాలకు నచ్చచెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

ఐనవోలు ఎస్ఐ సస్పెన్షన్

- గంజాయి కేసులో నిబంధనల ఉల్లంఘన
- ఉత్తర్వులు జారీ చేసిన సీపీ



నవీన్‌కుమార్

హనుమకొండ క్రైం, జనవరి 8 : జిల్లాలోని ఐనవోలు ఎస్ఐగా పని చేస్తున్న వి.నవీన్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ సీపీ అంబర్ కిశోర్ ఝా సోమవారం ఆదేశాలు జారీ చేశారు. నాలుగు రోజుల క్రితం వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న గంజాయి కేసులో ఎన్‌డీపీఎస్ గైడ్‌లైన్ ప్రకారం కేసు నమోదు చేయకుండా విధులపై అలసత్వం ప్రదర్శించినందుకు ఎస్ఐ నవీన్‌కుమార్‌పై సీపీ వేటు వేశారు.

వివరాల్లోకి వెళితే నవీన్‌కుమార్ సంవత్సరంన్నర నుంచి ఐనవోలు ఎస్ఐగా పని చేస్తున్నాడు. ఈ నెల 6న ఐనవోలు మండలంతో పాటు చుట్టుపక్కల ఎండు గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వనమాల కనిపర్తి క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2 కిలోల 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఎఫ్ఐఆర్ చేసే అధికారం లేకపోవడంతో కేసుతో పాటు పట్టుకున్న నలుగురు వ్యక్తులు కిలారీ శోభన్‌కుమార్, ఎమ్డీ పర్వేజ్‌పాషా, మీట ప్రవీణ్, ఓదెల సాయికిరణ్‌లను అదే రోజు ఐనవోలు పోలీసులకు అప్పగించారు. ఈ కేసును స్థానిక ఎస్‌హెచ్‌వో నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులను రిమాండుకు తరలించాల్సి ఉండగా ఏఎస్ఐతో కేసును నమోదు చేయించారు.

కేసు విషయంలో నిందితులకు ఎస్ఐ నవీన్‌కుమార్ సహకరించినట్టు పోలీసు ఉన్నతాధికారులకు స్టేషన్ నుంచి ఫిర్యాదు అందడంతో సీపీ అంబర్ కిశోర్ ఝా నిఘా విభాగం అధికారులను రంగంలోకి దించారు. కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ఎస్ఐ సరైన పద్ధతిలో కేసు నమోదు చేయకపోవడంతో పాటు కేసులో అలసత్వం వహించినందుకు సస్పెన్షన్ వేటు వేశారు.

కేయూ పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్, జనవరి 8 : కేయూ పరిధిలో సోమవారం పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమైయ్యాయి. యూనివర్సిటీ క్యాంపస్‌లో పరీక్షల కేంద్రాలను కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పరిశీలించారు. క్యాంపస్‌లోని మానవీయ శాస్త్ర భవనంలోని హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగాలలో నిర్వహించిన పరీక్షల కేంద్రాలను సందర్శించారు. వర్సిటీ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ తదితర విభాగాలకు చెందిన 5484 మంది పరీక్షలకు దరఖాస్తులు చేసుకున్నారని, వారికి 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు.



పరీక్షల కేంద్రాలను పరిశీలిస్తున్న వీసీ తాటికొండ రమేశ్

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములివ్వం

కలెక్టరేట్‌లో బాధిత రైతుల వినతి



కలెక్టరేట్ ప్రజావాణిలో వినతి పత్రం అందిస్తున్న భూనిర్వాసిత రైతులు

దామెర, జనవరి 8: వ్యవసాయమే జీవన ఆధారంగా జీవిస్తున్న తాము... తమ పచ్చని పంట పొలాలను గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వబోమని స్పష్టం చేశారు. చావనైనా చస్తామని.. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి పంట భూములను ఇచ్చేదే లేదని బాధిత భూ నిర్వాసిత రైతులు హెచ్చరించారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం బాధిత రైతులు తమ వినతి పత్రం అందించారు.

అనంతరం రైతులు బూర్గుల రాంచందర్‌రావు, బొల్లు సమ్మిరెడ్డి, బొల్లు రాజిరెడ్డి మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా తాము వ్యవసాయంతోనే కుటుంబాలను పోషించుకుంటున్నామని స్పష్టం చేశారు. ఒక్కో కాలంలో రెండు నుంచి మూడు పంటలు పండించుకునే పచ్చని పొలాలను రోడ్ల నిర్మాణాలకు వదులుకోబోమని తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేను.. బ్రౌన్‌ఫీల్డ్ హైవేగా మార్చాలని, లేదంటే పూర్తి రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అభివృద్ధి వికేంద్రీరణ పేరుతో పచ్చని పంట పొలాలను రోడ్ల నిర్మాణాలకు వినియోగించవద్దని విజ్ఞప్తి చేశారు.

పంటపొలాల నుంచి రోడ్ల నిర్మాణం చేసుకుంటూ పోతే.. రాబోవు భవిష్యత్ తరాలకు ఆహార పదార్థాల కొరత తథ్యమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎరుకల రమేష్, మంద సంధ్యారాణి, నల్లెల్ల సతీష్‌కుమార్, అబ్బాడి రవీందర్‌రెడ్డి, బొమ్మకంటి రాజకొమురయ్య, దేవేందర్, అయిలు సాంబయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి..

- సంఘ్ సీడబ్ల్యూసీ మెంబర్ చింత మురళి
- కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట రిలే దీక్షలు



నిరసనలో పాల్గొన్న సంఘ్ నాయకులు

6

డాక్టర్ సైఫ్ సస్పెన్షన్ పొడిగింపు

హనుమకొండ అర్బన్, జనవరి 8 : కేఎంసీ అనస్థీషియా మొదటి సంవత్సరం పీజీ విద్యార్థి డాక్టర్ ధరావత్ ప్రీతి మృతి విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ సైఫ్ సస్పెన్షన్ మరో 97 రోజులపాటు పొడిగిస్తున్నట్లు కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్ తెలిపారు. ప్రీతి మృతి ఘటన అనంతరం డాక్టర్ సైఫ్‌ను ఏడాది కాలంపాటు పీజీ కోర్సు నుంచి సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. ఈ సస్పెన్షన్‌ను సవాల్ చేస్తూ డాక్టర్ సైఫ్ హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాలతో పునర్విచారణ జరిపామని పేర్కొన్నారు. ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారం డాక్టర్ సైఫ్‌పై విచారణ జరిపిన యాంటీ ర్యాగింగ్ కమిటీ గతంలో విధించిన సస్పెన్షన్ కొనసాగించినట్లు పేర్కొన్నారు. ఈ సస్పెన్షన్ కాలంలో హాజరైన 97 రోజుల కాలాన్ని పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది డాక్టర్ ప్రీతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

వినతుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 8 : ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదులపై అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 60 వినతులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ కోసం 4, జీడబ్ల్యూఎంసీ 6, ఎస్సీ కార్పొరేషన్ 2, ఆర్డీవో 5, ఎంజీఎం 1, తహసీల్దార్ 11, ఎంపీడీవో 3, ఉపాధి కార్యాలయం 3 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ మేన శ్రీను, ఇండస్ట్రీస్ జీఎం హరిప్రసాద్, మైనింగ్ విభాగం ఏడీ నర్సిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీడబ్ల్యూవో మధురిమ, మెప్మా పీడీ భద్రునాయక్, డీపీవో జగదీశ్వర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు మహిళ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, జనవరి 8 : ఈనెల 10 నుంచి 14 వరకు కర్ణాటకలోని సేలం పెరియార్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ హ్యాండ్ బాల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు తెలిపారు. 2023-24 ఏడాదికిగాను కేయూ నుంచి ఎంపికైన క్రీడాకారుల వివరాలను సోమవారం ప్రకటించారు. ఎంపికైన వారిలో కె.సువర్ణ, బి.భాగ్యశ్రీ, బి.మాధవి, (యూసీపీఈ, కేయూ) ఎస్. శివరాణి,(యూసీఈటీ, కేయూ) ఎస్.నందిని, (ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్, ఖమ్మం), బి.రమ్య(యూసీపీఈ, కేయూ), ఎం.కరీన, (టీటీడబ్ల్యూఆర్‌డీసీ(వుమెన్స్),ఆసిఫాబాద్), కె.రమ్య (వీసీపీఈ, బొల్లికుంట), బి. రేహజు, (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, వుమెన్స్ ఖమ్మం), కె.సింధూజ, (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, వుమెన్స్ ఉట్నూర్), ఎం.రచన, (యూసీపీఈ, కేయూ), సీహెచ్. మౌనిక (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, వుమెన్స్ ,ఉట్నూర్), టి.స్నేహ, (వీసీపీఈ, బొల్లికుంట), సీహెచ్.శివాని (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, వుమెన్స్, మంచిర్యాల) ఇ.వెన్నెల (టీటీడబ్ల్యూఆర్‌డీసీ (వుమెన్స్), కొత్తగూడెం),వి.రిషిత, (టీటీడబ్ల్యూఆర్‌డీసీ(వుమెన్స్), మంచిర్యాల)లు ఎంపికైయారు. వీరికి కొత్తగూడెం సింగరేణి వుమెన్స్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి మేనేజర్‌గా వ్యవహరిస్తారు. ఎంపికైన జట్టు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులు అభినందించారు.


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూజల నిర్వహణలో నాయిని రాజేందర్ రెడ్డి, ఆయన సతీమణి నీలిమారెడ్డితో పాటు సీపీ అంబర్ కిషోర్ ఝా

క్యాంపు కార్యాలయంలో నాయిని పూజలు

హనుమకొండ సిటీ, జనవరి 8 : హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు సోమవారం పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచాక తన సతీమణి నీలిమారెడ్డి, అల్లుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కూతురు గోదారెడ్డి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి కార్యాలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఏసీపీ కిరణ్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవీయస్ శ్రీనివాసాచార్యులు, ఈవీ శ్రీనివాస్, తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, వేద పండితులు విజయకుమారాచార్యులు, అరవింద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాల్సిందే..

కాజీపేట, జనవరి 8 : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట ఎంప్లాయిస్ సంఘ్ నాలుగు రోజుల రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సాధినేని వెంకటనారాయణ దీక్షలను ప్రారంభించారు. అనంతరం సీడబ్ల్యూసీ మెంబర్ చింత మురళి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల డబ్బును షేర్ మార్కెట్‌లో పెట్టి జూదం ఆడుతుందన్నారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని, ఆ హక్కును ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసేంతవరకు ఉద్యమించి తీరుతామన్నారు. ఈ దీక్షలను స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో జమ్మికుంట బ్రాంచ్ సెక్రటరీ నర్సింగరావు, ఆపరేటింగ్ బ్రాంచ్ సెక్రటరీ ముస్తాక్ హుస్సేన్, వర్కింగ్ చైర్మన్ నారాయణ, కె. రవి, వరప్రసాద్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ఏకాంబరం, బల్వీందర్ సింగ్, అజీజ్ పాషతోపాటు రైల్వే కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రైల్వేలను నిర్వీర్యం చేస్తున్న ప్రధాని మోదీ

రైల్వేలను ప్రధానిమోదీ పూర్తిగా నిర్వీర్యం చేస్తూ రైల్వే కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. చుక్కయ్య అన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని నిలిపివేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట సోమవారం రైల్వే దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల దీక్షలను ప్రారంభించారు. ఈ దీక్షలను సీపీఎం నేత ఎం. చుక్కయ్య, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీలు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నేత చుక్కయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేలో ఖాళీలను భర్తీ చేయకుండా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేయడమే కాకుండా రైల్వే కార్మికు లపై పనిభారాన్ని పెంచుతూ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఈ నిరసన దీక్షలో నాయకులు ఓరుగంటి సాంబయ్య, కొండ శ్రీనివాస్, ఎస్‌కే.అఫ్జల్ పాల్గొన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో యూనియన్ ఆల్ బ్రాంచ్ కో- ఆర్డినేటర్ నాయిని సదానందం, దాడబోయిన శ్రీనివాస్ యాదవ్, సంగ రమేశ్, ఈ. రాజేందర్, కె. బాల మురళీ రాజ్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

టీ- ఎమ్మార్పీఎస్‌కు పలువురి రాజీనామా

వడ్డెపల్లి, జనవరి 8: తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ అనుసరిస్తున్న తీరుకు నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వక్కల వెంకట్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నత్తి కోర్నెల్ మాదిగ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పాముల రమేష్ మాదిగ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టెన్త్‌లో 100 శాతం ఫలితాలు సాధించాలి

హనుమకొండ రూరల్, జనవరి 8: పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులతో టెన్త్ ఫలితాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యార్థుల హాజరుశాతంపై అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. ఇక నుంచి ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతీ వారం ప్రధానోపాధ్యాయులతో సమీక్ష ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై, జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి ఎ.శ్రీనివాస్, రాధ, సునీత, విజయ్ కుమార్, రామ్‌కిషన్‌రాజు, వెంకటేశ్వర్‌రావు, రమాదేవి పాల్గొన్నారు.

కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ (ఇన్‌చార్జి) తిరుపతిరెడ్డి



విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హనుమకొండ రూరల్, జనవరి 8: కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ (ఇన్‌చార్జి) వంటేరు తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్‌లోని దివ్య భవన్‌లో ఎన్పీడీసీఎల్ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేసన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వంటేరు తిరుపతిరెడ్డి, విశిష్ట అతిథులుగా విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.అశోక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంకితభావంతో పని చేసి కంపెనీని ఆర్థికంగా బలోపేతం చేయడంలో అకౌంట్స్ ఆఫీసర్ల పాత్ర కీలకమన్నారు. సమష్టి కృషితోనే ఏదైనా సాధించే సత్తా మనందరిలో ఉందని, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ విషయంలో ప్రభుత్వానికి నివేదించి వచ్చే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఉద్యోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వారు తెలిపారు.

అనంతరం టీఎస్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వేణుబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్.ఉపేందర్, ఉపాధ్యక్షులుగా కె.నవీన్ కుమార్, బి.వసంత్‌రావు, ఎస్.లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.సుదర్శన్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా ఇ.మురళి, చంద్రమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.లక్ష్మణ్, రేష్మ, ఫైనాన్స్ సెక్రటరీగా బి.దేవేందర్, మహిళా కార్యదర్శిగా ఎం.సునీత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ అదనపు కార్యదర్శి ఎ.నాగరాజు, అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు, జనరల్ మేనేజర్లు, ఎస్ఏఓలు, ఏఏఓలు, జేఏఓలు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే ధ్యేయం

దొంగల చేతిలో రాష్ట్రం లూటీ అయింది

రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి దంపతుల సేవలు అమూల్యం

ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్

గుర్తూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమి పూజ

పాల్గొన్న ఐదుగురు ఎమ్మెల్యేలు



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు

తొర్రూరు రూరల్, జనవరి 8 : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో ఎన్ఆర్ఐ హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సొంత ఖర్చుతో నిర్మిస్తున్న హనుమాండ్ల లక్ష్మమ్మ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భూమి పూజ కార్యక్రమాన్ని విప్ రాంచంద్రునాయక్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌లతో కలిసి సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ ఎంతో మంది యువకుల ప్రాణత్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం దొంగల చేతిలో పడి లూటీ అయిందన్నారు. అలాంటి దొంగలను ప్రజలు తరిమికొట్టి మార్పు కోరుకుంటూ విద్యావంతులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. రాజకీయాల్లోకి రాకుండానే 40 ఏళ్లుగా సేవ చేస్తున్న డాక్టర్ హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డిలు సేవాతత్పరులని, ఈ ప్రాంతం వారు కావడం అదృష్టమన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయగల సమర్థులని, ఇలాంటి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను అనేకంగా ఏర్పాటు చేయడానికి ముందుకురావాలని కోరారు.

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాక్షస పాలనను అంతం చేసి శాంతియుత పాలనకు స్వాగతం పలికిన ప్రజలను కాపాడుకోవడానికి ఝాన్సీ రుద్రమ్మవలే ముందుకు వచ్చారన్నారు. యువతలో నైపుణ్యం వెలికితీస్తేనే స్వయం శక్తులుగా ఎదుగుతారని, అందుకోసం పాటుపడుతున్న రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి దంపతులకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు.

ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు దోపిడీకి పాల్పడారని, వారంతా ఐపీసీ 390 పరిధిలోకి వచ్చే వాళ్లన్నారు. మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ దోపిడీ దారులకు అడ్డుకట్ట వేసి, బడుగుల అభివృద్ధి కోసం విద్యావంతులను అసెంబ్లీకి తీసుకెళ్లిన కాంగ్రెస్ పేదల పక్షపాతి అన్నారు.

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పుట్టిన గడ్డకు సేవ చేయాలనే తన అత్తామామలు హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి స్ఫూర్తితో ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి చేస్తామని అన్నారు. యువతలో నైపుణ్యాన్ని వెలికి తీసినప్పుడే అభివృద్ధి చెందుతారని, కుటుంబంలో ఒక్కరికి ఉపాధి లభిస్తే కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందన్నారు. వాళ్లు పడ్డ కష్టాలు ఎవ్వరూ పడవద్దనే ఉద్దేశ్యంతోనే యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో ప్లంబింగ్, బ్యూటీషియన్, చేనేత తదితర పనులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

డాక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకంతో తమ కోడలిని గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడం కోసం, పాలకుర్తిని అభివృద్ధి చేయడానికి శక్తినంతా ధారపోస్తానని అన్నారు. ఈ గెలుపు తమది కాదని, ప్రజల గెలుపేనని అన్నారు.

ఒకే వేదికపై ఐదుగురు ఎమ్మెల్యేలు

పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పనుల శంకుస్థాపనకు ఐదుగురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెలే డాక్టర్ మురళీనాయక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆతిథ్యం ఇచ్చారు.

నేడు పట్టుకున్న వాహనాల వేలం

హనుమకొండ క్రైం, జనవరి 8: హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తనిఖీలలో పట్టుకున్న రెండు వాహనాలను మంగళవారం ఉదయం సర్క్యూట్ గెస్ట్‌హౌస్ సమీపంలోని హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్టు అబ్కారీ శాఖ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక బొలెరో వాహనం, ఒక ద్విచక్రవాహనం వేలం వేయనున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటలకు వేలం పాట ప్రారంభం అవుతుందని 50 శాతం దరావత్ సొమ్మును చెల్లించిన తర్వాత పాటలో పాల్గొనాలని రామకృష్ణ తెలిపారు.

మేడారంలో ముమ్మరంగా పనులు



జంపన్నవాగులో ఇసుక పోస్తున్న దృశ్యం



స్నాన ఘట్టాలను శుభ్రం చేస్తున్న కూలీలు

మేడారం, జనవరి, 8 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మల మహా జాతర ఫిబ్రవరి 21 నుంచి జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ఆయా పనులు చేపడుతున్నారు. జాతర తొలిరోజు కన్నెపల్లి నుంచి మేడారం గద్దెలకు సారలమ్మ జంపన్న వాగు మీదుగా చేరుకోనున్న నేపథ్యంలో పలు పనులకు శ్రీకారం చుట్టారు. వాగులోని లోతట్టు ప్రదేశంలో టిప్పర్ల సహాయంతో ఇసుకను పోస్తూ మరమ్మతులు చేస్తున్నారు. అలాగే జాతరలో భక్తుల కోసం స్నాన ఘట్టాలను నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ప్రారంభించారు. స్నానాల కోసం బ్యాటరీ ట్యాప్స్, మహిళలు బట్టలు మార్చుకునే గదులు సిద్ధం చేస్తున్నారు. ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో పూడికతీత పనులను ముమ్మరం చేశారు. సంక్రాంతి పండుగ లోపు అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

పరిశీలించిన ఐటీడీఏ పీవో

మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం నీటిపారుదల చేపడుతున్న పనులను ఐటీడీఏ పీవో అంకిత్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని డీఈ సదయ్యకు సూచించారు. అనంతరం ఇన్‌ఫిల్టరేషన్ బావుల పూడికతీత, స్నాన ఘట్టాల వద్ద బ్యాటరీ ఆఫ్ ట్యాబ్స్, ఆదివాసీ మ్యూజియం సుందరీకరణ పనులు పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో వసంతరావు, ఎస్‌వోఎం రాజ్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్రీనివాసరావు



కేయూ క్యాంపస్, జనవరి 8 : కాకతీయ యూనివర్సిటీ నూతన హాస్టల్స్ డైరెక్టర్‌గా కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు హాస్టల్స్ డైరెక్టర్‌గా ఉన్న జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య స్థానంలో శ్రీనివాసరావును నియమించారు. జనవరి 9న మంగళవారం వెంకయ్య నుంచి పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. సోమవారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. గతంలో కేయూలో శ్రీనివాసరావు దివ్యాంగుల సెల్ డైరెక్టర్‌గా, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ల జాయింట్ డైరెక్టర్‌గా, క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, ప్రభుత్వ పాలన శాస్త్రం, హెచ్ఆర్ఎం విభాగాధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా, విభాగాధిపతిగా కొనసాగుతున్నారు.

నేరస్థులకు శిక్షపడే కేసులు నమోదు చేయాలి

మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు

ఐనవోలు, జనవరి 8: నేరస్థులు తప్పుచేసి తప్పించుకోకుండా శిక్షపడే కేసులనే నమోదు చేయాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాధవత్ రాజు డిమాండ్ చేశారు. ఒంటిమామిడిపల్లిలో డిసెంబరు 25న మంత్రాల నెపంతో గోనె సోమలక్ష్మి(65) అనే వృద్ధురాలిని హత్యచేశారు. ఈ సంఘటనపై మానవహక్కుల వేదిక బృందం నిజనిర్ధారణ కోసం ఒంటిమామిడిపల్లి గ్రామంలో బాధితురాలి ఇంటిని సందర్శించి కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. సోమలక్ష్మి దగ్గరి బంధువైన గోనె పెద్దరాజు కుమారుడు గోనె మధు డిసెంబరు 17న వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను తెలుసుకునేందుకు మృతుడి తల్లిదండ్రులు దేవుడు చెప్పేవారి వద్దకు వెళ్లి అడిగించుకున్నారని తెలిపారు. దేవుడు చెప్పేవారు మీ సమీప బంధువు (చేతబడి) మంత్రాలు చేయడం వల్లే మీ కుమారుడు చనిపోయాడని చెప్పడంతో రాజు కుటుంబసభ్యులు సోమలక్ష్మిని హత్యచేశారని తెలిపారు. పోలీసులు సకాలంలో నిందితులను గుర్తించినప్పటికీ మూఢ నమ్మకాలను నమ్మి హత్యచేశారని వారిపై పోలీసులు కేసు నమోదు చేయలేదని తెలిపారు. కేవలం హత్యచేశారని కేసు నమోదు చేయడంతో సరైన సాక్షాధారాలు ప్రత్యక్ష సాక్షులు లేరని కేసు నీరుగారి నిందితులు బయటకు వస్తారన్నారు. పోలీసులు కేవలం హత్యకేసు కాకుండా సంఘటనా స్థలంలో లభించే వాస్తవ ఆధారాలతో హత్యచేశారని కేసు నమోదు చేస్తే నిందితులకు శిక్ష పడుతుందన్నారు. మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకరావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర కార్యదర్శి టి. హరికృష్ణ, ఉమ్మడి జిల్లా కార్యదర్శి దిలీప్ పాల్గొన్నారు.

ఎంజీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా



కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్

హనుమకొండ అర్బన్, జనవరి 8 : ఎంజీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని ఎంజీఎం సూపరిం టెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అన్నారు. ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్ టీయూసీ) ఎంజీఎం బ్రాంచ్ ప్రెసిడెంట్ గద్దెల ప్రేమలత అధ్యక్షతన సోమవారం నూతన సంవత్సర సంబరాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంజీఎం సూపరింటెం డెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ కేక్ కట్ చేసి మాట్లాడారు. ఎంజీఎం ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, కొప్పు ప్రసాద్, ప్రేమలత, ఎంజీఎం బ్రాంచ్ ఫార్మసీ సూపర్‌వైజర్ ఎంకి పద్మావతి, సునీత, రాజ్యలక్ష్మీ, ప్రీతి, సజని, సుప్రియ, సరళారాణి, సల్మా, శ్యామల, సృజన, ఉదయకృష్ణ, రమాదేవి, భిక్షపతి, ఉమాదేవి, జమున, సుచరిత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఏబీవీపీ నూతన కమిటీ ఎంపిక

అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రశాంత్, శ్రావణ్



ప్రశాంత్ శ్రావణ్

కేయూ క్యాంపస్, జనవరి 8 : కాకతీయ యూనివర్సిటీ అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నూతన అధ్యక్షుడిగా కొక్కుల ప్రశాంత్, కార్యదర్శిగా బొండ్ల శ్రావణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కేయూ న్యూబాయ్స్ హాస్టల్‌లో ఏబీవీపీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోరెడ్డి బుచ్చిరెడ్డి, ఏబీవీపీ వరంగల్ విభాగ సంఘటన మంత్రి కుంట హర్షవర్ధన్, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబులు హాజరై కేయూ కమిటీ వివరాలను ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు వైస్ ప్రెసిడెంట్స్ లక్ష్మణ్, అశోక్, నవీన్, చరణ్, రాజు, లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీస్‌గా రాజు, అజయ్, రఘు, సాయి, ప్రకాశ్, యశ్వంత్, శివ తదితరులు ఎంపికైయారు. ఈ సమావేశంలో నూతన కమిటీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు, కేయూ ఇన్‌చార్జి నిమ్మల రాజేష్, రాష్ట్ర నాయకులు అంబాల కిరణ్, చట్ల సతీశ్, పెండ్ల అమర్, గట్టు ప్రశాంత్, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు

హనుమకొండ రూరల్, జనవరి 8 : 2023-24 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లలో ఈ నెల 11వ తేదీలోపు చివరి అవకాశంగా అపరాధ రుసుంతో అడ్మిషన్ పొందవచ్చునని డీఈవో అబ్దుల్ హై, ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ ఫీజు www.telanganaopenschool.org ఆన్‌లైన్‌లో చెల్లించి రశీదు పొందాలన్నారు. పూర్తి వివరాలకు 80084 03631, 93963 37572 సెల్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జీటీఏ రాష్ట్ర అసోసియేట్

అధ్యక్షుడిగా ప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా రవి



తాళ్ళపెల్లి ప్రకాశ్ దుర్గం రవి

ఖిలావరంగల్, జనవరి 8: ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా తాళ్ళపెల్లి ప్రకాశ్, ఉపాధ్యక్షుడుగా దుర్గం రవిలు ఎన్నికయ్యారని టీజీఏ రాష్ట్ర సంఘం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు చెన్నూరి వెంకట విమాదిత్య ప్రకటనలో తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్నికలలో ప్రకాశ్, రవిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పేర్కొన్నారు. వరంగల్ నగరానికి చెందిన వీరు రెండేళ్లపాటు కమిటీలో కొనసాగుతారన్నారు.

కేయూ హాస్టల్స్‌లో అవినీతిపై విచారణ జరిపించాలి

ఎస్ఎఫ్ఐ, బీఎస్ఎఫ్ నేతల డిమాండ్

కేయూ క్యాంపస్, జనవరి 8: కేయూ హాస్టళ్లలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి కల్లెపల్లి ప్రశాంత్ డిమాండ్ చేశారు. కేయూలో జరిగిన సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. నాణ్యతలేని పాలు, పెరుగు, కిరాణ సామాన్లను పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించకుండా కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై నాణ్యతలేని సరుకులను సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. వర్సిటీ అధికారులు తమకు అనుకూ లమైన వారికి కాంట్రాక్టర్లు ఇప్పించుకుంటున్నారని మండిపడ్డారు. నాసిరకం ఆహార పదా ర్థాలు సరఫరాతో విద్యార్థులు తరుచుగా అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు హతిరాం, జిల్లా కమిటీ సభ్యుడు స్టాలిన్, జస్వంత్, రోహిత్, బీఎస్ఎఫ్ నాయకులు మధు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద, అనాథ బాలికలకు దుప్పట్ల పంపిణీ

కాళోజీ జంక్షన్, జనవరి 8: ప్రభుత్వ హాస్టళ్లలో అనాథ పిల్లల హాస్టళ్లలో ఆశ్రయం పొందుతున్న బాలికల సంక్షేమం కోసం అవసరాలను తీరుస్తూ అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కరుకాల అనితారెడ్డి వారికి అమ్మలా వ్యవహరిస్తున్నారు. హనుమకొండలోని ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ అనాథ బాలికల హాస్టల్ విద్యార్థినులకు చలి నుంచి ఉపశమనం కలిగించడానికి దుప్పట్లు, స్వెట్టర్లు పంపిణీ చేశారు. అదే విధంగా హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ హాస్టల్ బాలికలకు శరీర దృఢత్వాన్ని పెంపొందించడానికి, రిలాక్స్ కావడానికి అవసరమైన ఆట వస్తువులను పంపిణీ చేశారు.



బాలికలకు దుప్పట్లు, స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ అనితారెడ్డి

సీపీని కలిసిన ట్రెయినీ ఐపీఎస్

హనుమకొండ క్రైం, జనవరి 8 : శిక్షణ నిమిత్తం వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు వచ్చిన ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్ సోమవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిశారు. సీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఆరు మాసాల పాటు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ హోదాల్లో పని చేసేందుకు శుభం నాగ్‌ను వరంగల్‌కు పంపించారు. మహారాష్ట్రకు చెందిన శుభంనాగ్ కరక్‌పూర్‌లో ఐఐటీ పూర్తి చేసి 2022లో ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. కమిషనరేట్ కార్యాయంలో సీపీ అంబర్ కిశోర్ ఝా శుభంనాగ్‌కు శాంతిభద్రతల పరిరక్షణపై వివరించారు.



సీపీకి పూల మొక్కను అందిస్తున్న ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

నాగసాయిచంద్ర హెల్పింగ్ హ్యాండ్స్ కోర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు పొడిశెట్టి విష్ణువర్ధన్, ఎస్. కుమారస్వామి, రాజు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ చాంబర్‌లో

అసిస్టెంట్ ప్రొఫెసర్ల బైఠాయింపు

కేయూక్యాంపస్, జనవరి 8: 2010 బ్యాచ్‌కు చెందిన కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమకు న్యాయం చేయాలని సోమవారం కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించి నిరసన చేపట్టారు. వర్సిటీలో పనిచేస్తున్న కొందరు కాంట్రాక్టు అధ్యాపకులు తమకు వ్యతిరేకంగా కేసులు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. తమకు వ్యతిరేకంగా వేసిన కేసులో యూనివర్సిటీ ఈ నెల 12న తమకు అనుకూలంగా కౌంటర్ దాఖలు చేయాలని రిజిస్ట్రార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందచేశారు. 130వ ఈసీ నిర్ణయం మేరకు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రిజిస్ట్రార్ శ్రీనివాసరావు స్పందిస్తూ తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ శాస్త్రీ, డాక్టర్ పొడేటి శ్రీనివాస్, రమేశ్, సుజాత, మంజుల పాల్గొన్నారు.

కేయూ ఆడిట్ విభాగం ఏఆర్‌గా రాము..?

కేయూ క్యాంపస్, జనవరి 8 : కాకతీయ యూనివర్సిటీ ఆడిట్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఎల్.రామును నియమించినట్టు సమాచారం. సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. ఈ నెల 5న శనివారం ఏసీబీ దాడుల్లో ఆడిట్ విభాగం ఏఆర్‌గా పనిచేసిన ఎస్.కిష్టయ్య పట్టుబడిన విషయం విదితమే. అ స్థానంలో కేయూ యూజీ పరీక్షల విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధుల్లో ఉన్న రామును ఆడిట్ విభాగానికి బదిలీ చేస్తూనిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే రాము ఆడిట్ విభాగంలో ఏఆర్‌గా జాయిన్ కావడానికి సంశయిస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లా స్థాయిలో జేఎన్‌ఎస్ జట్టు ప్రతిభ

హనుమకొండ స్పోర్ట్స్, జనవరి 8: ఇటీవల హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నీలో జవహర్‌లాల్ నెహ్రూ (జేఎన్ఎస్) జట్టు సభ్యులు సత్తా చాటి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో జేఎన్ఎస్ వర్సెస్ మేడారం జట్టు మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్ పోరులో మేడారం జట్టు ప్రథమ స్థానంలో నిలువగా జేఎన్ఎస్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. ఈ మేరకు ద్వితీయ స్థానంలో నిలిచిన జేఎన్ఎస్ జట్టును హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో అశోక్‌కుమార్, కోచ్ జీవన్‌లతో పాటు సీనియర్ క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.



జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కోచ్ జీవన్, నిర్వాహకులు

దరఖాస్తుల కంప్యూటరీకరణలో వేగం పెంచాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 8 : ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను వేగవంతంగా కంప్యూటరీకరణ చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, కమిషనర్ డిఎస్.చౌహన్‌లతో కలిసి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వానకాలం, యాసంగిలో మిల్లర్లు వారికి కేటాయించిన రోజువారి లక్ష్యాలను మిల్లింగ్ కెపాసిటీ ప్రకారం టార్గెట్‌ను పూర్తి చేసేందుకు కలెక్టర్లు, సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వానకాలానికి సంబంధించిన సీఎంఆర్ గడువు ఈ నెలాఖరు వరకేనని, గడువు పొడిగించేది లేదని తెలిపారు. గడువులోగా సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్‌జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

పర్యావరణ పరిరక్షణ విద్యార్థులతోనే..

డీఈవో డాక్టర్ అబ్దుల్ హై

హనుమకొండ రూరల్, జనవరి 8 : పర్యావరణ పరిరక్షణ విద్యార్థులతోనే ప్రారంభం కావాలని డీఈవో డాక్టర్ అబ్దుల్ హై అన్నారు. సోమవారం భీమారంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సుస్థిర జీవన విధానం పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో అబ్దుల్ హై మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న విపత్తు ప్లాస్టిక్ ఉత్పత్తుల వ్యర్థాలేనని, విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సస్టైనబుల్ లైఫ్ స్టైల్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాస స్వామి, విశ్రాంత ఆర్మీ మేనేజర్ శివకిరణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

మడికొండ: విద్యార్థులు బాల్యం నుంచే మొక్కలు, జంతువులు, పక్షులతో పాటు జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంచుకోవాలని పర్యావరణ పరిరక్షణ వేదిక అధ్యక్షులు కాజీపేట పురుషోత్తం సూచించారు. పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రతీ నెలలో ఒక ప్రభుత్వ పాఠశాలలో చెట్టు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

అందులో భాగంగా గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ కడిపికొండలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సోమవారం మొక్కలు నాటి మాట్లాడారు. ప్రతీ దేశంలో భూభాగంపై 33 శాతం అడవులు ఉండాల్సిన అడవులు మానవ తప్పిదాల వల్ల 23 శాతానికి పడిపోవడంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగి ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్ మాట్లాడుతూ ప్రతీ పాఠశాల విద్యార్థులు వారి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి పాఠశాలను హరిత పాఠశాలగా మార్చుకొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత పోషించాలన్నారు. ఈ సందర్భంగా అందరితో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వేదిక ప్రధాన కార్యదర్శి టి.శ్రవణ్‌కుమార్, కోశాధికారి నల్లెల్ల రాజయ్య, సభ్యులు వి. శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. మనోజ్‌కుమార్, ఎస్ఎంసీ ఛైర్మన్ రాజు, పీఈటీ సదానందం, ఉపాధ్యాయులు రాజగోపాల్ పాల్గొన్నారు.



సస్టైనబుల్ లైఫ్ స్టైల్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో తదితరులు



సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరణను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

హనుమకొండ రూరల్, జనవరి 8: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్రీయ ఆలోచనలు, పరిశీలన ఆసక్తిని రేకెత్తించడానికి ఇలాంటి సైన్స్ టాలెంట్ టెస్టులు దోహదపడతాయన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక బాధ్యులు మాట్లాడుతూ 8,9,10 తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ఈ నెల 19, మండలస్థాయిలో ఈ నెల 27న, జిల్లాస్థాయిలో ఫిబ్రవరి 3వ తేదీన టాలెంట్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వేణు, డాక్టర్ రాములు, ఉమామహేశ్వర్‌రావు, కనకాచారి, మురళీ మోహన్, విద్యాదేవి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆల్ పెన్షనర్స్ డైరీ ఆవిష్కరణ

ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ 2024 డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు పి.కృష్ణమూర్తి, తూపురాణి సీతారాం, పెండ్యాల బ్రహ్మయ్య, ఎన్.వీరన్న, జే.ప్రభాకర్‌రెడ్డి, సీహెచ్.సత్యనారాయణ, విద్యాదేవి, సమ్మయ్య, సిద్దిరాజయ్య, శంకర్ లింగం, శంకర్‌రావు, సంపత్ కుమార్, రాజమల్లు, నారాయణ, శ్రీనివాసులు, పి.వేణు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

హనుమకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వడ్డెపెల్లి ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. వడ్డెపెల్లి చెరువు కట్టపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వడ్డెపెల్లి ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, కోశాధికారి కైలాష్ చంద్ అగర్వాల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, సాగర్, తిరుపతి, సారయ్య, మహ్మద్ అలీ, శ్రీనివాస్, ఆడిటర్ కొండ్ర శంకర్, వెంకటేశ్వర్లు, జోగన్న, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఐనవోలు ఎస్సైగా అనిల్‌కుమార్

ఐనవోలు, జనవరి 8: ఐనవోలు ఎస్సైగా గైకడి అనిల్‌కుమార్ సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన వి. నవీన్‌కుమార్ గంజాయి నార్కోటిక్ డ్రగ్స్ కేసులో సీఐకు బదులు ఎస్సై కేసు నమోదు చేశారని ఆయనను సీపీ అంబర్‌కిషోర్ ఝా మధ్యాహ్నం సస్పెన్షన్ ఉత్తర్వులు జారిచేసింది తెలిసిందే. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న అనిల్‌కుమార్‌ను ఎస్సైగా నియమిస్తూ ఉత్తర్వులు జారిచేయగా విధుల్లో చేరారు.



విధుల్లో చేరిన అనిల్‌కుమార్

మీడియా పాయింట్లకు ఆర్థిక సహాయం



మీడియా పాయింట్ల ప్రతినిధులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ బాధ్యులు

వడ్డెపల్లి, జనవరి 8: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ పరిధిలోని కాజీపేట, హసన్‌పర్తి మీడియా పాయింట్లకు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య ఆధ్వర్యంలో సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియా పాయింట్ల ప్రతినిధులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా పాయింట్ల నిర్వహణ కోసం నెలకు రూ. 10 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాజీపేట మీడియా పాయింట్ అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, హసన్‌పర్తి మీడియా పాయింట్ అధ్యక్షుడు కిశోర్, ప్రధాన కార్యదర్శి బాబుకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

శ్రీరాముడి అక్షింతల పంపిణీ..

శ్రీరాముడి పూజిత అక్షింతలను విశ్వహిందూ పరిషత్ మహా నగర కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు,ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్యతో పాటు ప్రెస్ క్లబ్ బాధ్యులు, జర్నలిస్టులకు పూజిత అక్షింతలను పంపిణీచేశారు.

మహ్మద్ అన్వర్‌కు ప్రతిష్టాత్మక సేవారత్న అవార్డు

సుబేదారి, జనవరి 8 : గత దశాబ్ద కాలంగా పేదల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న హనుమకొండకు చెందిన ఆయాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, అయాన్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఛైర్మన్ మహమ్మద్ అన్వర్‌కు ప్రతిష్టాత్మక సేవారత్న అవార్డు లభించింది. హైదరాబాద్‌కు చెందిన వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థవారు సోమవారం హైదరాబాద్‌లో అన్వర్‌ను శాలువాతో సత్కరించి గోల్డ్ మెడల్, సేవారత్న అవార్డును అందజేశారు. అన్వర్ ప్రతీ సంవత్సరం వేలాది మట్టి వినాయకులను ఫ్రీగా పంపిణీ చేయడం, ఎంబీబీఎస్ చదివిన పేద విద్యార్థులను దత్తత తీసుకుని చదివించడం, అయాన్ ఇనిస్టిట్యూషన్ ద్వారా ఎంతో మంది ఉద్యోగాలు సాధించడానికి కృషి చేస్తున్నందుకు గాను ఈ అవార్డును ప్రకటించినట్లు వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ ప్రతినిధులు తెలిపారు.

అజీజ్‌ఖాన్ సేవలు ఎనలేనివి

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శశిజాదేవి

సుబేదారి, జనవరి 8: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ అజీజ్‌ఖాన్ గ్రంథాలయానికి చేసిన సేవలు ఎనలేనివని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శశిజాదేవి అన్నారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అజీజ్‌ఖాన్, డైరెక్టర్ మధుకు సోమవారం జిల్లా గ్రంథాలయంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అజీజ్‌ఖాన్, మధును సన్మానించారు. అనంతరం శశిజాదేవి మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థ అత్యున్నత స్థానానికి, అభివృద్ధికి అజీజ్‌ఖాన్ ఎన్నో మంచి పను లు చేశారన్నారు. ఈ వీడ్కోలు సమా వేశంలో డిప్యూటీ లైబ్రేరియన్ కరుణాకుమారి, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, గ్రేడ్-2 లైబ్రేరియన్ మల్సూర్, గ్రేడ్-3 లైబ్రేరియన్ పురుషోత్తం రాజు, రాజేష్, కుమారస్వామితో పాటు జిల్లా గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 9 మంది డీబార్

కేయూ క్యాంపస్, జనవరి 8: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 1,3,5వ సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం 9 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా తనిఖీ అధికారులు డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డాక్టర్ ఎం. తిరుమలదేవిలు తెలిపారు. డీబారైన వారిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1, ఉమ్మడి ఖమ్మంలో - 2, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 6 మంది డీబారైనట్లు తెలిపారు. వీరిపై చర్యలుంటాయని తెలిపారు.

పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహన

మడికొండ, జనవరి 8: మడికొండలోని ప్రభుత్వ పాఠశాలలో మడికొండ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం డ్రగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా చదువు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. వారి తల్లిదండ్రులు సైతం విద్యార్థులను నడవడికను గమనిస్తూ వారిని సరైన దారిలో వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై దివాకర్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు ప్రతీ లబ్ధిదారుడికి అందించాలి

ధర్మసాగర్, జనవరి 8: ధర్మసాగర్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో జవహర్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగింది. ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతీ లబ్ధిదారులకు అందించాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్నారు. రేషన్‌కార్డులు లేని లబ్ధిదారులకు పథకలు అందుతాయా లేదా అని సభలో సభ్యులు అడిగి తెలుసుకున్నారు. కార్డులు లేని వారు తెల్ల కార్డుపై దరఖాస్తులు చేసుకుంటే సరి పోతుందని ఎంపీడీవో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఆహ్వానించాలని ఎంపీటీసీలు, సర్పంచ్ తమ అభిప్రాయన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్ పాల్గొన్నారు..

ప్రజలతో దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణం..

కాళోజీ జంక్షన్, జనవరి 8: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరులు దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని ప్రజల చేత సినిమాగా మల్చడం చరిత్ర అవుతుందని ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేష్ అన్నారు. హనుమకొండలోని ఒక ప్రైవేటు సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సినిమా నిర్మాణ కమిటీ హనుమకొండ జిల్లా ఛైర్మన్ రావుల సురేష్ సమావేశానికి అధ్యక్షత వహించారు. పేద ప్రజల ఆకలి మెతుకు ప్రజలు దొరలపై తిరగబడి వందల ఎకరాల భూములను స్వాధీ నం చేసుకొని దున్నుకొని తమ ఆకలిని తీర్చుకున్నారని ఆయన వివరించారు.

ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ కమిటీ వరంగల్ జిల్లా ఛైర్మన్ టీఎస్. స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజల నుంచి విరాళాలు సేకరించి అట్టి డబ్బులతో సినిమాను నిర్మించ తలపెట్టారు. కార్యక్రమంలో సినిమా దర్శకుడు ఎం.సేనాపతి, బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గజ్వేల్ మధుసూదన్, వివిధ కుల సంఘాల, ప్రజా సంఘాల నాయకులు వంగ రమేష్ యాదవ్, బొజ్జ రవీందర్ యాదవ్, మిర్యాల్‌కార్ దేవేందర్, సాయిని నరేంద్ర, రహిమున్నిసా బేగం, మల్లెల్ల రాజయ్య, ప్రతాపగిరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా 'ప్రజాపాలన' డేటా ఎంట్రీ

(5వ పేజీ తరువాయి)

ఎంట్రీ ఆపరేటర్లు తమ సంబంధిత సూపర్‌వైజర్ పర్యవేక్షణలో ఆన్‌లైన్ డేటా ఎంట్రీ చేస్తున్నారు. నాలుగు లేదా అయిదు ఎంట్రీ కేంద్రాలకు ఒక టీం లీడర్‌ను నియమించారు. వీటిలో డేటా ఎంట్రీని చూసే బాధ్యతను ఆయనకు అప్పగించారు. షిఫ్టుల వారీగా సిబ్బంది విధులను నిర్వహిస్తున్నారు. దరఖాస్తుల సంఖ్యను బట్టి రోజు రెండు షిఫ్టులు ఒక్కో దగ్గర మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు.

అదనపు సిబ్బంది

ప్రజాపాలన దఖాస్తులను ఎంట్రీ చేయడానికి అవసరమైన సిబ్బందిని ప్రైవేటుగా నియమించుకునేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అనుమతి ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ల ఆదేశాల మేరకు అధికారులు మండల కార్యాలయాలు, పురపాలక సంఘాల అధికారులు ప్రైవేటు సిబ్బందిని నియమించుకున్నాయి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండి, సొంత ల్యాప్ టాప్ ఉన్నవారి నుంచి దరఖాస్తులను కోరారు. ఒక్కో దరఖాస్తును అన్ని వివరాలతో పూర్తిగా ఎంట్రీ చేసినందుకు రూ. 15 వరకు చెల్లించే ఒప్పందంపై వీరిని నియమించుకున్నాయి. కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి ఒక్కో దరఖాస్తును ఎంట్రీ చేయడానికి 5 నుంచి 10 నిముషాలు పడుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటన్నిటిని 17వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలి. కానీ ప్రస్తుతం కంప్యూటర్ ఆపరేటర్లు చాలినంత మంది అందుబాటులో లేరు. దీనితో ప్రైవేటు వ్యక్తులను నియమించుకోవడం ద్వారా నిర్ణీత గడువులోగా డేటాఎంట్రీలను పూర్తి చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

సర్వర్ సమస్యలు

డేటాఎంట్రీలో సర్వర్ సమస్యలు ప్రతిబంధకంగా మారాయి. సర్వర్ సమస్య వల్ల అప్లికేషన్ పదే పదే లాగ్ అవుతోందని ఆపరేటర్లు వాపోతున్నారు. దీని వల్ల ఆపరేటర్లు రోజుకు 60 నుంచి 70 వివంచి దరఖాస్తులను ఎంట్రీ చేయలేకపోతున్నారు. దీనికితోడు ఆధార్ కార్డు నెంబర్‌ను 12 డిజిట్‌లకు పరిమితం చేయకపోవడంతో ఎన్ని నెంబర్లు ఇచ్చినా తీసుకుంటున్నది. దీని వల్ల ఒక్క నెంబర్ తక్కువైన, ఎక్కువైనా తప్పుపడి లబ్ధిదారుడు నష్టపోయే ప్రమాదం ఉంది. దీనితో ప్రతీ దరఖాస్తును చాలా జాగ్రత్తగా ఎంట్రీ చేయాల్సి వస్తోంది. దీనికి తోడు ఎడిట్ ఆప్షన్ కూడా లేకపోవడంతో మరింత సమస్యగా మారినట్టు ఆపరేటర్లు చెబుతున్నారు. ప్రస్తుతం అయిదు గ్యారెంటీలకు మాత్రమే డేటాఎంట్రీ జరుగుతున్నది. రేషన్ కార్డుల కోసం పెట్టుకున్న దరఖాస్తుల ఎంట్రీపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు.

కేజేకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శ్రీనివాస్ గౌడ్

కాజీపేట, జనవరి 8 : తెలంగాణ కల్లు గీతకార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కాజీపేటకు చెందిన బుర్ర శ్రీనివాస్ గౌడ్‌ను రాష్ట్ర కమిటీ సోమవారం హైదరాబాద్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనకు ఈ పదవి ఇచ్చినందుకు సంఘం శ్రేయస్సుకోసం కృషి చేస్తానన్నారు. తనను కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య, ఇతర సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు కొత్తకొండ వీరభద్రస్వామి కల్యాణం

హాజరుకానున్న మంత్రులు పొన్నం, కొండా సురేఖ

భీమదేవరపల్లి, జనవరి 8 : భక్తుల కొంగు బంగారమైన కొత్తకొండ ఈరన్న జాతరకు శ్రీవీరభద్ర స్వామి ఆలయం ముస్తాబైంది. ఈ సంవత్సరం సమ్మక్క-సారలమ్మ జాతర ఉంటుంది. సమ్మక్క-సారలమ్మను దర్శించుకునే ముందు వీరభద్రస్వామిని దర్శించుకోవడం భక్తులకు ఆనవాయితీ. దీంతో పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోర మీసాలను సమర్పిస్తూ స్వామి వారి కృపకు భక్తులు పాత్రులవుతారు. భక్తులకు విస్తృత ఏర్పాట్లు కల్పించేందుకు గత నెల రోజులుగా అధికారులు పనులు మొదలు పెట్టారు. భక్తులకు ఎక్కడ లోటుపాట్లు కలుగకుండా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈవో కిషన్‌రావు ప్రతి పనిని దగ్గరుండి పర్యవేక్షిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అధికారులందరి సమిష్టి కృషితో జాతరను విజయవంతం చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన శ్రీవీరభద్రస్వామి కల్యాణం ఈ నెల 10న సాయంత్రం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. స్వామి వారికి పట్టువస్త్రాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు సమర్పిస్తారు.

డాక్టర్

ఆయుర్వేదం

కర్పూరం రసాయనాలతో తయారైన కృత్రిమ పదార్థం కాదు. కర్పూరం చెట్టు ఆకులు, కొమ్మల నుంచి కర్పూరాన్ని తయారు చేస్తారు. కర్పూరంలో చాలా రకాలుంటాయి. ప్రతి కర్పూరం భిన్నమైన స్వభావాలనూ, ప్రభావాలనూ కలిగి ఉంటుంది.

ఈ కర్పూరం అపూర్వం

కర్పూరం చెట్టు వేరు, ఆకులు, కొమ్మలను నీళ్లలో మరిగించి, డిస్టిలేషన్ పద్ధతిలో తయారుచేసే కర్పూరం పచ్చ కర్పూరం. టర్పంటైన్ నుంచి రసాయనిక ప్రక్రియ ద్వారా సేకరించేది హారతి కర్పూరం. ఇది ఔషధ తయారీకి పనికిరాదు. చిన్నపిల్లల శరీరాల్లో దోషాలను హరించడానికి ఆముదంతో కలిపి పట్టించేది రస కర్పూరం. వీటన్నిటికంటే భిన్నమైనది, ఔషధ గుణాలను కలిగి ఉన్నది భీమసేని కర్పూరం. నేరుగా ఉపయోగించడానికి వీలుగా మొక్క నుంచి లభించే అపక్వ కర్పూరమిది. దీన్ని ఔషధ తయారీలో విరివిగా వాడుతూ ఉంటారు. తెల్లని మేఘంలా కనిపించే కర్పూరం సితాభ్ర కర్పూరం. మంచు లాంటి రేణువులను కలిగి ఉండేది, హిమవాలుక కర్పూరం మంచును పోలిన రేణువులను కలిగి ఉంటుంది. ఘనసార కర్పూరం మేఘాన్ని తలపించేలా ఉంటుంది. మంచులా చల్లగా ఉండేది హిమ కర్పూరం. ఇవే కాకుండా ఉదయ భాస్కరవు, కమ్మ కర్పూరము మొదలైన ఎన్నో రకాల కర్పూరాలున్నాయి. ఆయు



ర్వేద చికిత్సల్లో కర్పూరాన్ని విస్తృతంగా వాడతారు. వీటిలో ప్రధానమైనది భీమసేని కర్పూరం. దీని ఉపయోగాలు ఇవే!

- ఈ కర్పూరాన్ని పొడి చేసి, వేడి నీళ్లలో వేసి ఆవిరి పీల్చితే జలుబు తగ్గుతుంది, ముక్కు దిబ్బెడ వదులుతుంది. తర్వాత ఈ పొడికి ఎసెన్షియల్ ఆయిల్ కలిపి గొంతు, భుజాలు, ఛాతీ మీద రుద్దుకోవాలి.
- శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారితే, భీమసేని కర్పూరాన్ని వస్త్రంతో చుట్టి వాసన పీల్చాలి. ఇలా చేస్తే ఊపిరితిత్తులు విప్పారి, ఎక్కువ ఆక్సిజన్‌ను పీల్చుకోగలుగుతాం!
- పంటి నొప్పి వేధిస్తుంటే, ఆ ప్రదేశంలో ఈ కర్పూరం ముక్కను కొద్దిసేపు ఉంచుకోవాలి. భీమసేని కర్పూరాన్ని వంటకాల్లో కూడా వాడుకోవచ్చు. కడుపు లోపలికి తీసుకోవడం ద్వారా శరీరంలోని విషాలు బయటకు వెళ్లిపోతాయి.
- ఈ కర్పూరం పొడిని కొబ్బరి నూనెలో కలిపి తల మర్దన చేస్తే కమ్మని నిద్ర పడుతుంది. అలాగే పడగ్గదిలో ఈ కర్పూరాన్ని మండించినప్పుడు వెలువడే వాసన కూడా నిద్ర పట్టేలా చేస్తుంది.
- ఈ కర్పూరం పొడిని బాదం నూనె లేదా కొబ్బరి నూనెలో కలిపి తలకు పట్టించి, మర్దన చేసి గంట తర్వాత తలస్నానం చేస్తే వెంట్రుకలు దట్టంగా పెరుగుతాయి.
- కర్పూరం పొడిలో కొద్దిగా నీళ్లు కలిపి ముద్దలా చేసి ముఖానికి పూసుకుని, పది నిమిషాల తర్వాత కడిగేస్తే మొటిమలు తగ్గుముఖం పడతాయి.

ఉమెన్స్ హెల్త్

నెలసరి క్రమం తప్పితే?

గర్భం దాల్చినప్పుడు, మెనోపాజ్‌కు చేరుకున్నప్పుడు తప్ప మహిళల నెలసరి ఎప్పుడూ క్రమం తప్పదు. అలా తప్పిందంటే అందుకు శారీరక సమస్యే కారణం అయి ఉంటుంది.



అధిక ఒత్తిడి: కొంతకాలంపాటు ఒత్తిడి కొనసాగితే, మహిళల శరీరం ఆ ఒత్తిడిని తట్టుకోవడానికి అవసరమయ్యే శక్తి కోసం అండాల విడుదలను ఆపేస్తుంది. ఏదైనా జరగకూడనిది జరిగినా, అడ్రినలిన్ అవసరానికి మించి స్రవించి, దాని ప్రభావం వల్ల ఈస్ట్రోజెన్, పునరుత్పత్తి హార్మోన్ల స్రావాల్లో తేడా రావొచ్చు. ఈస్ట్రోజెన్ తగినంత లేనప్పుడు గర్భాశయంలో పలచని పొర ఏర్పడే పరిస్థితి ఉండదు. ఫలితంగా నెలసరి రాదు.

ఆహార లోపం: యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు, ప్రోబయాటిక్స్ లోపించిన, ఉత్ప్రేరకాలు ఎక్కువగా ఉన్న డైట్ వల్ల అడ్రినలిన్, థైరాయిడ్ గ్రంథులు దెబ్బ తింటాయి. ఉదాహరణకు చక్కెరలు ఎక్కువగా ఉండి, హైడ్రోజెనేటెడ్ ఫ్యాట్స్, కృత్రిమ రంగులు, పురుగు మందులు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల థైరాయిడ్, అడ్రినల్ సమస్యలు తలెత్తుతాయి. కార్టిసాల్ స్రావం పెరిగితే మిగతా హార్మోన్లు, మరీ ముఖ్యంగా సెక్సువల్ హార్మోన్ల ప్రభావం కుంటుపడుతుంది.

బరువు తగ్గడం: మీ బాడీ మాస్ ఇండెక్స్ 18 - 19 కంటే తక్కువకు పడిపోయినా నెలసరి క్రమం తప్పుతుంది. బరువు తగ్గడం కోసం విపరీతంగా కడుపు మాడ్చుకునే వాళ్లలో రక్తహీనత ఏర్పడుతుంది. ఫలితంగా నెలసరి స్రావం తగ్గడం, ఆలస్యమవడం జరుగుతూ ఉంటుంది.

హెల్తీ హ్యాబిట్

తల నొప్పా?



తలనొప్పి ఎప్పుడో ఒకప్పుడు ప్రతి ఒక్కరినీ వేధిస్తుంది. అయితే తలనొప్పి మొదలవగానే చటుక్కున టాబ్లెట్ వేసేసుకోకుండా ఇవిగో ఈ చిట్కాలు ప్రయత్నించి చూడండి.

- **నీళ్లు తాగండి:** ఒంట్లో నీటి శాతం తగ్గినా తలనొప్పి వస్తుంది. కాబట్టి వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగండి.
- **పుచ్చకాయ తినండి:** పుచ్చకాయలో ఉండే ఖనిజ లవణాలు చెమట ద్వారా శరీరం కోల్పోయిన లవణాల్ని భర్తీ చేస్తాయి. కాబట్టి పుచ్చకాయ తింటే లవణాల కొరత మూలంగా వచ్చే తలనొప్పి తగ్గుతుంది.
- **కాఫీ తాగొచ్చు:** కాఫీలోని కెఫీన్ న్యూరాన్లను ఉత్తేజపరుస్తుంది. కాబట్టి ఒత్తిడి మూలంగా వచ్చే తలనొప్పి విరుగుడుకు ఓ కప్పు కాఫీ తాగండి.
- **పెప్పర్‌మింట్ ఆయిల్:** శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల వల్ల కూడా కూడా తలనొప్పి రావొచ్చు. ఈ రకం తలనొప్పి తగ్గాలంటే కణతల దగ్గర పెప్పర్‌మింట్ ఆయిల్‌తో మర్దన చేయండి.
- **కారంగా తినండి:** ముక్కు పక్కల, ఎముకల అడుగున ఉండే గాలి గదుల్లో ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా తలనొప్పి మొదలవుతుంది. ఈ నొప్పి తగ్గాలంటే కారంగా ఉండే పదార్థాలు తినాలి. కారం ఘాటుకు ఆ ప్రదేశాలు ప్రేరేపితమై ఇన్‌ఫెక్షన్‌ను కరిగించి ముక్కు ద్వారా బయటకు తెప్పిస్తాయి.

వ్యాక్సిన్స్



కొవిడ్‌తో వ్యాక్సిన్ల పట్ల మనందరిలో అవగాహన పెరిగింది. అయితే ఇతర వ్యాధుల నుంచి రక్షణ కల్పించే వ్యాక్సిన్లు కూడా పెద్దలకు అందుబాటులో ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుని, వ్యాధులకు అడ్డుకట్ట వేద్దాం!

పెద్దల టీకాలు

పిల్లలకే వ్యాక్సిన్లు అనుకునేవాళ్లం. కానీ పెద్దలకు కూడా వ్యాక్సిన్లు అవసరమనే విషయం మనకు కొవిడ్ నేర్పింది. నిజానికి యుక్తవయస్కులూ, పెద్దలూ తప్పనిసరిగా తీసుకోవలసిన వ్యాక్సిన్లు కొన్ని ఉన్నాయి. రోగనిరోధకశక్తి పెరుగుదలకూ, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకూ, శ్వాసకోశ వ్యాధుల అడ్డుకట్టకూ వీటిని తీసుకోవడం అవసరం. వైరస్ స్ట్రెయిన్, రకాన్ని బట్టి వేర్వేరు దేశాల్లో వేర్వేరు వ్యాక్సిన్లు తయారవుతూ ఉంటాయి. రూపాలు మార్చుకుంటూ ఉండే వైరస్‌లకు తగ్గట్టుగా కొత్త వ్యాక్సిన్లు నిరంతరంగా తయారవుతూనే ఉంటాయి. కాబట్టి భయాలు, అపోహలు వీడి ప్రతి ఒక్కరు వ్యాక్సిన్లతో వ్యాధులకు అడ్డుకట్ట వేస్తూ ఉండాలి.

14 నుంచి 65 ఏళ్ల వాళ్ల కోసం...

- **ఇన్‌ఫ్లూయెంజా:** ఏడాదికోసారి ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఇది స్వైన్ ఫ్లూ లాంటి శ్వాసకోశ వ్యాధులను నియంత్రిస్తుంది.
- **టెటనస్, డిఫ్తీరియా, పెరిట్యూసిస్:** చిన్నప్పుడు టెటనస్ వ్యాక్సిన్ వేసుకోని వాళ్లు 18 ఏళ్ల వయసుకు వచ్చిన తర్వాత, ఈ వ్యాక్సిన్‌ను ప్రతి పదేళ్లకోసారి వేయించుకుంటూ ఉండాలి.
- **వెరిసెల్లా:** చిన్నప్పుడు చికెన్ పాక్స్ వ్యాక్సిన్ వేయించుకోని వాళ్లు, 18 ఏళ్ల తర్వాత, 65 ఏళ్ల లోపు ఎప్పుడైనా వెరిసెల్లా వ్యాక్సిన్ వేయించుకోవచ్చు. హై రిస్క్ ఉన్నవాళ్లు రెండు డోసులు వేయించుకోవాలి.
- **హెచ్‌పివి:** గర్భాశయ ముఖద్వారా కేన్సర్ నివారణ కోసం 14 నుంచి 18 ఏళ్ల లోపు అమ్మాయిలకు ఈ వ్యాక్సిన్ వేయించాలి. ఈ వయసులో తీసుకోనివాళ్లు, 26 ఏళ్ల వరకూ కూడా ఈ వ్యాక్సిన్‌ను వేయించుకోవచ్చు. 19 నుంచి 21, లేదా 22 నుంచి 26 ఏళ్ల మధ్య హెచ్‌పివి మూడు డోసులు వేయించుకోవచ్చు.
- **మీజిల్స్, మంప్స్, రుబెల్లా:** ఈ మూడు వ్యాధులకు అడ్డుకట్ట వేయడం కోసం ఎమ్ఎమ్ఆర్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. చిన్న వయసులో టీకాలు వేయించుకోని వాళ్లకు ఈ వ్యాధులు వస్తుంటాయి. గతంలో 30 ఏళ్ల వాళ్లలో కూడా మీజిల్స్ కనిపించేవి. దీన్ని నివారించడం కోసం ప్రెగ్నెన్సీకి ముందు మహిళలు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలి. ఇలా చేయడం వల్ల పుట్టబోయే బిడ్డకూ, తల్లికీ ఈ వ్యాధులు సోకే అవకాశాలు తగ్గుతాయి.
- **టైఫాయిడ్:** ఈ వ్యాక్సిన్ చిన్నప్పుడు వేసుకోనివాళ్లు, 18 ఏళ్ల తర్వాత, 65 ఏళ్ల లోపు వేయించుకోవచ్చు. దీనిని రెండు డోసులు తీసుకోవాలి. వయసును బట్టి డోసులను నిర్ణయిస్తారు.
- **హెపటైటిస్ ఎ, బి:** వయసును బట్టి ఈ వ్యాక్సిన్ వేస్తారు. హెపటైటిస్ ఎ రెండు డోసులు, బి మూడు డోసులు వేస్తారు.

ఎప్పుడు, ఎలా?

కొన్ని రకాల వ్యాక్సిన్లను కలిపి వేయించుకోవచ్చు. కొన్ని రకాల వ్యాక్సిన్లకు రెండు వారాల గ్యాప్ అవసరం ఉంటుంది. కొన్ని వ్యాక్సిన్ల విషయంలో రెండు వ్యాక్సిన్లు ఒకేసారి కలిపి వేసుకోవచ్చు. కొవిడ్ వ్యాక్సిన్ సమయంలో ఇతర వ్యాక్సిన్లు వేసుకోకూడదనే ఆంక్షలు ప్రారంభంలో ఉండేవి. ఇప్పుడు అలాంటి ఆంక్షలు లేవు. ఇతర వ్యాక్సిన్లను వైద్యుల సలహా మేరకు వేసుకోవచ్చు. వ్యాక్సిన్లను వేయించుకోవడం ద్వారా, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు, ఫ్లూ, కిడ్నీ ఫెయిల్యూర్ మొదలైన సమస్యల నుంచి రక్షణ పొందవచ్చు. శరీర రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేసి, వ్యాధికారక క్రిములతో పోరాడడానికి తగినట్టుగా మన శరీరాన్ని సిద్ధం చేసే వ్యాక్సిన్లను ఎవరైనా, ఎప్పుడైనా వైద్యుల సలహా మేరకు వేయించుకోవచ్చు. వ్యాక్సిన్లు తీసుకున్న తర్వాత దుష్ప్రభావాలు తలెత్తే అవకాశాలు కూడా బాగా తగ్గిపోయాయి. కాబట్టి ఎవరైనా నిర్భయంగా వ్యాక్సిన్లను తీసుకోవచ్చు.

ఇన్‌ఫ్లూయెంజా- రూ.2 వేలు

ఎ, బి, సి అనే మూడు రకాల ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌లు ఉంటాయి. వీటిని నియంత్రించడం కోసం ఇన్‌ఫ్లూయెంజా వైరస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. పిల్లలు మొదలు పెద్దల వరకూ వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చు. ఆస్తమా లాంటి శ్వాసకోశ వ్యాధుల నియంత్రణకు ఈ వ్యాక్సిన్ అత్యవసరం. ఐదు కంపెనీలు ఈ వ్యాక్సిన్‌ను తయారు చేస్తున్నాయి.

న్యూమోకోకల్- రూ.2 నుంచి 4 వేలు

ఈ వ్యాక్సిన్‌లో రెండు రకాలుంటాయి. పెద్దల్లో సిపిఒడి, ఆస్తమా, గుండె జబ్బు, కాలేయ జబ్బు, న్యుమోనియాల నివారణకు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలి. 45 నుంచి 65 సంవత్సరాల లోపు వాళ్లు ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చు. 60 నుంచి 65 సంవత్సరాల వారికి ఒక డోసు వ్యాక్సిన్ సరిపోతుంది. ఆరోగ్య రంగంలో పని చేసేవాళ్లు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలి. ఏడాదికోసారి వేయించుకుంటే, జీవితాంతం పని చేస్తుంది. ఈ వ్యాక్సిన్‌తో న్యుమోనియాకు 60 నుంచి 70% మేరకు చెక్ పెట్టవచ్చు.

షింగ్రిక్స్- రూ.10 వేలు

పెద్దలకు చికెన్ పాక్స్ సోకినప్పుడు, నరాల పనితీరును దెబ్బ తిని బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీసే ప్రమాదం ఉంటుంది. కాబట్టి పెద్దలు ముందస్తుగానే షింగ్రిక్స్ వ్యాక్సిన్ తీసుకోవాలి. పెద్ద వయసులో వచ్చే చికెన్‌పాక్స్‌తో నరాలు దెబ్బతిని భరించలేనంత నొప్పి వేధిస్తుంది. కాబట్టి ఈ వ్యాధి సోకకుండా 50 ఏళ్లు దాటిన వాళ్లు ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలి. ఈ వ్యాక్సిన్‌లో రెండు డోసులుంటాయి. దీంతో పెద్దల్లో వచ్చే తట్టు, పక్షవాతాలను కూడా నివారించుకోవచ్చు.

డిపిటి- రూ.2,500

పదేళ్లకోసారి ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలి. డిఫ్తీరియా, టెటనస్‌లను అరికట్టడానికి ఈ వ్యాక్సిన్ తోడ్పడుతుంది. 50 ఏళ్లు పైబడిన వాళ్లు ఎవరైనా ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చు.



డాక్టర్ విజయ్‌కుమార్ చెన్నంశెట్టి
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్.

సెల్ఫ్ కేర్



గోళ్ల గోడు..!

కంటికి కనిపించని రుగ్మతలు గోళ్లలో ప్రతిబింబిస్తాయి. కాబట్టి వాటిలో చోటుచేసుకునే తేడాలను గమనిస్తూ, వాటిని బట్టి వైద్యులను కలుస్తూ ఉండాలి.

తెల్ల పట్టీలు: 'మోర్క్స్ నెయిల్స్' అనే స్థితిలో గోళ్ల మీద అడ్డంగా రెండు తెల్లని పట్టీలు ఏర్పడతాయి. ఇవి కేన్సర్ చికిత్సలో ఇచ్చే కీమోథెరపీ వల్ల ఏర్పడవచ్చు, లేదా కాలేయ వ్యాధి, మూత్రపిండాల వ్యాధుల వల్ల కూడా తలెత్తవచ్చు.

గోరు కిందకి వంగిపోవడం: 'నెయిల్ క్లబ్బింగ్' అనే ఈ స్థితిలో సాధారణంగా చివర్లో కొద్దిగా పైపైకి తిరగాల్సిన గోళ్లు, కింది వైపుకు వంగి ఉంటాయి. కాలేయ వ్యాధులు, హృద్రోగాలు, ఊపిరితిత్తుల వ్యాధులు, ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ సిండ్రోమ్, హెచ్ఐవి ఇన్‌ఫెక్షన్ ఉన్నప్పుడు గోళ్లు ఇలా వంగిపోయే అవకాశం ఉంటుంది.

ఎర్ర గీతలు: 'బ్యూస్ లైన్స్' అనే ఈ గీతలు గోళ్లకు గాయమైనా, కీమోథెరపీ తీసుకుంటున్నా, విపరీతమైన జ్వరం వచ్చినా, మధుమేహం, పెరిఫెరల్ వ్యాస్క్యులర్ డిసీజ్ వచ్చినా, జింక్ లోపమున్నా కనిపిస్తాయి.

స్పూన్ నెయిల్స్: 'కాయిలోనైఖియా' అనే ఈ సమస్యలో గోళ్లు పలచగా, చదునుగా ఉంటాయి. కొంతమందిలో గోరు మధ్యలో లోపలికి వంగిపోయి ఉంటాయి. ఈ సమస్య విపరీతమైన ఐరన్ లోపం, పదేపదే పేలుడు, ట్రామాకు గురవడం వల్ల తలెత్తుతుంది.

తెల్ల గోళ్లు: 'టెర్రీస్ నెయిల్స్' అనే ఈ సమస్యలో గోళ్లు తెల్లగా, అంచుల్లో ముదురు రంగు పట్టీలు ఏర్పడతాయి. కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్, మధుమేహం, హెచ్ఐవి ఇన్‌ఫెక్షన్లలో గోళ్లు ఇలా మారే వీలుంది.

అవేర్‌నెస్

కాళ్ల మీద కొత్తగా పుండ్లు తలెత్తితే, వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. అవి వెరికోజ్ వెయిన్ సమస్య మూలంగా ఏర్పడిన పుండ్లు అయి ఉండవచ్చు. అలాంటప్పుడు, మూల కారణాన్ని చికిత్సతో సరిదిద్దుకోవాలి.



ఆ పుండ్ల పట్ల నిర్లక్ష్యం వద్దు

వెరికోజ్ వెయిన్స్ సమస్య మందులతో తగ్గదు. కాళ్ల మీద వచ్చిన నలుపును ఎటువంటి ఆయింట్‌మెంట్లు, నూనెలూ తగ్గించలేవు. ఇలా చేయకూడదు కూడా! వెరికోజ్ వెయిన్స్‌ను తగ్గించాలంటే 'కన్జర్వేటివ్ లేదా సర్జికల్' పద్ధతులనే అవలంబించాలి. కన్జర్వేటివ్ మెథడ్‌లో వెరికోజ్ వెయిన్స్ సమస్య తీవ్రం కాకుండా, కొన్నాళ్లపాటు సాక్స్ వేసుకోవచ్చు. సాక్స్‌కు బదులుగా చేతికందిన గుడ్డలు కట్టేయకూడదు. సాక్స్ పద్ధతి కూడా ప్రారంభదశలో ఉన్న వెరికోజ్ వెయిన్స్‌కే పని చేస్తుంది. సాక్స్ కొంతవరకూ సమస్యను కంట్రోల్ చేస్తుంది కానీ నయం చేయదు. ఎప్పుడు సాక్స్ వేయడం మానేస్తే అప్పుడు తిరిగి వెరికోజ్ వెయిన్స్ ఉబ్బడం మొదలు పెడతాయి. కాబట్టి శాశ్వతంగా ఈ సమస్య తొలగించుకోవాలంటే లేజర్ సర్జరీని ఆశ్రయించాలి. పాత రోజుల్లో ఉబ్బిన సిరలను కత్తిరించి తీసేసేవాళ్లు. దీని ఫలితం 60 శాతమే! ఈ సర్జరీలో మత్తు ఇచ్చి, కోసి, సిరలను తీసేస్తారు. కాబట్టి కుట్లు పడతాయి. ఎక్కువ రోజులు ఆస్పత్రిలో ఉండాలి. కోలుకోవడానికి కూడా ఎక్కువ సమయం పడుతుంది. ఈ సర్జరీకి ప్రత్యామ్నాయంగా లేజర్ సర్జరీ అందుబాటులోకొచ్చింది. దీన్లో వెరికోజ్ వెయిన్స్‌ను నిర్ధారించుకోవడం కోసం వాడే స్కానింగ్ మిషన్‌ను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి, ఏ సిరలు పని చేయట్లేదో వాటిలోకి లేజర్ ఫైబర్‌ను పంపిస్తారు. ఆ సన్నని ఫైబర్ ద్వారా చిన్న జల్లెడను పంపించి, కవాటాలు తిరిగి మూసుపోకుండా నియంత్రిస్తారు. 15 నిమిషాలు పట్టే ఈ సర్జరీ తర్వాత గంటకే ఇంటికెళ్లిపోవచ్చు. మరుసటి రోజు నుంచే పనులన్నీ చేసుకోవచ్చు.

కాళ్ల మీద పుండ్లు

మధుమేహంతో సంబంధం లేని 'నాన్ డయాబెటిక్ అల్సర్లు' వెరికోజ్ వెయిన్స్ వల్లే ఏర్పడతాయి. ఈ సమస్యను పుండుగానే చూస్తారే తప్ప అది ఏర్పడడానికి కారణం గురించి ఆలోచించరు. చర్మం రంగు మారితే చర్మ వైద్యులను కలిసి, పైపూతలు, ఆయింట్‌మెంట్లు పూయడం చేస్తుంటారు. పుండు పడితే యాంటిబయాటిక్ క్రీమ్‌లు వాడుతూ ఉంటారు. ఇలా వెరికోజ్ వెయిన్స్ వల్ల ఏర్పడిన పుండ్లు నిర్లక్ష్యానికి గురై మరీ పెద్దవైతే పూర్తిగా కాలే తొలగించాల్సిన దుస్థితికీ దారితీయొచ్చు. కాబట్టి అకారణంగా కాళ్ల మీద పుండ్లు ఏర్పడితే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

గర్భిణుల్లో...

30 నుంచి 50 ఏళ్ల లోపు మహిళల్లో వెరికోజ్ వెయిన్స్ సమస్య మొదలవ్వొచ్చు. మరీ ముఖ్యంగా గర్భిణుల్లో ఈ ఇబ్బంది తలెత్తే అవకాశాలు ఎక్కువ. గర్భంతో ఉన్నప్పుడు పెరిగిన శరీర బరువు వల్ల కాళ్లలోని సిరల మీద ఒత్తిడి పడుతుంది. దాంతో వెరికోజ్ వెయిన్స్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. మరీ ముఖ్యంగా తల్లితండ్రుల్లో ఎవరికైనా వెరికోజ్ వెయిన్స్ ఉంటే గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలి. గర్భంతో ఉన్నా వైద్యుల సూచనల మేరకు పిక్కల కదలికలు పెంచే వ్యాయామాలు క్రమం తప్పకుండా చేయాలి. కొందరు గర్భిణుల్లో గర్భంతో ఉన్నప్పుడు కనిపించే వెరికోజ్ వెయిన్స్ ప్రసవం తర్వాత తగ్గిపోవచ్చు. ఇంకొందరికి ప్రసవం తర్వాత కూడా కొనసాగవచ్చు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
మంగళవారం • 9 జనవరి 2024
cinema@andhrajyothy.com

తాట తీస్తా..



'నేను కష్టపడి ఈ స్థాయికి వచ్చాననేమో.. ప్రతి ఏడాది సంక్రాంతి వస్తే చాలు.. ఏదో ఒక వివాదాన్ని లేవనెత్తుతూ నాపై ట్రోల్స్ చేయడం కొన్ని వెబ్‌సైట్స్‌కి పరిపాటైపోయింది. ఏడెనిమిదేళ్ల నుంచి ఇదే తంతు. నిన్నటి 'హను-మాన్' ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో చిరంజీగారు ఈ థియేటర్ల వ్యవహారంపై ఎంతో పాజిటీవ్‌గా మాట్లాడారు. 'సమస్యను ఎలా పరిష్కరించాలో దిల్ రాజుకి తెలుసు.. ఈ విషయాల్లో తనకు అనుభవం ఉంది' అంటూ నా గురించి కూడా గౌరవంగా స్పందించారు. ఆ మాటల్ని వేరే విధంగా మార్చి రెండు ప్రముఖ వెబ్‌సైట్లు పిచ్చి రాతాలు రాశాయ్. మీ వెబ్‌సైట్ రేటింగ్ పెంచుకోవటానికి వేరే వాళ్లను ఎందుకు బలి చేస్తున్నారు? అంటే దిల్ రాజు ఏం రియాక్టవ్వడు, సర్దుకుని పోతాడు అనుకుంటున్నారా? తాట తీస్తా..' అంటూ ప్రముఖ నిర్మాత దిల్ రాజు హెచ్చరిక జారీ చేశారు. తన గురించి అవాస్తవాలు రాశారంటూ.. రెండు వెబ్‌సైట్లపై(ఆంధ్రజ్యోతి కాదు) దిల్‌రాజు ఘాటైన వ్యాఖ్యలు చేశారు. వెన్నెల కిశోర్, అనన్య నాగళ్ల జంటగా రూపొందుతోన్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్స్'. రచయిత గోపీ మోహన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వి.రమణారెడ్డి నిర్మాత. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని సోమవారం హైదరాబాద్‌లో దిల్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిల్ రాజు మాట్లాడారు. 'చాలా రోజులుగా ఓపికపడుతూ వచ్చాను. నా వల్ల ఇబ్బంది పడుతున్నట్టు ఏ ప్రొడ్యూసరైనా మీకు చెప్పాడా? దమ్ముంటే ఆ ప్రొడ్యూసర్‌నీ నన్నూ ఒక వేదికపై కూర్చోబెట్టి ప్రశ్నించండి. వ్యాపారపరంగా వచ్చే సమస్యల్ని అడ్వాంటేజ్‌గా తీసుకొని నన్ను బ్లేమ్ చేయడానికి వెబ్‌సైట్లనీ, యూట్యూబ్ ఛానల్స్‌ని కొందరు వాడుకుంటున్నారు. సంక్రాంతి రిలీజ్‌ల గురించి ఛాంబర్‌లో మీటింగ్ పెట్టాం. థియేటర్ల కొరత రాకూడదని నిర్మాతను రిక్వెస్ట్ చేసి రవితేజగారి సినిమాను సంక్రాంతి నుంచి పక్కకు జరిపాం. ఇది ఎంత కష్టమైన పనో తెలుసా?.. ఇంకోడెవడో రాశాడు. 'దిల్ రాజు తమిళ సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నాడు' అని. ఎవడు చెప్పాడ్రా.. నేను రిలీజ్ చేస్తున్నానని? నీ దగ్గర రుజువు ఉందా? ఆ తమిళ సినిమా రిలీజ్‌ను వాయిదా వేయించిందే నేను. విషయం తెలియకుండా అబద్ధాలు ఎందుకు రాస్తారు? మళ్లీ చెబుతున్నా.. తేలిగ్గా తీసుకోకండి.. ఇక నుంచి నా గురించి అబద్ధాలు రాసి, కాంట్రవర్సీలు క్రియేట్ చేస్తే ఊరుకోను, తాటతీస్తా..' అంటూ ఉద్వేగంగా స్పందించారు దిల్‌రాజు.

కత్తులూ, నెత్తురే ఎక్కువ చూసి ఉండాది



'ఈ సముద్రం చేపలకంటే కత్తులూ, నెత్తురే ఎక్కువ చూసి ఉండాది. అందుకే దీన్ని ఎర్రసముద్రం అంటారు' అంటున్నారు ఎన్టీఆర్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 'దేవర' చిత్రంలోనిదీ డైలాగ్. కొరటాల శివ దర్శకుడు. సోమవారం చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. రోమాంచిత పోరాట ఘట్టాలు, పతాక స్థాయి భావోద్వేగాలతో గ్లింప్స్ ఆద్యంతం అలరించింది. ఆగ్రహం నిండిన కళ్లతో ఎన్టీఆర్ పవర్‌ఫుల్‌గా కనిపించారు. సముద్రపు దొంగలు నౌకలను దోచుకోవడం, వారిని ఎన్టీఆర్ ఊచకోత కోసే సన్నివేశాలతో యాక్షన్ హంగామా కనిపించింది. అనిరుధ్ రవిచంద్రన్ ఇచ్చిన నేపథ్య సంగీతం ఆకట్టుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ 5న 'దేవర' చిత్రం తొలిభాగం విడుదలవుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, మురళీశర్మ కీలకపాత్రల్లో నటిస్తున్నారు.

'నా సామిరంగ' మరో 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' అవుతుంది



కీరవాణి

'నాగార్జునకు సరిగ్గా సరిపోయే టైటిల్ 'నా సామి రంగ'. 32ఏళ్ల క్రితం నాగార్జునతో నేను చేసిన 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' ఎంతటి విజయాన్ని సాధించిందో.. సంక్రాంతికి రానున్న 'నా సామిరంగ' కూడా అంతటి విజయాన్ని సాధిస్తుందని నా నమ్మకం. 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' పల్లెటూరి నేపథ్యంతో కూడిన వినోదాత్మక చిత్రం. 'నా సామిరంగ' కూడా సేమ్ టు సేమ్. కాబట్టి ఇది మరో 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' అవుతుందని ఆశిస్తున్నా.' అని ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి అన్నారు. అక్కినేని నాగార్జున హీరోగా విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మించిన చిత్రం 'నా సామి రంగ'. కీరవాణి స్వరాలందించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా కీరవాణి విలేకరులతో మాట్లాడారు. 'రీరికార్డింగ్ సమయంలో ఓ సందర్భం పాట రాయాలనే ఆలోచనకు దోహదం చేసింది. దాంతో ఇందులో ఓ పాట రాశాను. ఈ సినిమాలో సంగీతం స్వచ్ఛంగా ఉంటుంది. క్వాలిటీ తగ్గకుండా వేగంగా సినిమా తీయగలగడం దర్శకుడు విజయ్ బిన్నీ ప్రత్యేకత. అతను స్వతహాగా డాన్స్ మాస్టర్. కాబట్టి డాన్స్‌ను దృష్టిలో పెట్టుకొని ట్యూన్స్ తీసుకుంటాడనుకున్నాను. కానీ అద్భుతమైన మూడు మెలొడీస్‌ని నా నుంచి తీసుకున్నాడు. దర్శకుడిగా అతనిలోని పరిపక్వత నాకప్పుడు అర్థమైంది' అని కీరవాణి అన్నారు. ఇటీవలి సినిమాల్లో జైలర్, యానిమల్ చిత్రాల సంగీతం బావుందని ఆయన చెప్పారు. 'హరిహరవీరమల్లు' సినిమాకు సంబంధించిన మూడు పాటల రీకార్డింగ్ పూర్తయిందని, అలాగే, చిరంజీవి 'విశ్వంభర' మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా మొదలయ్యాయని అన్నారు. రాజమౌళి సినిమాకు సంబంధించిన మ్యూజిక్ పనులు ఇంకా మొదలవ్వలేదని కీరవాణి తెలిపారు.

ఉపేంద్ర ఫాంటసీ ప్రపంచం



కన్నడ నటుడు ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'యు ఐ ది మూవీ'. కె.పి. శ్రీకాంత్‌తో కలిసి లహరి ఫిల్మ్స్, జి.మనోహరన్ అండ్ వీనస్ ఎంటర్‌టైనర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమా ఫస్ట్ లుక్ టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. అల్లు అరవింద్ అతిథిగా విచ్చేశారు. ప్రేక్షకులను ఫాంటసీ ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ సినిమా ఉంటుందని, 90శాతం వీఎఫ్ఎక్స్‌తో ఉపేంద్ర ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించారని నిర్మాతలు చెబుతున్నారు. 'ఎటు చూసినా చీకటి. దాన్నుంచి తప్పించుకోవడం ఎలా?' అంటూ ఉపేంద్ర వాయిస్‌తో టీజర్ మొదలైంది. చివరిగా ఎద్దుపై ఉపేంద్ర వీరోచితమైన ఎంట్రీ, సినిమాలోని ఆయన పాత్రకు అద్దం పట్టేలా ఉంది. రీష్మా నానయ్య, నిధి సుబ్బయ్య, మురళీశర్మ, పి.శివశంకర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీశ్ బి.లోక్‌నాథ్, కెమెరా: హెచ్‌సీ వేణుగోపాల్.


ఫైటర్ ప్రణయ గీతం



బాలీవుడ్ హీరో హృతిక్‌రోషన్, దీపికా పదుకొనే జంటగా నటిస్తున్న చిత్రం 'ఫైటర్'. 'వార్, పఠాన్' చిత్రాలతో ఘన విజయాలను అందుకున్న సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. జనవరి 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సోమవారం ఈ చిత్రం నుంచి 'హీర్ ఆస్మానీ' గీతాన్ని విడుదల చేశారు. ఈ రొమాంటిక్ గీతంలో హృతిక్‌రోషన్, దీపికా పదుకొనే సరికొత్త స్టైప్పులతో అలరించారు. ఈ చిత్రంలో హృతిక్ ఎయిర్‌ఫోర్స్ పైలెట్‌గా కనిపించనున్నారు. వయాకామ్ 18 స్టూడియోస్, మార్ ఫ్లిక్ పిక్చర్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. అనిల్ కపూర్ కీలకపాత్ర పోషిస్తున్నారు.

యానిమల్ లాంటి సినిమాలు సమాజానికి ప్రమాదకరం

జావెద్ అక్తర్



సందీప్‌రెడ్డి వంగా లేటెస్ట్ బ్లాక్‌బాస్టర్ 'యానిమల్' నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. అలాగే.. గత ఏడాది అత్యంత చర్చనీయాంశమైన సినిమాగా 'యానిమల్' నిలిచింది. ఈ సినిమా గురించి ప్రముఖ రచయిత జావెద్ అక్తర్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన అజంతా ఎల్లోరా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివెల్‌కి హాజరైన ఆయన సభను ఉద్దేశించి మాట్లాడుతూ "యానిమల్' లాంటి సినిమా విజయాన్ని సాధించడం సమాజానికి ప్రమాదకరం. ఓ విధంగా ఆ సినిమా తీసిన వాళ్లే కాదు, చూసినవాళ్లూ దోషులే. సినిమా చాలా శక్తిమంతమైంది. సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి సినిమాకుంది. ఇలాంటి సినిమాల వల్ల సమాజంలో నైతికత లోపిస్తే.. అందుకు చూసిన ప్రేక్షకులు కూడా బాధ్యులే అవుతారు. ఓ స్త్రీని ఓ పురుషుడు తన షూ నాకమనడం. స్త్రీ అని కూడా చూడకుండా చెంప ఛెళ్లుమనిపించడం.. ఇలాంటి సన్నివేశాలున్న సినిమా బాక్సాఫీస్ దగ్గర విజయం సాధించిందంటే చూస్తున్న ప్రేక్షకుల మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు అక్తర్. ఇంకా మాట్లాడుతూ 'జనంలో ఈ జాడ్యం నేటిది కాదు. ఏనాటిదో.. ముప్పైఏళ్ల క్రితమే 'చోలీకే పీచే క్యాహై..' అంటూ సాగే పాటను విపరీతంగా ఆదరించారు. సృజనాత్మకరంగంలో ఎలాంటి వాటిని ఆదరించాలి.. ఎలాంటివాటిని తిప్పికొట్టాలి అనే విషయాలపై ప్రేక్షకులు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అన్నారు జావెద్ అక్తర్. ఇదిలావుంటే సందీప్‌రెడ్డి వంగ దర్శకత్వంలో రణబీర్‌కపూర్ హీరోగా నటించిన 'యానిమల్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 896కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్లను రాబట్టింది.

రిలీజ్‌కు రెడీగా తిరగబడరా సామి



రాజ్‌తరుణ్ హీరోగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తిరగబడరా సామి'. మాల్వీ మల్హోత్రా కథానాయిక. మల్కాపురం శివకుమార్ నిర్మాత. ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు యూనిట్ తెలిపింది. సెంటిమెంట్, రొమాన్స్, యాక్షన్ అంశాలతో రూపొందించామనీ, ఫిబ్రవరి మొదటి వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామనీ మేకర్స్ తెలిపారు. మకరంద్ దేశ్‌పాండే, జాన్ విజయ్, రఘు బాబు కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి జెబి సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: జవహర్‌రెడ్డి ఎంఎన్.

రవితేజ చేతుల మీదుగా లవ్ మౌళి గీతమాలిక



నవదీప్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వంలో సీ స్పేస్ సంస్థ నిర్మిస్తోంది. రవితేజ చేతులు మీదుగా ఈ చిత్రంలోని పాటలను యూనిట్ విడుదల చేసింది. 'నా ఆలోచనా విధానానికి, నేను చేయాలనుకుంటున్న సినిమాలకు 'లవ్ మౌళి' దగ్గరగా అనిపించింది. అందుకే ఈ చిత్రంతో మీ ముందుకు వస్తున్నాను' అని నవదీప్ చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: గోవింద్ వసంత.

ఈతరం శ్రీరంగ నీతులు



రుహానీ శర్మ, విరాజ్ అశ్విన్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'శ్రీరంగ నీతులు'. ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకుడు. వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మాత. 'శ్రీరంగ నీతులు' టీజర్‌ను విడుదల చేసి చిత్రబృందం ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఈ తరం యువత ఆలోచనలు, భావోద్వేగాల ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రమిద'న్నారు. కుటుంబ అనుబంధాలు, వినోదం.. ఇలా అన్ని అంశాలతో ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా ఉంటుందని నిర్మాత చెప్పారు. సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్. సినిమాటోగ్రఫీ: టీజో టామీ

గురు శిష్యుల కాంబినేషన్‌లో



సుకుమార్ శిష్యుడు యశస్వి వీ దర్శకుడిగా కొత్త చిత్రం ఖరారైంది. సుకుమార్ సొంత నిర్మాణ సంస్థ 'సుకుమార్ రైటింగ్స్'లో ఈ చిత్రం తెరకెక్కనుంది. దీపక్ సరోజ్ కథానాయకుడిగా యశస్వి దర్శకత్వం వహించిన 'సిద్ధార్థ్‌రాయ్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఆ చిత్రం సుకుమార్‌కు బాగా నచ్చడంతో యశస్వికి తన బేనర్‌లో సినిమా చేసే అవకాశం ఇచ్చారని నిర్మాణ సంస్థ తెలిపింది. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని యూనిట్ పేర్కొంది.

కరెంట్ షాక్‌తో యష్ అభిమానుల కన్నుమూత

కన్నడ హీరో యష్ పుట్టిన రోజు వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకొంది. సోమవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా కర్ణాటకలోని గదగ్ జిల్లా లక్ష్మేశ్వర తాలూకా సూరణగి గ్రామంలో ఘనంగా వేడుకను నిర్వహించేందుకు అభిమానులు సిద్ధమయ్యారు. ఫ్లెక్సీని సిద్ధం చేసి, దాన్ని నిలబెట్టి కట్టే ప్రయత్నం చేస్తుండగా ఇనుప కడ్డీలకు విద్యుత్ తీగలు తగలడంతో హనుమంత హరిజన(21), మురళి నడవినమని(20), నవీన్‌గాజి (19) మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

దర్శకుడు కే జయదేవ్ కన్నుమూత



సీనియర్ జర్నలిస్ట్, సినీ దర్శకుడు కే జయదేవ్ కన్నుమూశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య యశోద, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జయదేవ్ దర్శకత్వం వహించిన 'కోరంగి నుంచి' చిత్రం పలు జాతీయ, అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. భారతరత్న సీఎన్ఆర్ రావుపై ఫిల్మ్స్ డివిజన్‌కు ఆయన డాక్యుమెంటరీ నిర్మించారు. ప్రముఖ దర్శకుడు, జర్నలిస్ట్ కెఎన్‌టి శాస్త్రికి జయదేవ్ చిన్న కుమారుడు.

ఓపెన్‌హైమర్‌కు గోల్డెన్‌గ్లోబ్ పురస్కారాలు



హాలీవుడ్ చిత్రం 'ఓపెన్ హైమర్' గోల్డెన్‌గ్లోబ్ అవార్డుల్లో మెరిసింది. పలు విభాగాల్లో పురస్కారాలను గెలుచుకొని సత్తా చాటింది. 81వ గోల్డెన్ గ్లోబ్ వేడుకలు అమెరికాలోని బేవర్లీహిల్స్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. ఓపెన్‌హైమర్ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఇదే చిత్రానికిగాను ఉత్తమ దర్శకుడిగా క్రిస్టోఫర్ నోలన్, ఉత్తమనటుడిగా సిలియన్ మర్ఫీ, ఉత్తమ సహాయ నటుడిగా రాబర్ట్ డౌనీ జూనియర్ అవార్డులు గెలుచుకోగా ఉత్తమ ఒరిజినల్ స్కోర్ విభాగంలో లుడ్విగ్ గోరాన్సన్ పురస్కారం అందుకున్నారు. బార్బీ చిత్రానికి ఉత్తమ ఒరిజినల్ సాంగ్, బాక్సాఫీస్ ఎచీవ్‌మెంట్ అవార్డు దక్కాయి.

వహ్వా.. ఇషా

ఒలింపిక్ బెర్త్ ఖరారు



వరుణ్ తోమర్ కూడా..

తొలిరోజు భారత్‌కు 4 స్వర్ణాలు

ఆసియా షూటింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్

జకార్తా: పారిస్ ఒలింపిక్స్ షూటింగ్‌లో భారత్ మరో రెండు బెర్త్‌లు దక్కించుకుంది. సోమవారం ఇక్కడ ప్రారంభమైన ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో తెలంగాణ యువ షూటర్ ఇషాసింగ్, వరుణ్ తోమర్ మహిళలు, పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్ విభాగాల్లో ఈ బెర్త్‌లు అందించారు. ఇషా 243.1 పాయింట్ల స్కోరుతో స్వర్ణ పతకం కొల్లగొట్టింది. పాకిస్థాన్‌కు చెందిన కిష్మాలా తలత్ రజతం, ఇషా సహచరి రిథమ్ సాంగ్వాన్ కాంస్యం దక్కించుకున్నారు. అనంతరం ఇషా, రిథమ్, సురభి రావ్‌తో కూడిన భారత జట్టు 1736 పాయింట్లతో స్వర్ణం చేజిక్కించుకుంది. ఇక యూపీకి చెందిన 20 ఏళ్ల తోమర్ 239.6 పాయింట్లు స్కోరు చేయడం ద్వారా పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. అర్జున్ చీమా రజతం నెగ్గాడు. అంతకుముందు 10 మీ. ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో తోమర్, చీమా, ఉజ్వల్ మాలిక్ త్రయం 1740 పాయింట్లతో పసిడి పతకం నెగ్గింది. ఈ రెండింటితో కలిపి..విశ్వక్రీడల షూటింగ్‌లో భారత్‌కు ఇప్పటివరకు మొత్తం 15 స్థానాలు ఖరారయ్యాయి. ఇక.. ఆసియా క్వాలిఫయర్స్ తొలిరోజు వ్యక్తిగత కేటగిరిలో రెండు, టీమ్ విభాగంలో లభించిన మరో రెండు స్వర్ణాలు సహా.. భారత్ మొత్తం ఆరు పతకాలను సొంతం చేసుకుంది.

జర్మన్ సాకర్ దిగ్గజం బెకన్‌బావర్ అస్తమయం





మ్యూనిచ్: జర్మనీ దిగ్గజ ఫుట్‌బాలర్ ఫ్రాంజ్ బెకన్‌బావర్ (78) కన్నుమూశాడు. 'ఆదివారం ఆయన నిద్రలోనే ప్రశాంతంగా మరణించారు' అని ఫ్రాంజ్ కుటుంబం సోమవారం వెల్లడించింది. అయితే ఆయన మృతికి కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. ప్రపంచ సాకర్ 'ఆల్ టైమ్ గ్రేట్'లో ఒకడైన బెకన్‌బావర్ కెప్టెన్, మేనేజర్‌గా రెండుసార్లు జర్మనీ జట్టుకు ప్రతిష్ఠాత్మక ఫిఫా కప్‌ను అందించాడు. అతడి సారథ్యంలో జర్మనీ జట్టు 1974లో విశ్వవిజేతగా నిలిచింది. అలాగే ఫ్రాంజ్ మేనేజర్‌గా తిరిగి 1990లో రెండోసారి ఫిఫా కప్ సొంతం చేసుకుంది. అందుకే బెకన్‌బావర్ నాయకత్వ లక్షణాలకు చిహ్నంగా అతడిని 'డెర్ కైజర్' అని పిలుస్తారు. జర్మన్ భాషలో కైజర్ అంటే చక్రవర్తి అని అర్థం. వరల్డ్ ఫుట్‌బాల్‌లో ఆటగాడిగా, మేనేజర్‌గా ఫిఫా కప్ అందుకున్న త్రయంలో ఒకడు బెకన్‌బావర్. మిగిలిన ఇద్దరు బ్రెజిల్‌కు చెందిన మారియో జగాలో, ఫ్రాన్స్ ఆటగాడు డిడెర్ డిషాంప్. 1945లో జన్మించిన ఫ్రాంజ్.. మిడ్‌ఫీల్డర్‌గా 103 మ్యాచ్‌ల్లో జర్మనీకి ప్రాతినిథ్యం వహించాడు. 1974-76 మధ్య బేయర్న్ మ్యూనిచ్‌కు వరుసగా మూడుసార్లు యూరోపియన్ కప్ అందించాడు. ఫ్రాంజ్ రెండుసార్లు 'బాలెన్ డి ఓర్' అవార్డులు అందుకున్నాడు.

అదితి తల్లిదండ్రుల 'సూట్' కష్టాలు



న్యూఢిల్లీ: క్రీడా అవార్డుల ప్రదానోత్సవం కోసం ఇక్కడకు వచ్చిన యువ ఆర్చర్ అదితి గోపీచంద్ తల్లిదండ్రులు వణికిస్తున్న చలిలో ఢిల్లీ వీధుల్లో 'సూట్' కొనుక్కునే పనిలో పడ్డారు. రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం జరిగే కార్యక్రమంలో ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అదితి అర్జున అవార్డును అందుకోనుంది. దీన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు మహారాష్ట్రలోని సతార నుంచి ఆమె తల్లిదండ్రులు గోపీచంద్, షైలా స్వామి వచ్చారు. అయితే, అవార్డుల కార్యక్రమానికి హాజరుకావాలంటే ప్రత్యేక డ్రెస్ కోడ్ పాటించాలని ఢిల్లీ వచ్చాకే వారికి తెలిసిందట. దీంతో తగిన దుస్తుల కోసం ఢిల్లీలోని పాలికా బజార్‌లో షాపింగ్ చేస్తున్నట్టు తెలిపాడు. అదితి తండ్రి ఓ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

అమెరికాలో మన మారథాన్ వీరుడు నవీన్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అమెరికాలో స్థిరపడిన తెలుగు అథ్లెట్ అప్పలనేని నవీన్‌కు పరుగే ఊపిరి. 2015లో మారథాన్లలో పాల్గొనడం ప్రారంభించిన ఈ వెటరన్ అథ్లెట్ ఇప్పటికి 58 మారథాన్ పోటీలను విజయవంతంగా పూర్తి చేయడం విశేషం. నవీన్ స్వస్థలం ప్రకాశం జిల్లా అన్నంభొట్లవారిపాలెం. అమెరికాలోని నార్త్ కరోలినాలో స్థిరపడిన నవీన్ 2015లో 'చార్లెట్ రన్'తో తన మారథాన్ ప్రస్థానాన్ని ప్రారంభించాడు. అమెరికాలోని 50 రాష్ట్రాల్లో 50 మారథాన్‌లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ తెలుగుతేజం ఎనిమిదేళ్ల వ్యవధిలోనే తన లక్ష్యాన్ని చేరుకున్నాడు. ప్రతి 3-4 నెలలకు ఒక మారథాన్‌ను పూర్తి చేసే నవీన్, 2021లో జూన్‌లో వరసగా మూడ్రోజుల్లో మూడు మారథాన్లను పూర్తి చేసి, ఔరా అనిపించాడు. జూన్ 10న ఇదహో, 11న వ్యోమింగ్, 12న ఉటాహ్ మారథాన్లను దిగ్విజయంగా పూర్తి చేశాడు. మారథాన్లు కాకుండా దాదాపుగా 100కి పైగా పరుగు పోటీల్లోనూ పాల్గొన్నాడు. ఇందులో హాఫ్ మారథాన్లతో పాటు 10కే, 5కే రన్‌లు ఉన్నాయి. నవీన్ అనేక మంది ఔత్సాహిక రన్నర్లకు కూడా శిక్షణ ఇస్తున్నాడు. నవీన్ శిష్యుల్లో ఇప్పటివరకు దాదాపు 100 మంది మారథాన్లు, హాఫ్ మారథాన్లు పూర్తి చేశారు. వీరిలో 10 మంది 13 ఏళ్ల లోపు బాలురు హాఫ్ మారథాన్‌ల్లో పతకాలు సాధించారు. కేన్సర్‌తో పోరాడుతున్న తన స్నేహితుడిలో ప్రేరణ కలిగించడానికి ఈ మారథాన్ యజ్ఞానికి శ్రీకారం చుట్టిన నవీన్, అతడు ఆ మహమ్మారి వ్యాధిని జయించడానికి తోడ్పడ్డాడు.

టెస్ట్ క్రికెట్‌కు క్లాసెన్ గుడ్‌బై



ప్రిటోరియా: స్వల్ప కాల తన టెస్ట్ క్రికెట్ కెరీర్‌కు దక్షిణాఫ్రికా కీపర్, బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ సోమవారం వీడ్కోలు పలికాడు. 2019లో రాంచీలో భారత్‌పై సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేసిన 32 ఏళ్ల క్లాసెన్ కేవలం నాలుగు టెస్ట్‌లే ఆడాడు. గత ఏడాది జొహాన్నెస్‌బర్గ్‌లో వెస్టిండీస్‌తో మ్యాచ్ ఆఖరిది. అయితే తెల్లబంతుల ఫార్మాట్‌కు అందుబాటులో ఉంటానని క్లాసెన్ తెలిపాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు అతడు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

బంగ్లా కెప్టెన్ షకీబ్ ఇక పార్లమెంట్ సభ్యుడు



ఢాకా: బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు కెప్టెన్ షకీబ్ అల్ హసన్ దేశ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఆదివారం జరిగిన సాధారణ ఎన్నికల్లో..ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ తరఫున మగురా నియోజకవర్గం నుంచి షకీబ్ పోటీ చేశాడు. 1.79 లక్షల భారీ మెజార్టీతో విజయం సాధించాడు. పార్లమెంట్‌కు ఎన్నికైనా..క్రికెట్‌లో కొనసాగుతానని 36 ఏళ్ల షకీబ్ స్పష్టంజేశాడు.

'తొలి' సిరీస్ దక్కేనా?



ఒత్తిడిలో భారత్

నేడు ఆసీస్‌తో ఆఖరి టీ20

రాత్రి 7.00 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో..

ముంబై: స్వదేశంలో ఆస్ట్రేలియాపై తొలి టీ20 సిరీస్ కోసం భారత మహిళల జట్టు ఉవ్విళ్లూరుతోంది. ఆదివారంనాటి రెండో మ్యాచ్‌లోనే ఈ ఘనత సాధిస్తారని అభిమానులు భావించినా.. అన్ని విభాగాల్లోనూ విఫలమై హర్మన్‌ప్రీత్ సేన నిరాశ పరిచింది. మంగళవారం ఇరు జట్ల మధ్య నిర్ణాయక మూడో టీ20 జరుగనుంది. ఈ సువర్ణావకాశాన్ని చేజారనీయకుండా చక్కటి ఫలితంతో సిరీస్‌ను ముగించాలన్న ఆలోచనలో భారత్ ఉంది. అటు ఆసీస్ మాత్రం ఎప్పటిమాదిరే తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న పట్టుదలతో బరిలోకి దిగుతోంది. మొత్తంగా ఆసీస్ మహిళా జట్టుతో జరిగిన ఐదు ద్వైపాక్షిక సిరీస్‌ల్లో భారత్ 2015-16లో మాత్రమే (ఆసీస్ గడ్డపై) సిరీస్ నెగ్గింది. ఆ జట్టు భారత పర్యటనకు రావడం ఇది మూడోసారి.

బ్యాటర్లపైనే భారం: ఓపెనర్లు షఫాలీ, మంధాన దూకుడుతో తొలి టీ20లో తొమ్మిది వికెట్లతో నెగ్గినా.. రెండో మ్యాచ్‌లో మాత్రం బ్యాటింగ్ ఆర్డర్ ఆకట్టుకోలేకపోయింది. బౌలర్లు కాస్త ప్రయత్నించినప్పటికీ స్వల్ప ఛేదనే కావడంతో ఆసీస్‌పై ఒత్తిడి లేకుండా పోయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ పేలవ ఫామ్‌తో నిరాశపరుస్తోంది. అన్ని ఫార్మాట్లలో కలిపి గత పది మ్యాచ్‌ల్లో ఆమె అర్ధసెంచరీ కూడా చేయలేపోయింది. దాదాపుగా సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతోంది. జెమీమా, రిచా ఎక్కువ సేపు క్రీజులో నిలిస్తే భారీ స్కోరు ఖాయమే. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ మాత్రం రెండు విభాగాల్లోనూ అండగా నిలుస్తోంది. గత రెండు మ్యాచ్‌ల్లోనూ మొదట బ్యాటింగ్ చేసిన జట్లు పరుగుల కోసం ఇబ్బందిపడ్డాయి. దీంతో నేటి మ్యాచ్‌లోనూ టాస్ గెలిచిన జట్టు ఛేజింగ్ వైపే మొగ్గు చూపవచ్చు.

పరాగ్ రికార్డు శతకం



రాయ్‌పూర్: కెప్టెన్ రియాన్ పరాగ్ (87 బంతుల్లో 11 ఫోర్లు, 12 సిక్సర్లతో 155) రంజీల్లో రెండో వేగవంతమైన సెంచరీతో చెలరేగినా.. అసోంకు ఓటమి తప్పలేదు. గ్రూప్-బిలో ఛత్తీస్‌గఢ్ 10 వికెట్లతో అసోంను చిత్తు చేసింది. ఫాలో-ఆన్ ఆడిన అసోం రెండో ఇన్నింగ్స్‌లో 254 పరుగులకు కుప్పకూలింది. 87 పరుగుల లక్ష్యాన్ని ఛత్తీస్‌గఢ్ 20 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఛత్తీస్‌గఢ్ 327, అసోం 159 రన్స్ చేశాయి. ఇక, పరాగ్ రికార్డుస్థాయిలో 56 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకొన్నాడు. 2016లో జార్ఖండ్‌తో రంజీ మ్యాచ్‌లో ఢిల్లీ ఆటగాడు రిషబ్ పంత్ 48 బంతుల్లోనే సెంచరీ చేశాడు.

ఆఖరి లీగ్ మ్యాచ్‌లో యోధాస్ ఓటమి

కటక్: అల్టిమేట్ ఖో-ఖో సీజన్-2లో ఇప్పటికే సెమీస్ చేరిన తెలుగు యోధాస్ జట్టు లీగ్ దశలోని ఆఖరి మ్యాచ్‌లో ఓటమి పాలైంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో యోధాస్ 22-42తో గుజరాత్ జెయింట్స్ చేతిలో ఓడింది. మంగళవారం ఒడిశా-ముంబై, చెన్నై-గుజరాత్ మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లతో లీగ్ దశ పూర్తవనుంది.

బరిలో ప్రణయ్, సేన్, శ్రీకాంత్



నేటినుంచి మలేసియా ఓపెన్

కౌలాలంపూర్: కొత్త సీజన్..పైగా ఒలింపిక్స్‌కు క్వాలిఫై కావాల్సిన తరుణం..ఈ నేపథ్యంలో భారత స్టార్ షట్లర్లు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్ మంగళవారం మొదలయ్యే మలేసియా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం అందుకోవాలని భావిస్తున్నారు. వచ్చే ఏప్రిల్ ఆఖరికి బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్-16లో ఉన్నవారే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. దీంతో తదుపరి 4 నెలలు మన షట్లర్లకు కీలకం కానుంది. మలేసియా ఓపెన్ తొలిరౌండ్లో అండ్రియాస్ ఆంటొన్సెన్‌తో ప్రణయ్, వెంగ్ హంగ్‌తో లక్ష్యసేన్, ఆరోసీడ్ జొనాథన్ క్రిస్టీతో శ్రీకాంత్ తలపడనున్నారు. పురుషుల డబుల్స్‌లో షోహిబుల్/మౌలానా జంటతో రెండో సీడ్ సాత్విక్/చిరాగ్ ద్వయం మొదటిరౌండ్ ఆడనుంది. మోకాలి గాయం కారణంగా పీవీ సింధు ఈ టోర్నీకి దూరంగా ఉంది.

సెలెక్టర్లకు అంత ధైర్యం లేదు



ఆకాశ్ చోప్రా

న్యూఢిల్లీ: అఫ్ఘాన్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్ కోసం రోహిత్, విరాట్‌ల ఎంపికపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా భిన్నంగా స్పందించాడు. ఏడాది కాలం తర్వాత తిరిగి జట్టులోకి వచ్చిన వీరు.. రాబోయే టీ20 వరల్డ్‌కప్‌లోనూ ఆడే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అయితే ఈ ఇద్దరిలో ఎవరో ఒక్కరినే జట్టులోకి ఎంపిక చేసే ధైర్యం ఏ సెలెక్టర్‌కూ లేదని ఆకాశ్ చోప్రా స్పష్టం చేశాడు. ఇద్దరినీ పక్కనబెట్టడమో.. లేదా తీసుకోవడమో చేయాల్సిందేనని చెప్పాడు. మరోవైపు హార్దిక్, సూర్యకుమార్, రుతురాజ్ గాయాలతో బాధపడుతుండడం, శ్రేయాస్‌కు రెస్ట్ ఇవ్వడంతో ఇద్దరు సీనియర్లను జట్టులోకి తీసుకున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు.

అందరూ తాగేవాళ్లే



ప్రవీణ్ కుమార్

న్యూఢిల్లీ: భారత మాజీ పేసర్ ప్రవీణ్ కుమార్ ఆటలోకన్నా మైదానం వెలుపల ప్రవర్తనపై తరచూ వార్తల్లో ఉండేవాడు. అయితే తనపై అకారణంగా తాగుబోతనే నింద పడిందని, గతంలో జట్టులో ఉన్న ఆటగాళ్లందరికీ మద్యం అలవాటు ఉండేదని తేల్చాడు. 2007-2012 మధ్య ప్రవీణ్ భారత జట్టులో కొనసాగాడు. 'నేను టీమిండియాలో ఉన్నప్పుడు మందు తాగొద్దని సీనియర్లు సలహా ఇచ్చేవారు. కానీ ఆ పని అందరూ చేసేవారు. మరోవైపు నేనొక్కడినే తాగుతాననే చెడ్డపేరు వచ్చేలా చేశారు' అని ప్రవీణ్ తెలిపాడు. సచిన్, ద్రవిడ్, గంగూలీలాంటి వారు అలా చెప్పేవారా? అనే ప్రశ్నకు.. 'పేరు చెప్పను కానీ.. ఆ క్రికెటర్ ఎవరో అందరికీ తెలుసు' అని అన్నాడు.

బిజినెస్

'ఎంఎఫ్' ఆస్తులు.. రూ.50 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: గత ఏడాది (2023).. మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)లోకి పెట్టుబడులు వెల్లువెత్తడంతో పరిశ్రమ ఆస్తులు రూ.11 లక్షల కోట్ల మేర పెరిగి రూ.50 లక్షల కోట్ల మార్కును అధిగమించాయి. ఈక్విటీ మార్కెట్లు ఆశావహంగా ఉండడం, ఆర్థిక స్థిరత్వంపై ఏర్పడిన చైతన్యం, శక్తివంతమైన ఆర్థిక వృద్ధి ఇందుకు దోహదపడ్డాయి. తక్కువ వ్యయంతో దీర్ఘకాలిక సంపద సృష్టికి మార్గాలు అందించగల తన సామర్థ్యాన్ని ఎంఎఫ్ పరిశ్రమ నిరూపించుకోగలిగిందని, అదే ఈ విజయానికి కారణమని మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ అసోసియేషన్ (ఏఎంఎఫ్ఐ) తెలిపింది. దేశంలో ఎంఎఫ్‌ల ఆస్తుల విలువ పెరగడం వరుసగా ఇది 11వ సంవత్సరం.

- 2023లో ఎంఎఫ్‌లలోకి రూ.2.74 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ప్రధానంగా సిస్టమాటిక్ పెట్టుబడి ప్లాన్లు (సిప్) రూ.1.84 లక్షల కోట్ల నిధులు ఆకర్షించాయి.
- ఈ నిధుల రాకతో ఎంఎఫ్ పరిశ్రమ వద్ద నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) 27 శాతం పెరిగి రూ.10.9 లక్షల కోట్లు జోడయింది. 2022లో నమోదు చేసిన 5.7 శాతం వృద్ధి, రూ.2.65 లక్షల కోట్ల ఏయూఎంల పెరుగుదల కన్నా ఇది చాలా అధికం.
- ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ 2022లో రూ.39.88 లక్షల కోట్లు కాగా 2023 ముగిసే నాటికి రూ.50.78 లక్షల కోట్లకు పెరిగింది.
- ఎంఎఫ్ సంస్థల ఏయూఎం తొలి రూ.10 లక్షల కోట్ల మైలురాయిని చేరడానికి సుమారు 50 సంవత్సరాలు పట్టగా రూ.40 లక్షల కోట్ల నుంచి రూ.50 లక్షల కోట్లకు చేరడానికి కేవలం ఏడాది పట్టింది.
- సిప్‌ల పట్ల రిటైల్ ఇన్వెస్టర్లు అధికంగా మొగ్గు చూపారు. 2023లో సిప్‌లలోకి రూ.1.84 లక్షల కోట్ల నిధులు వచ్చాయి.
- ఆటుపోట్లు అధికంగా ఉన్న, ప్రతికూల ఆర్థిక వాతావరణంలో బంగారం పెట్టుబడికి చక్కని రక్షణ కల్పిస్తుందని ఇన్వెస్టర్లు భావిస్తారు. ఈ కారణంగా గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి రూ.2,200 కోట్లు వచ్చాయి..

దేశంలో తగ్గిన ఆదాయ అంతరాలు



సరైన బాటలోనే వృద్ధి రేటు: ఎస్‌బీఐ రీసెర్చ్

న్యూఢిల్లీ: దేశంలో ఆదాయ అంతరాలు తగ్గాయని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో వెల్లడించింది. వార్షిక ఆదాయం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఉండే వ్యక్తులు 2013-22 మధ్య కాలంలో ఫైల్ చేసిన ఐటీ రిటర్న్‌ల సంఖ్య 295 శాతం పెరిగిన విషయాన్ని గుర్తు చేసింది. ఇదే సమయంలో రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారు ఫైల్ చేసిన ఐటీ రిటర్న్‌ల సంఖ్యా 291 శాతం పెరిగిందని తెలిపింది. 2021-22 అసెస్‌మెంట్ ఇయర్‌లో ఏడు కోట్ల మంది ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయగా 2023-24 అసెస్‌మెంట్ ఇయర్‌కి ఈ సంఖ్య 8.2 కోట్లకు చేరినట్టు పేర్కొంది. ఆదాయ అంతరాల పరిశీలనకు ప్రామాణికంగా భావించే జినీ కోఎఫీషియెన్సీ ప్రకారం చూసినా ఆదాయ అంతరాలు 2014-22 ఆర్థిక సంవత్సరాల మధ్య అంతరం 0.472 నుంచి 0.403కి తగ్గిన విషయాన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ గుర్తు చేసింది.

సజావుగానే వృద్ధి రేటు

కొవిడ్ తర్వాత భారత ఆర్థిక వృద్ధి రేటు ఇంగ్లీషు అక్షరం 'కే' రూపంలో కొన్ని రంగాల్లో పెరిగి, కొన్ని రంగాల్లో క్షీణిస్తుందంటూ కొంతమంది ఆర్థికవేత్తలు వేసిన అంచనాలనీ ఎస్‌బీఐ తోసిపుచ్చింది. వీరి అంచనాలు దురుద్దేశాలతో కూడినవని తెలిపింది. ప్రస్తుతం అన్ని రంగాలు సరైన వృద్ధి బాటలోనే ఉన్నట్టు తెలిపింది. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌తో సహా పలువురు ఆర్థికవేత్తలు కొవిడ్ తర్వాత భారత ఆర్థిక వృద్ధి రేటు 'కే' రూపంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆటో రిక్షాలకు ఊరట

థర్డ్ పార్టీ ప్రీమియంపై పరిమితి

న్యూఢిల్లీ: ఆటో రిక్షాల థర్డ్ పార్టీ ప్రీమియంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ప్రకారం డీజిల్ లేదా గ్యాస్‌తో నడిచే ఆటోలపై వసూలు చేసే థర్డ్ పార్టీ ప్రీమియం ఒక్కో వాహనంపై రూ.2,371, ఒక్కో ప్రయాణికుడిపై రూ.1,134 మించకూడదని స్పష్టం చేసింది. ఇక ఎలక్ట్రిక్ రిక్షాల (ఈ-రిక్షా)పై వసూలు చేసే థర్డ్ పార్టీ ప్రీమియాన్ని ఒక్కో వాహనానికి రూ.1,539, ఒక్కో ప్రయాణికుడికి రూ.737కు పరిమితం చేసింది. ఆరుగురి కంటే తక్కువ మంది ప్రయాణించే ఆటో రిక్షాలకు మాత్రమే ఈ పరిమితి వర్తిస్తుంది. కేంద్ర రహదారులు, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. 2022లో జారీ చేసిన నిబంధనల ప్రకారం డీజిల్ లేదా గ్యాస్‌తో నడిచే ఆటో రిక్షాలు థర్డ్ పార్టీ ప్రీమియం కింద ఒక్కో ఆటోపై రూ.2,539, ఒక్కో ప్రయాణికుడిపై రూ.1,214 చెల్లించాలి. అదే ఈ-ఆటోలైతే ఒక్కో వాహనంపై రూ.1,648, ఒక్కో ప్రయాణికుడిపై రూ.789 థర్డ్ పార్టీ ప్రీమియంగా చెల్లించాల్సి వచ్చేది.

తాన్లా బోర్డులోకి ట్రాయ్ మాజీ చైర్మన్ ఆర్‌ఎస్ శర్మ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తాన్లా ప్లాట్‌ఫామ్స్ బోర్డులో ట్రాయ్ మాజీ చైర్మన్ ఆర్‌ఎస్ శర్మకు స్థానం లభించింది. దీంతో కంపెనీ బోర్డులో మొత్తం డైరెక్టర్ల సంఖ్య ఏడుకు చేరుతుందని తాన్లా వ్యవస్థాపక చైర్మన్, సీఈఓ ఉదయ్ రెడ్డి తెలిపారు. భారత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రయాణంలో శర్మ కీలక పాత్ర పోషించారు. డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో ఆయనకు దాదాపు ఐదు దశాబ్దాల అనుభవం ఉంది. 2015 నుంచి 2020 వరకూ టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్)కు ఆర్‌ఎస్ శర్మ చైర్మన్‌గా సేవలు అందించారు. 1978 నుంచి ఐఏఎస్ అధికారిగా పని చేశారు. శర్మ వంటి విశేష అనుభవం ఉన్న వ్యక్తి తాన్లా బోర్డులో చేరడంతో ఆయనకు ఉన్న అపార అనుభవం కంపెనీ విజయానికి బాగా ఉపయోగపడుతుందని ఉదయ్ రెడ్డి అన్నారు.

ప్రతికూల పవనాలతో పతన బాటలోకి

సెన్సెక్స్ 671 పాయింట్లు డౌన్

ముంబై: ప్రపంచ మార్కెట్లలో బలహీనతలు సోమవారం భారత ఈక్విటీ మార్కెట్‌ను ప్రభావితం చేశాయి. బ్యాంకింగ్, మెటల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో సూచీలు రెండు రోజుల లాభాలకు తెర దించి నష్టాలతో ముగిశాయి. దీంతో సెన్సెక్స్ 670.93 పాయింట్ల నష్టంతో 71,355.22 వద్ద ముగిసింది. ఒక దశలో సూచీ 725.11 పాయింట్లు నష్టపోయి 71,301.04 స్థాయికి దిగజారింది. నిఫ్టీ 197.80 పాయింట్ల నష్టంతో 21,513 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.2,91,756.23 కోట్లు దిగజారి రూ.3,66,40,965.08 కోట్ల వద్ద స్థిరపడింది.

బజాజ్ ఆటో రూ.4,000 కోట్లతో బైబ్యాక్: బజాజ్ ఆటో లిమిటెడ్.. రూ.4,000 కోట్లతో షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించింది. బైబ్యాక్‌లో భాగంగా ఒక్కోటి రూ.10 ముఖ విలువతో కూడిన 40 లక్షల షేర్లను వెనక్కు తీసుకోనుంది. ఒక్కో షేరును రూ.10,000తో బైబ్యాక్ చేసేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని పేర్కొంది.

కేజీ బేసిన్‌లో ఉత్పత్తి షురూ : ఓఎన్‌జీసీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ ఎట్టకేలకు కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లోని తన డీ-5 బ్లాక్ నుంచి చమురు, గ్యాస్ ఉత్పత్తి ప్రారంభించింది. ఆదివారం నుంచి ఈ ఉత్పత్తి ప్రారంభమైనట్టు తెలిపింది. అయితే రోజుకు ఎంత పరిమాణంలో చమురు, గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నదీ కంపెనీ వెల్లడించలేదు. ఆంధ్ర ప్రదేశ్ తీరానికి 35 కిలోమీటర్ల దూరంలో రిలయన్స్ డీ-6 బ్లాక్ పక్కనే ఈ క్షేత్రం ఉంది. సముద్ర మట్టానికి 3,000 నుంచి 3,200 మీటర్ల లోతులో ఉన్న ఈ బ్లాక్ అభివృద్ధి కోసం ఓఎన్‌జీసీ దాదాపు 512 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. ఈ క్షేత్రంలో 2.35 కోట్ల టన్నుల చమురు, 50.71 బిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు సమాచారం.

ఎంఎస్ఎంఈలకు మరిన్ని సేవలు

ఎస్ఎంబీఎక్స్ఎల్

ఎంఎస్ఎంఈ సంస్థలకు టెక్నాలజీ సేవలందిస్తున్న హైదరాబాద్ కంపెనీ ఎస్ఎంబీఎక్స్ఎల్.. తన సేవలను మరింతగా విస్తరించేందుకు రెడీ అవుతోంది. దేశీయంగా ఎంఎస్ఎంఈలు వృద్ధి పథంలో సాగుతుండటంతో మరిన్ని ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సంస్థ కో ఫౌండర్ ప్రీతి ఉబాలే తెలిపారు. ఎస్ఎంబీఎక్స్ఎల్ ఇప్పటికే మార్కెట్ సెంట్రల్, బిజినెస్ సెంట్రల్ పేరుతో ఎంఎస్ఎంఈలకు సేవలందిస్తోందని చెప్పారు. ఇందులో మార్కెట్ ప్లేస్.. ఎంఎస్ఎంఈలు తమ వ్యాపార కార్యకలాపాల విస్తరణకు తోడ్పాటునందిస్తుండగా బిజినెస్ సెంట్రల్.. ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ (ఈఆర్‌పీ) సర్వీస్‌లను ఆఫర్ చేస్తోందని పేర్కొన్నారు. కాగా చిన్న సంస్థలకు మరిన్ని సేవలందించాలనే ఉద్దేశంతో లాజిస్టిక్ సెంట్రల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నట్లు ప్రీతి చెప్పారు. 2018లో కార్యకలాపాలు ప్రారంభించిన ఎస్ఎంబీఎక్స్ఎల్ దేశవ్యాప్తంగా కంపెనీ 850కి పైగా నగరాల్లోని 55,000 పైగా ఎంఎస్ఎంఈలకు టెక్నాలజీ సేవలందిస్తోంది. గడిచిన రెండేళ్లలో ఎస్ఎంబీఎక్స్ఎల్‌కు చెందిన క్లయింట్స్ రూ.500 కోట్ల రెవెన్యూను ఆర్జించారని ఆమె పేర్కొన్నారు. కాగా ఈ ఏడాది హైదరాబాద్‌లో జరుగుతున్న నుమాయిష్‌లో పాల్గొంటున్న చిన్న వ్యాపారులకు ఎస్ఎంబీఎక్స్ఎల్ పూర్తి స్థాయి సేవలందిస్తోందన్నారు. మరోవైపు వచ్చే ఏడాది కాలంలో 1.25 లక్షల ఎంఎంస్ఎంఈలకు కంపెనీ సేవలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రీతి తెలిపారు.

మెర్సిడెస్ రూ.200 కోట్ల పెట్టుబడి

- ఈ ఏడాది కొత్తగా 12 మోడళ్లు
- మార్కెట్లోకి సరికొత్త జీఎల్ఎస్ లగ్జరీ ఎస్‌యూవీ



ధర రూ.1.37 కోట్లు

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్.. కొత్త ఉత్పత్తులు, తయారీ కార్యకలాపాలు, డిజిటైజేషన్ వంటి కార్యకలాపాలపై ఈ ఏడాది రూ.200 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. 2023 సంవత్సరంలో రికార్డు స్థాయిలో 17,408 కార్లు విక్రయించిన కంపెనీ తన స్థానం మరింత పటిష్ఠం చేసుకోవడం కోసం విభిన్న చర్యలు తీసుకుంటున్నట్టు మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ చెప్పారు. కాగా కంపెనీకి 2024 సంవత్సరం ప్రత్యేకమైనదని, తాము భారత మార్కెట్లోకి అడుగుపెట్టి ఈ ఏడాదితో 30 ఏళ్లు పూర్తవుతాయని అయ్యర్ తెలిపారు. దేశీయ లగ్జరీ మార్కెట్లో మరింత పట్టును చేజిక్కించుకునే లక్ష్యంతో ఈ ఏడాది 12 కొత్త కార్లను విడుదల చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. ఇందులో 3 ఎలక్ట్రిక్ మోడల్స్‌తో పాటు టాప్ ఎండ్ వెహికల్ సెగ్మెంట్ కార్లు ఉండనున్నాయని అయ్యర్ పేర్కొన్నారు. ఈ కార్ల ధర రూ.1.5 కోట్ల నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. కొత్త ఉత్పత్తులు, డిజిటలైజేషన్, తయారీ కార్యకలాపాల కోసం పుణె ప్లాంట్‌లో ఈ ఏడాది రూ.200 కోట్ల పెట్టుబడులు పెడుతున్నామని, ఈ పెట్టుబడులతో భారత్‌లో మెర్సిడెస్ పెట్టుబడులు రూ.3,000 కోట్లకు చేరుకుంటాయని తెలిపారు. కాగా సోమవారం నాడు కంపెనీ మార్కెట్లోకి సరికొత్త జీఎల్ఎస్ లగ్జరీ ఎస్‌యూవీని తీసుకువచ్చింది. ఈ ఎస్‌యూవీ పెట్రోల్, డీజిల్ వెర్షన్లలో అందుబాటులో ఉండనుంది. ఈ కార్ల ధరలు వరుసగా రూ.1.32 కోట్లు, రూ.1.37 కోట్లుగా ఉన్నాయి.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.75-80 కోట్ల పెట్టుబడులు

మహారాష్ట్రలో నాలుగో కొత్త యూనిట్.. మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ వెల్లడి

MOLD-TEK Packaging Limited

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సామర్థ్య విస్తరణకు మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.75-80 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఇప్పటికే మూడు కొత్త తయారీ యూనిట్లను ఏర్పాటు చేసిన కంపెనీ మహారాష్ట్రలోని మహద్‌లో నాలుగో యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇందుకు అవసరమైన భూమిని సేకరించామని, రూ.20 కోట్లతో ఏర్పాటు చేసే ఈ యూనిట్ వార్షిక సామర్థ్యం 1,500 టన్నులు ఉంటుందని మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ సీఎండీ లక్ష్మణ్ రావు తెలిపారు. గ్రాసిమ్ ఇండస్ట్రీస్ అవసరాల కోసం దీన్ని ప్రారంభిస్తున్నారు. తమిళనాడులోని చెయ్యార్, తెలంగాణలోని సుల్తాన్‌పూర్‌లో కొత్తగా నిర్మించిన ప్లాంట్లను కంపెనీ ప్రారంభించింది. కొద్ది రోజుల క్రితం హరియాణాలోని పానిపట్‌లో నిర్మించిన యూనిట్‌ను కూడా ప్రారంభించింది. ఈ మూడు యూనిట్లపై మోల్డ్‌టెక్ రూ.100 కోట్ల పెట్టుబడులు పెట్టింది. నాలుగు యూనిట్లలో వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభమైతే.. 2024-25 చివరి నాటికి మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ వార్షిక సామర్థ్యం 54,000 టన్నులకు చేరుతుంది. వచ్చే 5-6 ఏళ్లలో ఫుడ్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా రంగాలకు సరఫరా చేసే ఉత్పత్తుల విలువ మొత్తం టర్నోవర్‌లో దాదాపు 50 శాతం ఉంటుందని కంపెనీ అంచనా వేస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పరిమాణపరంగా విక్రయాలు 15-18 శాతం పెరగవచ్చని భావిస్తోంది. 2023-24లో పతంజలి, జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా వంటి కంపెనీలు మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ ఖాతాదారుల జాబితాలో చేరాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,050 ▼	57,800 ▼	77,800 ▼
ముంబై	62,192 ▼	56,968 ▼	71,386 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

8వ తేదీ

హైదరాబాద్	560	విజయవాడ	565
9 జనవరి		విశాఖపట్నం	625
చిత్తూరు	583	వరంగల్	562
గోదావరి	565	డజను గుడ్లు రూ.72	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	75	గోదావరి	84
వరంగల్	75	విజయవాడ	84
కరీంనగర్	75	గుంటూరు	82
మహబూబ్‌నగర్	75	ఒంగోలు	82
కర్నూలు	75	చిత్తూరు	78
విశాఖపట్నం	79		



పథకాలు రద్దు చేస్తే లబ్ధిదారులతో కలిసి పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామన్నారు. కేడర్‌ను పటిష్ఠం చేసుకుని ప్రజల్లో వెళ్తామని తెలిపారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ నేతలతో కేటీఆర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం పార్లమెంటులో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం ఉండాలని.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా, ప్రజల ప్రయోజనాలపై గట్టిగా కొట్లాడితే విజయం వరిస్తుందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ సరళిని పరిశీలిస్తే.. నిజామాబాద్ పార్లమెంటు స్థానంలో ఓట్ల పరంగా బీఆర్ఎస్ మొదటి స్థానంలో ఉందని, ఎంపీ సీటు తమ పార్టీకే దక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో త్రిముఖ పోటీకి అవకాశం ఉందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ అడ్డగోలుగా 420 హామీలిచ్చిందని విమర్శించారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేమని డిప్యూటీ సీఎం భట్టి అసెంబ్లీలోనే చెప్పారని.. అప్పులు, శ్వేతపత్రాల పేరిట తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. పేదల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల రద్దుకు కుట్రలు పన్నుతోందన్నారు. ఇది దుర్మార్గ చర్యని కేటీఆర్ విమర్శించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తాము దళిత బంధును ప్రారంభించామని చెప్పారు. దళితులను కేలం ఓటు బ్యాంకుగా చూసిన కాంగ్రెస్, ఎన్నికల సందర్భంగా ఆ పథకం లబ్ధిని రూ.12 లక్షలకు పెంచుతామని చెప్పి మరిచిపోయిందన్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తోందని, వారి బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తోందని ఆరోపించారు. గొర్రెల పంపిణీ కోసం డీడీలు కట్టినవారిని పట్టించుకోవడం లేదన్నారు. నియోజకవర్గానికి 3 వేలమందిని గృహ లక్ష్మి పథకం కింద ఎంపిక చేశామని, ప్రొసీడింగ్ అందాక, దాన్ని రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంపై నిందారోపణలు చేస్తోందన్నారు. 420 హామీలను విస్మరించి.. 6 గ్యారెంటీల పేరుతో తప్పించుకోవాలని చూస్తే ఊరుకోమన్నారు. ప్రతి పథకానికి దరఖాస్తు కోసం ప్రజలను లైన్లలో నిల్చోబెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారని, తమ ప్రభుత్వంలో ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ సర్కారు ప్రజలను ఇబ్బందిపెడుతోందన్నారు. పార్టీ సెక్రటరీ జనరల్ కేకే, మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, ఎల్.రమణ, నిజామాబాద్ పార్లమెంటు పరిధి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో కవిత

బీఆర్ఎస్ చేజారిన నల్లగొండ మునిసిపాలిటీ

(మొదటి పేజీ తరువాయి)

కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు అందజేశారు. ఈ నేపథ్యంలో సోమవారం మునిసిపల్ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ ఆధ్వర్యంలో అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి మునిసిపాలిటీలోని 48 మంది కౌన్సిలర్లలో 47 మంది హాజరయ్యారు. ఒక కౌన్సిలర్, ఇద్దరు ఎక్స్‌అఫీషియో సభ్యులు గైర్హాజరయ్యారు. 41మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి అనుకూలంగా మద్దతు తెలపగా.. బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఐదుగురు కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ బహిష్కృత కౌన్సిలర్ పిల్లి రామరాజుయాదవ్ తటస్థంగా ఉన్నారు. ఓటింగ్ నిర్వహణ నేపథ్యంలో హేమంత్ కేశవ్‌పాటిల్ మాట్లాడుతూ సమావేశ వివరాలను పురపాలక శాఖకు పంపుతామని, ఎన్నికల కమిషన్ ఆదేశాలతోపాటు తేదీ నిర్ణయించాక మునిసిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తామన్నారు. కాగా, నల్లగొండ మునిసిపాలిటీలో 2020లో జరిగిన మునిసిపల్ చైర్మన్ ఎన్నికలో ఎదురైన పరాభవానికి కాంగ్రెస్ బదులు తీర్చుకుంది. బీఆర్ఎస్ మునిసిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై సోమవారం నిర్వహించిన అవిశ్వాసాన్ని కాంగ్రెస్ పట్టుదలతో నెగ్గించుకుంది. 2020 జనవరిలో నిర్వహించిన నల్లగొండ మునిసిపాలిటీ ఎన్నికల్లో మొత్తం 48 వార్డులుండగా.. బీఆర్ఎస్ 20, కాంగ్రెస్ 20, బీజేపీ 6, ఎంఐఎం ఒకటి, ఇండిపెండెంట్‌గా ఒకరు గెలిచారు. చైర్మన్ స్థానాన్ని దక్కించుకునేందుకు 26ఓట్లు కావాల్సి ఉండగా.. ఎంఐఎం, మరో ఇండిపెండెంట్ అభ్యర్థి, ఎక్స్ అఫిషియో ఓట్లతో బీఆర్ఎస్ గట్టెక్కింది. మొత్తం 27మంది మద్దతు నాడు లభించింది. ఇక బీఆర్ఎస్, బీజేపీ ఒప్పందం మేరకు బీజేపీ.. కాంగ్రెస్‌కు మద్దతు తెలపలేదు. వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించి ఈ స్థానాన్ని బీజేపీకి కేటాయించాల్సి ఉండగా... బీఆర్ఎస్ ఒప్పందాన్ని ఉల్లంఘించి వైస్ చైర్మన్ పదవిని కూడా దక్కించుకుంది. అయితే నాడు అధికార పార్టీ ఎత్తులతో చిత్తయిన కాంగ్రెస్ అప్పటి ప్రతికారాన్ని సోమవారం తీర్చుకుంది. మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానంలో 41 మంది మద్దతుతో పంతం నెగ్గించుకుంది.

కోడ్‌లో కొట్టేశారు!

(మొదటి పేజీ తరువాయి)

సదరు అధికారికి నోటీసులు జారీ చేసిన ప్రభుత్వం.. తనకు నోటీసులు ఇచ్చిన రేస్ నిర్వాహక సంస్థకూ ఘాటుగా జవాబిచ్చింది. అసలు, ఈ ఒప్పందమే చట్ట విరుద్ధమని.. ఇక దాంట్లో ఉల్లంఘన ఎక్కడిదని నిలదీసింది. నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్న రూ.54కోట్ల ప్రజాధనాన్ని తిరిగిచ్చేయాలని డిమాండ్‌చేసింది. సాధారణంగా ఏదైనా సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవాలని భావిస్తే.. ముందుగా దానిపై సంబంధిత శాఖ మంత్రి ఆ శాఖ ఉన్నతాధికారులతో చర్చిస్తారు. ఒప్పందంతో రాష్ట్రానికి కలిగే లాభం ఏమిటి? చెల్లించాల్సిన ప్రజాధనం ఎంత? తదితర అంశాలన్నిటినీ బేరీజు వేసుకున్నాక నిర్ణయం తీసుకుంటారు. నిధులతో ముడిపడి ఉన్న అంశం అయితే ఆ ప్రతిపాదన ఆర్థికశాఖకు వెళ్తుంది. ముఖ్యమంత్రి, మంత్రిమండలి నిర్ణయం తర్వాతే నిధుల విడుదల జరుగుతుంది. అయితే.. హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ రేస్ నిర్వహణలో ఈ ప్రక్రియను అనుసరించకుండానే సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు ప్రైవేటు సంస్థతో ఒప్పందానికి నిర్ణయం తీసుకోవడం గమనార్హం.



అప్పట్లో ఇలా..

గత ఏడాది ఫిబ్రవరి-11న హైదరాబాద్‌లో జరిగిన సీజన్-9 ఫార్ములా-ఈ రేస్ నిర్వహణకు రూ.200 కోట్లు ఖర్చయింది. ఇందులో ఈవెంట్ నిర్వాహక సంస్థలైన గ్రీన్‌కో రూ.150కోట్లు, హైదరాబాద్ రేసింగ్ లిమిటెడ్ రూ.30కోట్లు ఖర్చుచేశాయి. రహదారులు, ఇతర మౌలిక వసతులకు హెచ్ఎండీఏ రూ.20 కోట్లు ఖర్చు చేసింది. ఈ ఏడాది తలపెట్టిన ఫార్ములా-ఈ 10వ సీజన్ ఈవెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఫెసిలిటేటర్‌గా ఉండి.. ఖర్చంతా ప్రైవేటు సంస్థలైన గ్రీన్కో, ఫార్ములా-ఈనే భరించాల్సి ఉంది. కానీ.. గత సీజన్‌లో ప్రధాన భాగస్వామిగా ఉన్న గ్రీన్కో సంస్థను తొలగించి దానిస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఉండేలా సీనియర్ ఐఏఎస్ ఒకరు సొంత నిర్ణయం తీసుకున్నారు. ఆ సమయంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. అటు ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా, ఎన్నికల సంఘం అనుమతి తీసుకోకుండా, కనీసం ఆర్థికశాఖ దృష్టికి తీసుకెళ్లకుండానే ఆ ఉన్నతాధికారి ఈవెంట్ నిర్వహణకు హెచ్ఎండీఏ నుంచి రూ. 54కోట్లు ముందస్తు చెల్లింపులు చేశారు. ఫిబ్రవరి 10న ఈవెంట్ జరిగి ఉంటే హెచ్ఎండీఏపై రూ.200 కోట్ల భారం పడేది. కానీ, ఇంతలో విషయం బయటపడడంతో ప్రభుత్వం సీరియస్ అయ్యింది

అధికారికి నోటీసులు..

ఫార్ములా-ఈ రేసుపై చట్టవిరుద్ధంగా నిర్ణయం తీసుకున్న అధికారికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఆయన నిర్ణయంపై పలు ప్రశ్నలు సంధించారు. అవేంటంటే..

- మంత్రివర్గం, ముఖ్యమంత్రి, ఎన్నికల సంఘం అనుమతి లేకుండా అధికారి స్థాయిలో ఒప్పందం చేసుకుంటే దానికి ఎలాంటి చట్టబద్ధతా ఉండదు. అలాంటప్పుడు నిధులు ఎలా విడుదల చేశారు.?
- గత సీజన్‌లో భాగస్వామిగా ఉన్న గ్రీన్‌కో ప్రైవేటు సంస్థను తొలగించి.. దాని స్థానంలో హెచ్ఎండీఏ ఉండాల్సిన అవసరం ఏముంది? ఈ నిర్ణయంతో రూ.54కోట్లు చెల్లించడం ప్రజాధనం వృథా కాదా?
- గత ఏడాది ఈవెంట్ భాగస్వామిగా ఉన్న సంస్థను తొలగిస్తే ఉత్పన్నమయ్యే పరిణామాల గురించి ఎందుకు ఆలోచించలేదు.
- ఈవెంట్ భాగస్వామిని తొలగిస్తే.. దాని స్థానంలో మరో ప్రైవేటు సంస్థను ఎందుకు అన్వేషించలేదు?
- హెచ్ఎండీఏపై పడే ఆర్థికభారాన్ని గమనించకుండా ఈవెంట్ ప్రమోటర్‌గా వ్యవహరించడానికి గల కారణాలేమిటి?
- హెచ్ఎండీఏ బోర్డ్ డైరెక్టర్ల, ఆర్థికశాఖ అనుమతి లేకుండా.. అదీ కోడ్ అమలులో ఉన్నప్పుడు రూ.55 కోట్లు ఎందుకు విడుదల చేశారు?

..అని నోటీసులో సీఎస్ ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని సీఎస్ ఆదేశించారు. సమాధానం ఇవ్వని పక్షంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నోటీసులో స్పష్టం చేశారు.

ఒప్పందమే చట్టవిరుద్ధం..

రేసును రద్దు చేయడంపై నిర్వాహక సంస్థ పంపిన నోటీసుకు ప్రభుత్వం ఘాటుగా సమాధానమిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందమే చట్టవిరుద్ధంగా ఉన్నప్పుడు ఉల్లంఘన ఎలా జరుగుతుందని ప్రశ్నించింది. నిబంధనలు, చట్టాలకు వ్యతిరేకంగా.. అదీ కోడ్ అమల్లోకి వచ్చాక చేసుకున్న ఒప్పందానికి ఎలాంటి విలువా ఉండదని స్పష్టంచేసింది. ఫార్ములా-ఈ సంస్థతో ఒప్పందం ప్రభుత్వంతో కాక.. ఓ అధికారి స్థాయిలో జరిగిందని, దానికి ఎలాంటి చట్టబద్ధతా ఉండదని పేర్కొంది. ఎలాంటి నిబంధనలూ పాటించని ఉన్నతాధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నామని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందుకు ఫార్ములా-ఈ నిర్వాహకులపైనా చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని తెలిపింది. హెచ్ఎండీఏ నుంచి తీసుకున్న రూ.44కోట్ల ప్రజాధనాన్ని, ఈ వ్యవహారానికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం ఆదాయపన్నుగా కట్టిన మొత్తం కలిపి రూ.54 కోట్లు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేసింది.

అధిష్ఠానానికి కార్యకర్తలను దూరం చేశారు

- హద్దులు గీసుకుని నన్నూ కలవనివ్వలేదు...!
- కొందరి కారణంగానే తాజా ఎన్నికల్లో ఓటమి
- మాజీ ఎమ్మెల్యేలపై ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉండగా పార్టీ కార్యకర్తలు అధిష్ఠానాన్ని కలవనీయకుండా చేశారని, తాను కలవాలని యత్నించినా.. కొందరు నేతలు అడ్డంకులు సృష్టించారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికివారు హద్దులు గీసుకుని, ప్రొటోకాల్ పేరిట నాయకులు, ముఖ్య కార్యకర్తలను దూరం చేశారని తాజా మాజీ ఎమ్మెల్యేలపై మండిపడ్డారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సమీక్ష సమావేశంలో కవిత చేసిన ఈ వ్యాఖ్యలు పార్టీ శ్రేణులను ఆశ్చర్యపరిచాయి. కొందరి కారణంగా అటు కార్యకర్తలు, ఇటు ప్రజలకు దూరమై.. ఎన్నికల్లో పరాజయం చవిచూడల్సి వచ్చిందన్నారు. ఉద్యమంలో అండగా నిలిచిన నిజామాబాద్‌లో ఓటమి ఏమిటని ఆమె ప్రశ్నించారు. దీనిపై నేతలంతా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలని, నిజామాబాద్‌లో గెలిచి కేసీఆర్‌కు బహుమతిగా అందివ్వాలని కవిత కోరారు. కాగా, మన పార్టీకి చెందిన ఆడబిడ్డను ఎంపీ అర్వింద్ అడ్డగోలుగా విమర్శిస్తుంటే అధికారంలో ఉండి కూడా ఎందుకు స్పందించలేదు..? ముఖ్య నాయకులు ఎందుకు ఖండించలేదు? అని సమీక్ష సందర్భంగా పలువురు కార్యకర్తలు నిలదీశారు. 2019లో ఎంపీ ఎన్నికల్లో ఓడినప్పుడే సమీక్ష ఎందుకు నిర్వహించలేదని కొందరు ప్రశ్నించారు. అలా చేసి ఉంటే ఎమ్మెల్యే సీట్లు కోల్పోయే పరిస్థితి వచ్చేది కాదని అభిప్రాయపడినట్లు సమాచారం. పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలను అడుగడుగునా నిర్లక్ష్యం చేశారని, వారికి ఇప్పుడైనా ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాదర్బార్ ద్వారా నెల రోజుల్లో తీసుకున్న దరఖాస్తులు, వాటిలో ఎన్ని పరిష్కరించారో శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ రమణతో కలిసి ఆయన మాట్లాడారు. అఖిలపక్ష సమావేశాలు, ప్రజాభిప్రాయంతో ఏర్పాటైన జిల్లాలను ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. రద్దుల పేరిట కాంగెస్ సర్కారు వాగ్దానాలను వాయిదా వేస్తోందన్నారు.

తీన్మార్ మల్లన్నపై పరువు నష్టం దావా వేస్తా

- నా కుటుంబంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు: పల్లా

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కనీస అవగాహన లేకుండా తీన్మార్ మల్లన్న తన కుటుంబ సభ్యులపై అసత్య ప్రచారం చేస్తున్నారని, ఆయనపై కోర్టులో పరువు నష్టం దావా వేస్తామని బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక నా భార్య నీలిమకు విద్యుత్ శాఖలో అక్రమంగా ఉద్యోగం ఇచ్చినట్లు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆమె ఏపీఎస్ఈబీ బోర్డు పరీక్షల్లో టాప్ మార్కులతో 1992లోనే (31 ఏళ్ల కిందట) ఏఈ ఉద్యోగం సాధించారు. ఆ తర్వాత ఏడీఈగా, 2015లో డివిజనల్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందారు. నేను పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి రావడంతో నీలిమ 2020 నవంబరు 19న ప్రభుత్వం ఉద్యోగం నుంచి వీఆర్ఎస్ తీసుకున్నారు. ప్రస్తుతం అనురాగ్ విద్యాసంస్థలకు సీఈఓగా పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ సర్కారులో ఉద్యోగం పొంది.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగానికి రాజీనామా చేశారని తీన్మార్ మల్లన్న అబద్ధాలు ప్రచారం చేయడం సరికాదు. ఆయనే చాలా మందిని బ్లాక్‌మెయిల్ చేస్తూ.. డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ప్రజావాణిలో కూడా అనేక ఫిర్యాదులు వచ్చాయి. అలాంటి వారిని కాంగ్రెస్ ఉపేక్షించడం తగదు. తీన్మార్ మల్లన్నపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.

పదవీ విరమణ చేసిన వారిని సాగనంపాలి

- మంత్రి ఉత్తమ్‌కు హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో పదవీ విరమణ చేసిన వారినందరినీ సాగనంపాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, చక్రధర్‌ల నేతృత్వంలోని ప్రతినిధులు సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందించారు. రెగ్యులర్ పోస్టుల్లో పదవీ విరమణ చేసిన వారు ఉన్నారని, వారిని వెంటనే తొలగించాలని కోరారు. పదోన్నతుల్లో జోన్-6 ఉద్యోగులకు సమాన అవకాశాలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఏపీ ఉప ముఖ్యమంత్రిపై కాంగ్రెస్ ఫిర్యాదు

అఫ్జల్‌గంజ్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామిపై బేగంబజార్ పీఎస్‌లో కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి, తెలంగాణ ఫిషర్మెన్ విభాగం చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ శంకర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ సోనియాగాంధీపై నారాయణస్వామి తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. రాజశేఖరరెడ్డి సైతం సోనియాగాంధీకి విధేయుడిగా ఉండేవారని గుర్తు చేశారు. రాజకీయ స్వలాభం కోసం ఏపీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి చౌకబారు ఆరోపణలు చేశారని ఆరోపించారు.

పాలమూరు పర్యావరణ అనుమతులు జటిలమే!

- రెండో దశ అనుమతులకు కేంద్రం ప్రత్యేక కమిటీ
- ఆ కమిటీ నివేదిక వచ్చాకే అనుమతులు!

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రెండో దశ పర్యావరణ అనుమతులు ఇప్పట్లో వచ్చేలా లేవు. ప్రాజెక్టుకు రెండో దశ పర్యావరణ అనుమతులను మంజూరు చేయాలంటూ గతంలోనే కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ పరిధిలోని నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) సిఫారసు చేసింది. అయితే ఈ అనుమతి రావాలంటే మరిన్ని ప్రతిబంధకాలను దాటాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ప్రాజెక్టుపై ఎన్జీటీ విధించిన జరిమానా నిధుల వినియోగానికి ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసి, ఆ నివేదిక వచ్చిన తర్వాతే రెండో దశ పర్యావరణ అనుమతి ఇవ్వాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిసింది. ఇక ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కోరగా.. డీపీఆర్‌కు సీడబ్ల్యూసీ ఆమోదం తెలిపితే హోదాను పరిశీలిస్తామని ఆయన చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నిబంధనలకు విరుద్ధంగా చేపట్టి, పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఏపీలోని వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన పలువురు ఎన్జీటీని ఆశ్రయించగా.. విచారణ జరిపి, డిండి ఎత్తిపోతలకు రూ.320 కోట్లు, పాలమూరుకు రూ.600 కోట్లు జరిమానా విధించింది. ఈ నిధుల వినియోగంపై కేంద్రం ప్రత్యేక కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాతే పాలమూరుకు రెండో దశ పర్యావరణ అనుమతులు రానున్నాయి. అంతేగాక పర్యావరణ ఉల్లంఘనలకు బాధ్యులు ఎవరు? ఏం చర్యలు తీసుకున్నారనేదానిపై కాలుష్య నియంత్రణ మండలిని కూడా నిలదీస్తూ కేంద్రం లేఖ రాసింది. దీంతో రెండో దశ అనుమతుల ప్రక్రియ మరింత జటిలమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రేవంత్‌కేమీ తుంటి సర్జరీ జరగలేదుగా..

- మాకు ఆయన్ను కలవాల్సిన అవసరం లేదు:కొడాలి నాని

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు నేనేమీ అపాయింట్‌మెంట్ కోరలేదు. మాకు, మా సీఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసేందుకే సమయం లేదు. ఇక పొరుగు రాష్ట్రం సీఎం రేవంత్‌రెడ్డిని ఎక్కడ కలుస్తాం?' అని మాజీ మంత్రి కొడాలి నాని అన్నారు. సోమవారం తాడేపల్లి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీని గెలిచినా అక్కడ రాజకీయాలను జగన్ వదిలేశారు. అక్కడ ఏ రాజకీయ పార్టీకీ మద్దతు ఇవ్వడం లేదు. తుంటి ఎముకకు సర్జరీ జరిగినందున తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను జగన్ పరామర్శించారు. తెలంగాణ సీఎం రేవంత్‌ను జగన్ పరామర్శించడానికి ఆయనకేమీ తుంటి ఎముక సర్జరీ జరగలేదు కదా..? మాకు రేవంత్‌ను కలవాల్సిన అవసరం లేదు. అసెంబ్లీ, పార్లమెంటు ఇన్‌చార్జీల మార్పుపై అభ్యర్థులందరితోనూ చర్చించాకే జగన్ నిర్ణయం తీసుకుంటున్నారు. కారణం చెప్పిమరీ అభ్యర్థులను మారుస్తున్నారు. ఏ సీటు మారుస్తున్నారో వారినే పిలిచి మాట్లాడుతున్నారు" అని కొడాలి అన్నారు.

రాజస్థాన్ ఉపఎన్నికలో రాష్ట్ర మంత్రి ఓటమి

జైపూర్, జనవరి 8: రాజస్థాన్‌లో కరణ్‌పూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో అధికార బీజేపీపై కాంగ్రెస్ విజయం సాధించింది. బీజేపీ అభ్యర్థి అయిన మంత్రి సురేందర్‌పాల్ సింగ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి రూపిందర్ సింగ్ 11,284 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా రూపిందర్‌ను మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ అభినందించారు. రాజస్థాన్‌లోని మొత్తం 200 నియోజకవర్గాల్లో కరణ్‌పూర్ మినహా 199 నియోజకవర్గాలకు గతేడాది నవంబరు 25న ఎన్నికలు జరిగాయి. ఎన్నికలకు దాదాపు 10 రోజుల ముందు కరణ్‌పూర్ కాంగ్రెస్ అభ్యర్థి గుర్మీత్ సింగ్ మరణించడంతో అక్కడి ఎన్నిక వాయిదా పడింది.

చిత్రపురి దొంగలకు మద్దతు ఇవ్వొద్దు

- రఘునందన్‌కు చిత్రపురి సాధన సమితి విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కో ఆపరేటివ్ సొసైటీ కార్యదర్శిగా ఉన్న రఘునందన్‌రావు ఇప్పటికైనా చిత్రపురి దొంగలకు మద్దతు ఇవ్వడం ఆపేయాలని చిత్రపురి సాధన సమితి సభ్యులు కస్తూరి శ్రీనివాస్, మద్దినేని రమేశ్, మన్యవాసి విజ్ఞప్తి చేశారు. చిత్రపురిలో జరిగిన అక్రమాలపై ఇప్పటికే పలు కమిటీలు నివేదికలిచ్చాయని, కానీ చిత్రపురి సినీ సొసైటీ కమిటీతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారులు కుమ్మక్కై.. ఎలాంటి చర్యలూ తీసుకోలేదని వారు ఆరోపించారు. దాంతో ఈ రెండేళ్ల కాలంలో సొసైటీలో మరో రూ. 40కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. సినీ కార్మికుల గృహాలు అన్యాక్రాంతమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కో ఆపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్ మాధవరెడ్డికి చిత్రపురిలో జరిగిన అక్రమాలపై నివేదికిచ్చి మూడు నెలలవుతోందని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ బంధువైన రఘునందన్‌రావు, రంగారెడ్డి జిల్లా డీసీవో ధాత్రీదేవి నివేదికను బయటకు రాకుండా తొక్కిపెట్టారని ఆరోపించారు. గతంలో ఎన్నోసార్లు నివేదిక అడిగినా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీఐ ద్వారా అడగ్గానే మాధవరెడ్డి నివేదికిచ్చారని తెలిపారు. ఇప్పటికైనా కో ఆపరేటివ్ చట్టాల పరిధిలోని సెక్షన్ 34 ప్రకారం చిత్రపురి కమిటీని సూపర్ సీడ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

ర్యాష్ డ్రైవింగ్ కేసు కొట్టేయండి

- మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు పిటిషన్
- నేడు హైకోర్టులో విచారణ

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బేగంపేట్ ప్రజాభవన్ వద్ద ర్యాష్‌డ్రైవింగ్ చేసి బారికేడ్లను ఢీకొట్టిన వ్యవహారంలో పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రహీల్ అమీర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ ప్రమాదంతో తనకు ఎటువంటి సంబంధం లేదని, అందువల్ల కేసును కొట్టేయాలని కోరారు. మొదట నిందితుడిగా చేర్చిన అబ్దుల్ ఆసిఫ్‌ను చిత్రహింసలు పెట్టడం వల్లే తన పేరు చెప్పాడని, అక్రమంగా తన పేరు ఇరికించారని తెలిపారు. ఈ పిటిషన్ మంగళవారం హైకోర్టు ఎదుట విచారణకు రానున్నది.

అప్పులెలా తీరుస్తారు?

- 6 గ్యారంటీలు ఎలా అమలు చేస్తారు?
- కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేయాలి: సంజయ్

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులపాలు చేసిందని విస్తృతంగా ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్... ఆ 6 లక్షల కోట్ల అప్పులను తీరుస్తుందో, ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో ఎలా అమలు చేస్తుందో స్పష్టం చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై వచ్చే పార్లమెంటు ఎన్నికల దాకా ప్రచారం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్లాన్ చేసిందని ఆరోపించారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. పైసా అవసరం లేని పనులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం లేదని ఆయన విమర్శించారు. 'డ్రగ్స్ కేసు మూసివేతకు కారకులెవరు? ఆ కేసును తిరగదోడాలి. గ్లోబరినా అనే సంస్థ నిర్వాకం వల్ల 26 మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంస్థ వెనుక కేసీఆర్ కుటుంబ సభ్యులు ఉన్నారన్న ఆరోపణలున్నాయి. ఇది ఎవరి బినామీ సంస్థ? టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ కేసును ఎందుకు పట్టించుకోవడం లేదు? ఈ లీకేజీకి కారకులెవరు? ఈ కేసును నిర్వీర్యం చేసిందెవరో తేల్చాల'ని డిమాండ్ చేశారు. వేలాది మంది ఉపాధ్యాయులను చెట్టుకొకరు పుట్టకొకరుగా మార్చిన 317 జీవోను సవరిస్తారా లేదా అని నిలదీశారు. 'నయీం అక్రమంగా సంపాదించిన ఆస్తిపాస్తుల డాక్యుమెంట్లు ఎవరి వద్ద ఉన్నాయి... నయీం కేసులో ఏర్పాటు చేసిన సిట్ ఏమైందో తేల్చాల'ని సంజయ్ డిమాండ్ చేశారు. ఆ కేసును తవ్వితే చాలామంది నాయకుల బండారం బయటపడుతుందన్నారు. నయీం ఆస్తులను స్వాధీనం చేసుకుంటే రెండు, మూడు జిల్లాలను సునాయసంగా పాలించవచ్చని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం అవినీతిపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ విచారణకు డిమాండ్ చేసి ఇప్పుడు ముందుకు రాకపోవడంతో ప్రజలు కాంగ్రెస్‌ను విశ్వసించడం లేదన్నారు.



ఈటలతోనే కాదు ఎవరితోనూ విభేదాల్లేవు

'ఈటలతోనే కాదు నాకు ఎవరితోనూ విభేదాలు లేవు. కొంతమంది పార్టీని వీడినా ఈటల మాత్రం పార్టీని, ప్రధాని మోదీని నమ్మి కొనసాగుతున్నారు. అందరం కలిసిమెలిసి ఉంటున్నా'మని సంజయ్ వివరించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అన్నది తప్పుడు ప్రచారమని, పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఆడుతున్న నాటకమని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసే ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ వాళ్లు కేటీఆర్‌కు సరైన కౌంటర్ ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ పదాన్ని తొలగించుకున్న బీఆర్ఎస్ ఎంపీలు.. పార్లమెంటులో తెలంగాణ వాదాన్ని వినిపిస్తారా? అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలు గెలిస్తేనే తెలంగాణకు ఎక్కువ నిధులు వస్తాయన్నారు. చాలామంది కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తమతో టచ్‌లో ఉన్నారన్నారు.

తెలంగాణ అనే పదాన్ని చెరిపేసిందే కేసీఆర్

- కాంగ్రెస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆరోపణ
- ఓటమిపై ఆత్మవిమర్శ చేసుకోండి: నిరంజన్
- ఒక్క ఎంపీ సీటూ గెలవదు: బండ్ల గణేష్

హైదరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అనే పదాన్ని చెరిపేసే కుట్ర కాంగ్రెస్ పార్టీ చేస్తోందంటూ కేటీఆర్ వ్యాఖ్యానించడం ఆశ్చర్యకరంగా ఉందని, అసలు ఆ పని చేసిందే కేసీఆర్ అని కాంగ్రెస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ పార్టీ పేరులోనే తెలంగాణ అన్న పదాన్ని తొలగించిన బీఆర్ఎస్ పార్టీ వాళ్లు, తెలంగాణ గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అవినీతి తప్ప కేసీఆర్‌కు ప్రజలు పట్టలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కింద పని చేసే సీబీఐతో విచారణ కన్నా.. రాష్ట్ర ప్రభుత్వంలో నిర్వహించే న్యాయ విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలను సమర్థించే ప్రయత్నం చేస్తున్న ఈఎన్సీ మురళీధర్‌రావును తక్షణం బాధ్యతల నుంచి తొలగించాలన్నారు. కేసీఆర్ పాలనలో రూ.లక్ష కోట్ల అవినీతి జరగ్గా..అందులో కాళేశ్వరం, యాదాద్రి, మిషన్ భగీరథల్లో జరిగిన అవినీతే రూ. 50 వేల కోట్లకు పైన ఉంటుందని ఆరోపించారు. బీఆర్ఎస్ ఓటమికి కేసీఆర్ కుటుంబం ఎంతవరకు కారణమో ముందుగా సమీక్ష చేసుకోవాలని నిరంజన్ హితవు పలికారు. జిల్లాలను రద్దు చేస్తామని సీఎం రేవంత్ ఎక్కడా చెప్పలేదని, రిటైర్డ్ హైకోర్టు జడ్జి నేతృత్వంలో కమిటీని వేసి శాస్త్రీయ పద్ధతిలో పునస్సమీక్షిస్తామని మాత్రమే చెప్పారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా జిల్లాలు రద్దు చేస్తారంటూ బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన..అన్ని రాష్ట్రాలూ మెచ్చుకునే విధంగా సాగుతోందని కాంగ్రెస్ పార్టీ నేత బండ్ల గణేష్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ప్రజాపథంలో దూసుకుపోతుంటే కేటీఆర్, హరీశ్‌రావుల ఈర్ష్య పీక్ స్టేజికి చేరుకుందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క ఎంపీ సీటును కూడా గెలవబోదన్నారు. నెల రోజులుగా బీఆర్ఎస్ నేతల సంపాదన ఆగిపోయిందని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపైన విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు నేరెళ్ల శారద అన్నారు.

ఫిర్ ఏక్ బార్.. మోదీ సర్కార్!

(మొదటి పేజీ తరువాయి)



ఎన్నికల సన్నద్ధత సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జులు తరుణ్‌ఛుగ్, సునీల్ బన్సల్, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డితో పాటు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని సమీక్షించారు. ఇందుకు అనుగుణంగా లోక్‌సభ ఎన్నికల నాటికి ఆయా నియోజకవర్గాల్లో పార్టీని పటిష్ఠం చేయాలని నిర్ణయించారు. వికసిత్ భారత్, గావ్ చలో బస్తీ చలో కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని నిర్ణయించారు. తరుణ్‌ఛుగ్, కిషన్ రెడ్డిలు పార్టీ ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్టీ నుంచి 8 మంది ఎమ్మెల్యేలు ఇటీవలి ఎన్నికల్లో గెలుపొందిన సంగతి తెలిసిందే. బీజేఎల్పీ నేత ఎంపికపై ఎమ్మెల్యేలతో విడివిడిగా అభిప్రాయాలు తీసుకున్నారు.

మా నినాదమిదే: కిషన్‌రెడ్డి

'ఫిర్ ఏక్ బార్.. మోదీ సర్కార్'.. ఇదే తమ ఎన్నికల నినాదమని కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ అవసరం లేదన్నారు. తన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని అసమర్థులు కాంగ్రెస్ నాయకులని, అందుకే తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరిపించాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎందుకు కేంద్రానికి లేఖ రాశారో సమాధానం చెప్పాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే అని నిరూపించేందుకు తాను సిద్ధమని, దీనిపై చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు రామ జన్మభూమిలో అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు చేపట్టిన కార్యక్రమాలకు ప్రజలంతా మద్దతు ఇవ్వాలన్నారు. సంక్రాంతి నుంచి జనవరి 22 వరకు దేశంలోని దేవాలయాలు, పరిసరాల్లో స్వచ్ఛ అభియాన్ నిర్వహించి మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

నెలాఖరులో ప్రధాని పర్యటన!

ప్రధాని మోదీ ఈనెలాఖరులో రాష్ట్రంలో పర్యటించే అవకాశం ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఆయన రెండు కార్యక్రమాల్లో పాల్గొంటారని, ఇందులో ఒకటి ఎన్టీపీసీ 800 మెగావాట్ల ప్లాంటును జాతికి అంకితం చేయడమని చెప్పారు.

17 లోక్‌సభ స్థానాలకు బీజేపీ ఇన్‌చార్జిలు

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17 లోక్‌సభ నియోజకవర్గాలకు రాజకీయ ఇన్‌చార్జిలను నియమించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వారితో పాటు సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించారు. త్వరలో, సంస్థాగత ఇన్‌చార్జిలను నియమించనున్నారు. వీరితో పాటు స్థానికంగా ఉండే సీనియర్ నాయకులకు సమన్వయ బాధ్యతలు అప్పగించనున్నారు. సికింద్రాబాద్‌కు లక్ష్మణ్, హైదరాబాద్‌కు రాజాసింగ్, ఆదిలాబాద్‌కు పాయల శంకర్, పెద్దపల్లికి రామారావు పవార్, కరీంనగర్‌కు ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, నిజామాబాద్‌కు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, జహీరాబాద్‌కు కె.వెంకటరమణారెడ్డి, మెదక్‌కు పాల్వాయి హరీష్‌బాబు, మల్కాజిగిరికి పైడి రాకేశ్‌రెడ్డి, చేవెళ్లకు ఎ.వెంకటనారాయణరెడ్డి, మహబూబ్‌నగర్‌కు ఎస్.రాంచందర్‌రావు, నాగర్‌కర్నూల్‌కు మూరం రంగారెడ్డి, నల్గొండకు చింతల రాంచంద్రారెడ్డి, భువనగిరికి ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, వరంగల్‌కు మర్రి శశిధర్‌రెడ్డి, మహబూబాబాద్‌కు గరికపాటి మోహన్‌రావు, ఖమ్మంకు పొంగులేటి సుధాకర్‌రెడ్డిని రాజకీయ ఇన్‌చార్జిలుగా నియమించారు.

ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగింతలో వేగం పెంచండి

- ఈ నెల 31వ తేదీలోగా లక్ష్యం పూర్తి చేయాలి
- పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేస్తే చర్యలు: ఉత్తమ్



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భారత ఆహారసంస్థ(ఎఫ్‌సీఐ)కి బియ్యం అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. రైస్‌మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ టార్గెట్‌ను ఈ నెల 31 వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. సీఎస్ శాంతికుమారి, పౌర సరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల సంస్థ, ఎఫ్‌సీఐ అధికారులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు బియ్యం కోటా ఎక్కువ అడిగారని, కానీ ఇక్కడి నుంచి డెలివరీ చాలా తక్కువగా ఉందని మండిపడ్డారు. ఈనెలాఖరు వరకు 7.83 లక్షల టన్నుల వానాకాలం బియ్యం, 35 లక్షల టన్నుల యాసంగి బియ్యం కలిపి మొత్తం 43 లక్షల టన్నుల బియ్యం డెలివరీ పూర్తిచేయాలని టార్గెట్ పెట్టారు. గడిచిన పదేళ్లలో పౌరసరఫరాల సంస్థ రూ.58వేల కోట్ల అప్పులు తీసుకుందని, రూ. 11 వేల కోట్ల నష్టాల ఊబిలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎంఆర్ జాప్యంతో రూ.3 వేల కోట్ల వార్షిక వడ్డీ భారం పడుతోందని గుర్తు చేశారు. మిల్లర్లు ఎఫ్‌సీఐకి బియ్యాన్ని ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులు రోజువారీ టార్గెట్ పెట్టుకొని పని చేయాలని సూచించారు. పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఒక్కో బియ్యం బస్తాకు 4- 5 కిలోల బియ్యం తక్కువ వస్తున్నట్లు రేషన్ డీలర్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై విచారణ చేపట్టాలని అధికారులను ఉత్తమ్ ఆదేశించారు.

యాసంగికి 19.24 లక్షల టన్నుల ఎరువులు

- సకాలంలో రైతులకు చేరేలా చర్యలు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌కు 19.24 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. రైతులకు కావాల్సిన అన్నిరకాల ఎరువులు సిద్ధంగా ఉంచటంతోపాటు.. క్షేత్రస్థాయికి సకాలంలో చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపితో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. నోడల్ ఏజెన్సీ మార్క్‌ఫెడ్, ఎరువుల కంపెనీలతో నెలవారిగా సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.నిరుడు యాసంగిలో ఈ సమయానికి 7 లక్షల టన్నుల ఎరువుల నిల్వ ఉండగా... ప్రస్తుతం 9 లక్షల టన్నుల నిల్వలు ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా యూరియా నిల్వలు నిరుడు ఈ సమయానికి 3.57 లక్షల టన్నులు ఉండగా... ప్రస్తుతం 4.68 లక్షల టన్నుల యూరియా నిల్వలు రాష్ట్రంలో ఉన్నట్లు మంత్రి తుమ్మల వివరించారు.

ఇది నా 12వ పోస్టింగ్..

- పదవికి న్యాయం చేస్తా: స్మితాసభర్వాల్

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం(టీఎస్ఎఫ్‌సీ)కు సభ్య కార్యదర్శిగా నియామకమవ్వడం తనకు 12వ పోస్టింగ్ అని ఐఏఎస్ అధికారిణి స్మితాసభర్వాల్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి, సాగునీటి పారుదల, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యదర్శి పోస్టుల నుంచి ఇటీవల ఆమెను తొలగించిన ప్రభుత్వం... ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా నియమించింది. ఐదు రోజుల అనంతరం ఆమె సోమవారం ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె చార్జి తీసుకుంటున్న ఫొటోను 'ఎక్స్(ట్విట్టర్)'లో ట్వీట్ చేశారు. ఇది తనకు 12వ పోస్టింగ్ అని, మనసు పెట్టి పని చేస్తే ప్రతీది దగ్గరవుతుందని చెప్పారు. ఈ పోస్టింగ్‌కు న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమని ఆమె తెలిపారు.

పంచాయతీరాజ్ స్పెషల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ బదిలీ

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ కమిషనర్, ఐఎఫ్ఎస్ అధికారి ఎస్‌వీ ప్రదీప్‌కుమార్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. హెచ్ఎండీఏలోని అర్బన్ ఫారెస్ట్ విభాగానికి ఆయనను డైరెక్టర్‌గా నియమించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులను జారీచేశారు. ప్రస్తుతం డైరెక్టర్ పోస్టులో ఉన్న మరో ఐఎఫ్ఎస్ అధికారి డా.బి.ప్రభాకర్‌ను బదిలీ చేసి, అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్)కు రిపోర్టు చేయాలని ఆదేశించారు. కాగా, డిప్యూటీ కలెక్టర్ లచ్చిరెడ్డికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. సీసీఎల్ఏలో సీఎంఆర్ఓ (కంప్యూటరైజేషన్ మండల్ రెవెన్యూ ఆఫీసెస్) ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తూ సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ ఉత్తర్వులు జారీచేశారు.

మేడారంలో తాత్కాలిక ఆస్పత్రులు

50 పడకలతో స్పెషాలిటీ ఆసుపత్రి

- ఏర్పాటుకు వైద్యమంత్రి ఆదేశం

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క, సారక్క జాతరకు వచ్చే భక్తులకు వైద్య సేవలు అందించేందుకు మేడారంలో తాత్కాలికంగా 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. జాతరలో ఆరోగ్యశాఖ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం ఆయన సచివాలయంలో అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించడంలో ఎటువంటి లోటు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 50 బెడ్లతో తాత్కాలికంగా ఒక స్పెషాలిటీ ఆస్పత్రి(సమ్మక్క, సారక్క వైద్యశాల) మేడారంలో సిద్ధం చేయాలని ఆదేశించారు. అక్కడి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో స్పెషలిస్టు వైద్యులతో ఆరు పడకల మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర పరిసరాల్లో మొత్తం 30 మెడికల్ క్యాంపులు, జాతరకు పోయే రూట్లలో మరో 42 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి క్యాంపులో డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని, అవసరమైన అన్ని మందులు, అత్యవసర మెడికల్ కిట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. 20 మొబైల్ మెడికల్ యూనిట్లు, 15 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జాతర వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, 15 బైక్ అంబులెన్స్‌లూ అందుబాటులో ఉంచుకుని పేషెంట్లను వీలైనంత త్వరగా మెడికల్ క్యాంపులు లేదా సమీపంలోని ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. మెడికల్ క్యాంపుల్లో ట్రీట్‌మెంట్ చేశాక, ఇంకా ఉన్నత వైద్యం అవసరమైతే ములుగు, ఏటూరునాగారం, పరకాల ఏరియా ఆసుపత్రులకు, వరంగల్ ఎంజీఎంకు తరలించి వైద్యం అందించాలని మంత్రి సూచించారు. జాతర ప్రారంభం కావడానికి రెండు వారాల ముందు నుంచే మెడికల్ క్యాంపులు, ఆసుపత్రి ప్రారంభించాలని ఆదేశించారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, ఉన్నతాధికారులు పరిశీలించాలని మంత్రి సూచించారు.

టూరిజం కార్పొరేషన్

ఎం.డి.పై సస్పెన్షన్ కొనసాగుతోంది

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం
- అప్పీలుకు అవకాశం ఇస్తూ విచారణ వాయిదా

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారనే ఆరోపణలతో ఎలక్షన్ కమిషన్ చర్యలకు గురైన టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎం.డి. బోయిన్‌పల్లి మనోహర్‌రావుపై సస్పెన్షన్ కొనసాగుతోందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఈ మేరకు తన నిర్ణయాన్ని వెల్లడించింది. మనోహర్‌రావును ఎలక్షన్ కమిషన్ సస్పెండ్ చేయగా, దాన్ని ఎత్తివేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. అయితే సస్పెన్షన్‌ను ఎత్తివేయాలా, కొనసాగించాలా అన్నదానిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేయడంతో హైకోర్టు ప్రశ్నించింది. వారంరోజుల్లో నిర్ణయం తీసుకోకపోతే సంబంధితశాఖ ముఖ్యకార్యదర్శిపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని హెచ్చరించింది కూడా. సోమవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఎదుట ఈ కేసు విచారణకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ నిర్ణయంపై పిటిషనర్ అప్పీల్ చేసుకోవచ్చని పేర్కొంటూ విచారణను ఈనెల 10కి వాయిదా వేసింది

సింగరేణి భవిష్యత్తుపై ఆశలు

- సంస్థ బలోపేతంపై సర్కారు నజర్

భూపాలపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని గాడిలో పెట్టే పనిలో పడింది. పీకల్లోతు కష్టాల్లో ఉన్న సంస్థను బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది. గోదావరి, ప్రాణహిత పరీవాహక ప్రాంతాల్లో బొగ్గు కోసం అన్వేషణ చేపడితేనే సంస్థ మనుగడ సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. గత సర్కారు కొత్త గనులను ఏర్పాటు చేయకపోవటంతో సింగరేణిలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులతో సింగరేణి భవిష్యత్తుపై సమీక్షించారు. సింగరేణి బలోపేతం, ఉపాధి అవకాశాలు పెంచాలని నిర్ణయించారు. సింగరేణిలో బొగ్గు బ్లాకుల విస్తరణతోపాటు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే గనుల వేలంలో పాల్గొనడంపై అధికారులతో సర్కారు చర్చలు జరుపుతోంది.

డీఎంఎఫ్‌టీ మాయంపై సీరియస్..

సింగరేణిలో డీఎంఎఫ్‌టీ నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వం దృష్టిసారించింది. బొగ్గు, ఇసుక, ఇతర ఖనిజాల తవ్వకాల ద్వారా వచ్చే ఆదాయంలో 30 శాతం నిధులను జిల్లా మైనింగ్ డైరెక్టర్ ద్వారా కలెక్టర్ నేతృత్వంలోని డీఎంఎఫ్‌టీలో జమ చేస్తారు. ఆ నిధుల్లో 60 శాతం ప్రభావిత గ్రామాల్లో, 40 శాతం ప్రభావితం లేని గ్రామాల్లో ఖర్చు చేయాలి. అయితే సింగరేణికి సంబంధం లేని జిల్లాలకు గతంలో కలెక్టర్లు భారీగా నిధులను మళ్లించారు. ఇప్పటి వరకు సుమారు రూ.814 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు జమ అయితే వీటిలో సింగరేణి ప్రభావిత జిల్లాల్లో రూ.402.58 కోట్లు ఖర్చు చేశారు. మిగతా రూ.507.71 కోట్లను డీఎంఎఫ్‌టీతో సంబంధం లేని జిల్లాలకు నిధులు తరలించారు. వీటితో పాటు సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.279.43 కోట్లు, మైనింగ్‌కు శాఖకు రూ.5.23 కోట్ల వరకు ఈ డీఎంఎఫ్‌టీ నిధులను మళ్లించారు. ఇలా దారి మళ్లించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసే అంశంపై ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు సమాచారం.

బకాయిలు రాబట్టడంపై దృష్టి..

తెలంగాణ వచ్చినప్పుడు సింగరేణికి రూ.3,540 కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్ ఉండేది. అయితే లాభాల్లో ఉన్న సంస్థ ఈ పదేళ్లలో నష్టాల్లో కూరుకుపోయింది. సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో 90 శాతం థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకే సరఫరా చేస్తున్నారు. వీటిలో అత్యధికంగా జెన్‌కోకు బొగ్గును పంపిస్తున్నారు. జెన్‌కో నుంచి సుమారు రూ.19 వేల కోట్లు, ఇతర సంస్థల నుంచి మరో రూ.8 వేల కోట్ల వరకు సింగరేణికి బకాయిలు ఉన్నట్లు సమాచారం. సుమారు రూ.5వేల కోట్ల వరకు సంస్థ అప్పులు చేసిందని కార్మిక వర్గం ఆరోపిస్తోంది. ప్రస్తుతం బకాయిలు రాబట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులతో చర్చలు జరిపారు. సింగరేణి సీఎండీగా సుదీర్ఘకాలం పాటు పనిచేసిన శ్రీధర్ హయాంలో అవతవకలు జరిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. శ్రీధర్‌పై బదిలీ వేటుతో సింగరేణిపై సర్కారు ప్రత్యేక దృష్టి పెట్టిందని కార్మికులు భావిస్తున్నారు.

12 ఎంపీ సీట్లు గెలవాలి



సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బిల్ట్ ప్రతినిధులు, చిత్రంలో సీఎస్ శాంతికుమారి

(మొదటిపేజీ తరువాయి)

నేతలకు సూచించారు. కాగా, తాను గత ముఖ్యమంత్రిలా కాదని, ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటానని రేవంత్ అన్నారు. ఈ నెల 26 తర్వాత.. ఎమ్మెల్యేలను కలిసేందుకు వారంలో మూడు రోజులు ప్రత్యేకంగా కేటాయించుకుంటానని తెలిపారు. ఆయా రోజుల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సచివాలయంలో ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటానన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేస్తానని స్పష్టం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి బాధ్యతలను ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు చూస్తారని చెప్పారు.

సంక్రాంతి తరువాత ఇందిరమ్మ కమిటీలు..

ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సంక్రాంతి పండుగ తరువాత ఇందిరమ్మ కమిటీలను వేస్తామని, ఆ కమిటీల్లో పార్టీ కార్యకర్తలనూ భాగస్వాములను చేయాలని సీఎం సూచించినట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి పనులు చేయిస్తానంటూ డబ్బులు తీసుకోవడం, అవినీతికి పాల్పడడం వంటి వాటిని సహించేది లేదని, ఈ మేరకు పార్టీ నేతలకు స్పష్టమైన సంకేతాలు ఇవ్వాలని కూడా చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే చర్యలను ఉపేక్షించబోనని రేవంత్ స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ సమీక్షలో మంత్రులు దామోదర రాజనర్సింహ, సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ పాల్గొన్నారు. మిగిలిన ఐదు జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలతో సీఎం మంగళవారం సమీక్ష నిర్వహించనున్నారు.

తెలంగాణలో కొత్త ప్లాంట్లపై
కోకాకోలా ఆసక్తి!

రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో పాలుపంచుకునేందుకు కూల్ డ్రింక్స్ తయారు చేసే హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ (హెచ్‌సీసీబీ) ముందుకొచ్చింది. హెచ్‌సీసీబీ పబ్లిక్ అఫైర్స్ చీఫ్ హిమాన్షు ప్రియదర్శిని, కంపెనీ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇప్పటివరకు కోకాకోలా రూ. 3 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని బండ తిమ్మాపూర్‌లో ఈ కంపెనీ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ బాట్లింగ్ నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులతో పాటు సామాజిక అభివృద్ధిలో తమ కంపెనీ భాగస్వామ్యమవుతుందని, అందుకు తగినట్లుగా ప్రాజెక్టులను విస్తరిస్తామని కంపెనీ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రికి వివరించింది. పెట్టుబడులకు రక్షణ కల్పించటంతోపాటు పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి వారికి భరోసా ఇచ్చారు. కంపెనీల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానం అమల్లో ఉంటుందని అన్నారు.

అన్నా...అని పిలువగానే ఆగిన సీఎం

- ఇంటి వద్ద కారు దిగి వచ్చి విజ్ఞప్తుల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తన నిరాడంబరతను చాటుకున్నారు. అన్నా అని పిలువగానే కారు దిగివచ్చి మరీ విజ్ఞప్తులను స్వీకరించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం ఇంటి వద్దకు సోమవారం ఉదయం కొందరు వచ్చారు. ఆయన ఇంటివైపు వెళ్లేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వెళ్లనివ్వలేదు. దీంతో విజ్ఞాపన పత్రాలతో వచ్చిన కొందరు మహిళలు, మరికొందరు సీఎం ఇంటి సమీపంలో వేచి ఉన్నారు. సచివాలయానికి సీఎం కాన్వాయ్ వెళ్తుండగా.. అన్నా అంటూ పిలిచారు. అంతే.. కాన్వాయ్‌ని ఆపమని చెప్పారు సీఎం. కారు దిగి భద్రతను పక్కన పెట్టి మరీ అక్కడున్న మహిళలు, మరికొందరిని కలిసి విజ్ఞాపన పత్రాలను తీసుకున్నారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. పలువురితో కరచాలనం చేశారు. దీంతో అక్కడున్న వారు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. పక్క భవనంపై నుంచి ఈ దృశ్యాలను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది పెద్దఎత్తున వైరల్ అవుతోంది. 'ఇది కదా తెలంగాణ స్వేచ్ఛ' అని, 'పిలిస్తే పలికే సీఎం' అంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు పోస్టులు చేస్తున్నారు.

బిల్ట్ మిల్లును పునరుద్ధరించాలి

- తెరిపించే ప్రక్రియను వేగవంతం చేయండి
- ఫిన్ క్వెస్ట్, ఐటీసీ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కమలాపురంలో బల్లాపూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (బిల్ట్) కంపెనీని పునరుద్ధరించాలని సీఎం రేవంత్ సూచించారు. వస్త్రాల తయారీకి ఉపయోగించే కలప గుజ్జు తయారయ్యే ఈ మిల్లు 2014లో మూతపడిందని, దీంతో 750 కార్మిక కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని, వీరందరికీ ఉపాధి కల్పించటంతో పాటు స్థానికంగా ఉద్యోగ కల్పనకు వీలుగా మిల్లును పునఃప్రారంభించాలని సూచించారు. కంపెనీ ఎండీ హార్దిక్ పటేల్, ఐటీసీ పేపర్ బోర్డ్స్ డివిజన్ సీఈవో వాదిరాజ్ కులకర్ణితో పాటు సంబంధిత అధికారులతో సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఫ్యాక్టరీని పునరుద్ధరించాలనే ఆలోచనను వారితో పంచుకున్నారు. ప్రభుత్వం తరఫున తీసుకోవాల్సిన చర్యలు, సాధ్యాసాధ్యాలను చర్చించారు. మిల్లును తెరిపించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఫిన్‌క్వెస్ట్ బృందాన్ని కోరారు. బిల్ట్ ఆస్తులను కొనుగోలు చేసేందుకు ఐటీసీ కంపెనీ ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో... ఫిన్ క్వెస్ట్ కంపెనీ ఐటీసీతో చర్చల ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం సూచించారు. బిల్ట్ మిల్లును పునరుద్ధరించే ప్రక్రియలో ఐటీసీకి అన్నివిధాలా ప్రభుత్వ సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఐటీసీ చేపట్టిన ప్రాజెక్టులు, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపైనా చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంఓ అధికారులు, ములుగు కలెక్టర్ పాల్గొన్నారు. కాగా గత ప్రభుత్వం 2015, 2018లో ప్రోత్సాహకాలను పొడిగించి, మూతపడ్డ ఈ యూనిట్‌ను పునరుద్ధరించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ప్రస్తుతం బిల్ట్ కంపెనీ ఆస్తులు ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధీనంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

లబ్ధిదారుల ఎంపికకు
సబ్‌కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలన చేపడతామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వంపై కారుకూతలు కూస్తే.. ఊరుకునేది లేదని, మాజీ మంత్రులు అని కూడా చూడబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే బీఆర్ఎస్ మాజీ మంత్రులుపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కాగా, 32 మెడికల్ కాలేజీలకు బదులు 32 యూట్యూబ్ చానళ్లు పెడితే ఎన్నికల్లో తామే గెలిచేవాళ్లమంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ తప్పుబట్టారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేయడమే కాకుండా పూర్తిగా దివాలా తీయించారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ తాము శ్వేతపత్రాలు విడుదల చేస్తే.. బీఆర్ఎస్ వాళ్లు స్వేద పత్రాలు విడుదల చేశారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి ఇచ్చిందా? అని ప్రశ్నించారు. తాము మాత్రం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేశామని తెలిపారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తుంటే ప్రతిపక్ష నేతలు ఆటోవాళ్లను రెచ్చగొట్టి ధర్నాలు చేయిస్తున్నారని మండిపడ్డారు.

టీఎస్‌పీఎస్సీ కేసులో మరిన్ని అరెస్టులు తప్పవు

- ఎవరి పాత్ర ఎంతనే దానిపై లోతుగా దర్యాప్తు
- మిస్సింగ్ లింక్స్‌పై దృష్టిపెట్టాం: జాయింట్ సీపీ

హైదరాబాద్‌సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని సీసీఎస్ జాయింట్ కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఇప్పటికే సేకరించిన ఆధారాలు, సమాచారంతోపాటు ఈ కేసులో మరికొన్ని విషయాలు తేలాల్సి ఉందన్నారు. ఆయా అంశాల గురించి కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు 109 మంది నిందితులను అరెస్టు చేశామని వివరించారు. మరికొంత మందిని కూడా అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు. టీఎస్‌పీఎస్సీ కస్టోడియన్ శంకర్ లక్ష్మిని గతంలోనే విచారించినప్పటికీ... కేసులో కొన్ని మిస్సింగ్ లింక్స్‌ను పరిశీలించే పనిలో సిబ్బంది ఉన్నారన్నారు. ఈ కేసులో ఎవరి పాత్ర ఎంత ఉందనేది కూడా గుర్తించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం విచారణ సాగుతోందని.. త్వరలోనే మీడియాకు మరికొన్ని విషాయాలను వెల్లడిస్తామని రంగనాథ్ వెల్లడించారు.

మళ్లీ ప్రత్యేక శాఖగా హౌసింగ్!?

ఆర్ అండ్ బీలో విలీనం చేసిన గత సర్కారు.. విడిగా పటిష్ఠం చేయాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం

- ఇతర శాఖలకు వెళ్లిన సిబ్బంది వెనక్కు



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మళ్లీ ప్రత్యేకశాఖగా మారనుందా.. అంటే అవుననే సమాధానమే వస్తోంది. గత సర్కారు ఈ శాఖను రోడ్లు, భవనాల శాఖలో విలీనం చేసింది. అప్పటి నుంచి హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ఆర్ అండ్ బీలో ఒక భాగంగా మారింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని పకడ్బందీగా అమలుచేయాలనే ఆలోచనతో ఆ శాఖను ఆర్ అండ్ బీ నుంచి విడదీసి పటిష్ఠం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. అధికారంలోకి వస్తే అర్హులైన ప్రతీవారికి ఇంటిని నిర్మించుకునేందుకు(స్థలం లేని వారికి స్థలం, ఉన్న వారికి ఆర్థిక సాయం) రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని అమలుచేసేందుకు అవసరమైన దరఖాస్తులను ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించింది. కాగా గత బీఆర్ఎస్ సర్కారు గృహ నిర్మాణ శాఖలో కొత్త కార్యక్రమాలు లేవని, బలహీనవర్గాల గృహ నిర్మాణాలను కూడా ఇతర శాఖలు చేపడుతున్నాయనే కారణం చూపుతూ ఆ శాఖను రోడ్లు, భవనాల శాఖలో విలీనం చేసింది. శాఖకు చెందిన ఆస్తులు, అప్పులు, సిబ్బంది సహా అప్పటికి ఆ శాఖ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు, తదితర వ్యవహారాలన్నిటినీ ఆర్ అండ్ బీకి అప్పగించింది. హౌసింగ్ శాఖలో భాగమైన హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ, దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్(దిల్)ను కూడా ఆర్ అండ్ బీలో విలీనం చేసేసింది. విలీనానికి ముందు ఆ శాఖలో 500 మంది వరకు ఉద్యోగులుండేవారు. వారిని విలీనానికి ముందు నుంచే గత సర్కారు ఇతర డిపార్ట్‌మెంట్‌లకు బదిలీ(డిప్యూటేషన్) చేసింది. దాంతో గృహ నిర్మాణ శాఖ రాష్ట్ర కార్యాలయం కేవలం 50 మందితోనే కార్యకలాపాలను సాగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

సెక్రటరీ సహా అధికారుల నియామకం

రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం క్షేత్రస్థాయి ఉద్యోగుల నుంచి ఉన్నతాధికారుల వరకు అవసరమైన సిబ్బందిని భర్తీ చేసి హౌసింగ్ శాఖను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు గృహ నిర్మాణ పథకాలను హౌసింగ్ శాఖ ద్వారానే అమలుచేశాయి. హౌసింగ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి కేంద్రం నుంచి, ఇతర మార్గాల్లో రుణాలను సేకరించేందుకు ఆ కార్పొరేషన్‌ను వినియోగించుకున్నారు. అయితే ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ సర్కారు అమలుచేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పలు అవినీతి, అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. అటువంటి ఆరోపణలు రాకుండా పథకాన్ని అమలుచేయాలంటే శాఖ ప్రత్యేకంగా ఉండడంతో పాటు అవసరమైన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రత్యేకంగా ఉండాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే గృహనిర్మాణ శాఖను ఆర్ అండ్ బీ నుంచి విడదీయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు సమాచారం. అనంతరం అన్ని శాఖలకు మాదిరిగానే ఒక సెక్రటరీ సహా ఆ పదవికి అనుబంధంగా ఉండే పోస్టులు, హౌసింగ్ కార్పొరేషన్‌కు ఎండీ, జనరల్ మేనేజర్ సహా పోస్టులన్నిటిని పూర్తిస్థాయిలో భర్తీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. వీటితో పాటు గతంలో హౌసింగ్ శాఖకు అనుబంధంగా ఉన్న దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్ లిమిటెడ్, రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డులను తిరిగి ఈ శాఖ పరిధిలోకే తీసుకురావాలని నిర్ణయించినట్టు సమాచారం.

800 మంది ఏఈలు అవసరం

ఇందిరమ్మ ఇల్లు పథకం అమలుకు దాదాపు 800 మంది వరకు ఏఈలు అవసరం అని, వీరితో పాటు డీఈలు, ఈఈలు కూడా అవసరమని శాఖ ప్రభుత్వానికి నివేదించినట్టు తెలుస్తోంది.. ఈ నేపథ్యంలో ఈ శాఖ నుంచి బదిలీపై వెళ్లి ఇతర శాఖల్లో పనిచేస్తున్న వారందరిని వెనక్కి పిలిపించాలని ప్రభుత్వం శాఖ ఉన్నతాధికారులకు ఆదేశించినట్టు సమాచారం. సొంత ఉద్యోగులు వచ్చిన తరువాత ఇంకా అవసరమైతే ఆమేరకు ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై గృహనిర్మాణ శాఖకు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లో అమలుచేస్తామని చెప్పింది. ఈ నేపథ్యంలో వందరోజుల్లో హౌసింగ్ శాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం సాధ్యమవుతుందా లేదా అన్న దానిపై ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో పటిష్ఠం అయ్యే వరకు హౌసింగ్‌ను ఆర్ అండ్ బీలోనే ఉంచి, పథకాన్ని కూడా ఆ శాఖ ద్వారానే అమలుచేస్తే ఎలా ఉంటుందన్నదానిపైనా నిపుణులతో చర్చిస్తున్నట్టు సమాచారం. మొత్తంగా ప్రభుత్వ పాలన, వివిధ శాఖలపై గత సర్కారు అవలంబించిన విధానంతోనే ప్రస్తుత ప్రభుత్వానికి సంకట పరిస్థితులు ఏర్పడ్డాయనే ప్రచారం జరుగుతోంది.

ఐటీఐఆర్ రద్దుకు బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణం

- డీపీఆర్ ఇవ్వాలని కోరినా స్పందించలేదు
- ఆర్టీఐ దరఖాస్తుకు కేంద్రం సమాధానం

హైదరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): యాభై వేల ఎకరాల్లో 68 లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన భారీ ప్రాజెక్టు 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటీఐఆర్)'. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలో ఐటీ రంగం రూపురేఖలే మారిపోయేవి. 2012లో కేంద్రంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన ఈ ప్రాజెక్టును.. ఆ తర్వాత వచ్చిన బీజేపీ ప్రభుత్వం రద్దు చేసింది. దీనికి కేంద్ర ప్రభుత్వమే కారణమని రాష్ట్రంలోని గత కేసీఆర్ ప్రభుత్వం తప్పుపడుతూ వచ్చింది. ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా కేంద్రం స్పందించలేదని మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ అనేక మార్లు చెప్పారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సోమవారం అధికారికంగా బదులిచ్చింది. ఐటీఐఆర్ ప్రాజెక్టు రద్దుకు రాష్ట్రంలోని గత ప్రభుత్వమే కారణమని స్పష్టం చేసింది. దీనిపై ఆర్టీఐ కార్యకర్త రవికుమార్ చేసిన దరఖాస్తుకు స్పందిస్తూ కేంద్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సమాధానం ఇచ్చింది. ఏప్రిల్ 7, 2016, జనవరి 11, 2017లో రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం ఐటీఐఆర్‌పై సమావేశం నిర్వహించింది. రైల్వే, కేంద్ర రహదారుల శాఖ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖల ప్రతినిధులతో పాటు తెలంగాణ ఐటీ మంత్రి, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. అయితే తర్వాత తాము కోరిన విధంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రాష్ట్ర ప్రభుత్వం అందించలేదని కేంద్ర ఐటీ శాఖ తెలిపింది. పలుమార్లు గుర్తుచేసినా అప్పటి స్పందన లేకపోవడంతో దాని స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కోరిన ఇతర ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చామని కేంద్ర ఐటీ శాఖ స్పష్టం చేసింది.

జీరో టికెట్ తీసుకోకుంటే 500 జరిమానా

» ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి తప్పకుండా ఒరిజినల్ గుర్తింపు కార్డే చూపించాలి

» టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పష్టీకరణ

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం కింద మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వినియోగించుకోవాలంటే ఒరిజినల్ గుర్తింపు కార్డు తప్పనిసరిగా చూపించాల్సిందేనని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. గుర్తింపు కార్డులో ప్రయాణికురాలి ఫొటో, అడ్రస్ స్పష్టంగా కనిపించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసే ఏ ఒరిజినల్ గుర్తింపు కార్డు అయినా సరిపోతుందని అన్నారు. ఒరిజినల్ ఆధార్ కార్డు, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర గుర్తింపు కార్డులు చెల్లుబాటవుతాయని చెప్పారు. పాన్‌కార్డులో అడ్రస్ లేనందున అది ఉచిత ప్రయాణానికి చెల్లుబాటు కాదన్నారు. కొంతమంది ప్రయాణికులు స్మార్ట్ ఫోన్లలో, ఫొటో కాపీలు, కలర్ జిరాక్స్‌లు చూపిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి చర్యలతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని, ప్రయాణ సమయం కూడా పెరుగుతోందని తెలిపారు. ఒరిజినల్ గుర్తింపు కార్డు లేకుంటే డబ్బు చెల్లించి టికెట్ తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఉచితమే కదా.. జీరో టికెట్ ఎందుకు తీసుకోవడం అంటూ సిబ్బందితో కొంతమంది వాదనకు దిగుతున్నారని.. ఇది సరికాదన్నారు. జీరో టికెట్ల జారీ ఆధారంగానే ఆ డబ్బును టీఎస్ఆర్టీసీకి ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుందని తెలిపారు. జీరో టికెట్ లేకుండా ప్రయాణిస్తే.. రూ.500 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ విధిగా టికెట్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శంషాబాద్ భూములు ప్రభుత్వానివే: సుప్రీం కోర్టు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి8(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లో ఆక్రమణలకు గురయిన భూమి ప్రభుత్వానిదేనంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్(హెచ్ఎండీఏ) భూముల్లో కొందరు అక్రమ నిర్మాణాలు చేశారని, అవి తమవేనంటూ తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించారంటూ గతంలో తెలంగాణ హైకోర్టు తీర్పు చెప్పింది. ఆ భూములు ప్రభుత్వానికి చెందుతాయని స్పష్టం చేసింది. శంషాబాద్‌లో ట్రక్ పార్కు ఏర్పాటు కోసం ఇరవై ఏళ్ల క్రితం హెచ్ఎండీఏ 181 ఎకరాలను సేకరించగా, అందులో సుమారు 50 ఎకరాల వరకు ఆక్రమణలకు గురయింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఆ వ్యక్తులు సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. వాదనలు విన్న సర్వోన్నత న్యాయస్థానం ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేసి, హెచ్ఎండీఏకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. సీఎం రేవంత్ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎం.దానకిశోర్ పర్యవేక్షణలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు సుప్రీంకోర్టుకు హాజరై భూముల వివరాలను అందజేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గీ, హెచ్ఎండీఏ తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థలూథ్రా, సుప్రీంకోర్టు అడ్వకేట్ ఆన్ రికార్డ్ దేవీన సక్సేనా వాదనలు వినిపించారు.

మోడల్ స్కూల్ ప్రవేశాల షెడ్యూల్ విడుదల

మోడల్ స్కూళ్లల్లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలయింది. విద్యార్థుల నుంచి ఈనెల 12 నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మోడల్ స్కూల్ డైరెక్టర్ సోమవారం జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. 6వ తరగతిలో ప్రవేశాలకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10 తరగతుల్లో ప్రవేశాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహించనున్నారు.మరోవైపు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్)లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును అధికారులు పొడిగించారు. ఈనెల 9వ తేదీతో గడువు ముగియనుండగా, 11వ తేదీ వరకు పొడిగిస్తూ సోమవారం నిర్ణయం తీసుకున్నారు.

హెచ్‌సీయూలో దూరవిద్య డిప్లొమా కోర్సులు

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ), సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్ ఆధ్వర్యంలో ఏడాది వ్యవధి గల డిప్లొమా కోర్సులు అందుబాటులోకి రానున్నాయని వర్సిటీ అధికారులు తెలిపారు. బిజినెస్ మేనేజ్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, సైబర్ లా, ఫోరెన్సిక్ సైన్స్, లైబ్రరీ ఆటోమేషన్, నెట్‌వర్కింగ్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్, ఇన్‌ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోల్, కమ్యూనిటీ ఐ హెల్త్.. డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. డిగ్రీ విద్యార్థులకు అదనపు అర్హతగా ఉండే ఈ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఫిబ్రవరి 29 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఈ నెల 18లోగా రూ.930 కోట్ల బకాయిలు చెల్లించాలి

» లేకుంటే రాష్ట్రానికి కరెంట్ కట్!.. ఎన్టీపీసీ అల్టిమేటం

హైదరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ సంస్థలు చెల్లించాల్సిన రూ.930 కోట్ల బకాయిలను ఈ నెల 18లోగా చెల్లించని పక్షంలో రాష్ట్రానికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్టీపీసీ అల్టిమేటం జారీ చేసింది. దీంతో గడువులోగా బకాయిలు చెల్లించేందుకు తెలంగాణ ట్రాన్స్‌కో యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. బకాయిల చెల్లింపులో విఫలమైతే ఎన్టీపీసీ నుంచి రాష్ట్రానికి విద్యుత్ సరఫరా ఈ నెల 18వ తేదీ అర్ధరాత్రి 12 గంటల నుంచి నిలిచిపోనుంది. విద్యుత్ ఉత్పత్తి కంపెనీల నుంచి కొన్న విద్యుత్ బిల్లులను నిర్దేశిత గడువులోగా చెల్లించడంలో విఫలమైతే ఆయా రాష్ట్రాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసే అధికారాన్ని కట్టబెడుతూ రెండేళ్ల క్రితం లేట్ పేమెంట్ సర్‌చార్జ్ (ఎల్‌పీఎస్) రూల్స్‌ను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) తీవ్ర ఆర్థిక నష్టాల్లో ఉండడంతో విద్యుత్ ఉత్పత్తి కంపెనీలకు సకాలంలో బిల్లులు చెల్లించలేక చేతులెత్తేస్తున్నాయి. రాష్ట్ర విద్యుత్ సంస్థలు కేంద్ర సంస్థల నుంచి 3,186 మెగావాట్ల కరెంట్‌ను కొంటుండగా.. ఇందుకు ప్రతి నెలా రూ.1,587 కోట్ల దాకా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. అయితే ప్రతి నెలా డిస్కమ్‌ల లోటు రూ.1,386 కోట్లుగా ఉంది. డిస్కమ్‌ల నష్టాలు 2014-15 నుంచి 2022-23 వరకు రూ.50,275 కోట్ల దాకా ఉండగా.. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రూ.43,770 కోట్లున్నాయి.

సీఎస్, డీజీపీలకు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

» బీటెక్ విద్యార్థి రేణుశ్రీ ఆత్మహత్యపై నివేదిక ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గీతం యూనివర్సిటీ బీటెక్ విద్యార్థిని రేణుశ్రీ ఆత్మహత్యపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ).. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు డీజీపీ రవిగుప్తాకు నోటీసులు జారీ చేసింది. విద్యార్థి ఆత్మహత్యపై నాలుగు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని వారిని ఆదేశించింది. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఈ కేసును సుమోటాగా స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్సీ.. పోలీసుల దర్యాప్తు, ఘటన బాధ్యులైన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు వంటి వివరాలు నివేదికలో తెలపాలని పేర్కొంది. ఈనెల 5వ తేదీన రేణుశ్రీ వర్సిటీ బిల్డింగు 5వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే.



కేవైసీ కష్టాలు

» ఉదయం 4 గంటల నుంచే జనం బారులు

» తాండూరు తపాల కార్యాలయం వద్ద తోపులాట

తాండూరు, జనవరి 8: రాష్ట్రంలో ఆధార్ కష్టాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు సహా సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ అప్‌డేషన్ తప్పనిసరి కావడంతో చలిని సైతం లెక్క చేయకుండా జనం ఆధార్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఆధార్ కార్డు కేవైసీ కోసం వికారాబాద్ జిల్లా తాండూరు పోస్టాఫీస్ వద్ద ఉదయం 4గంటల నుంచే ప్రజలు బారులు తీరారు. సరిపడా ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో తపాల కార్యాలయానికి జనం ఎగబడటంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

తప్పతాగి ఎన్నారై యాక్సిడెంట్

» ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

» కారు డ్రైవర్‌ను మార్చివేసిన వైనం

» మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి.. సోదరుడి కుమారుడి స్కెచ్

» చాకచక్యంతో పసిగట్టిన పోలీసులు

» ముగ్గురు నిందితులపై కేసు నమోదు



అల్లోల అగ్రజ్‌రెడ్డి

హైదర్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తప్పతాగి రాంగ్‌రూట్‌లో కారును దూసుకుపోనిచ్చిన ఓ ఎన్నారై యాక్సిడెంట్‌కు కారణమైన ఉదంతమిది. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇటీవల పంజాగుట్ట రాణా పరిధిలో ప్రగతి భవన్ ఎదురుగా ఉన్న బ్యారికేడ్లను ఢీకొన్న కేసు మాదిరిగానే.. ఇక్కడ కూడా సదరు ఎన్నారై డ్రైవర్‌ను మార్చి చల్లగా తప్పించుకోజూశారు. అయితే.. పోలీసులు చాకచక్యంతో వ్యవహరించడంతో అసలు గుట్టురట్టయింది. ఈ కేసులో ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోదరుడి కుమారుడు అల్లోల అగ్రజ్‌రెడ్డి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. సెలవుపై ఇటీవల నగరానికి వచ్చారు. శనివారం గచ్చిబౌలిలోని ఓ పబ్‌లో తన స్నేహితులు కార్తీక్, తేజతో కలిసి మందుపార్టీ చేసుకున్నారు. ముగ్గురూ మద్యం సేవించి ఉండడంతో.. రాత్రి ఒంటిగంట సమయంలో ఓ పార్ట్‌టైమ్ డ్రైవర్‌ను మాట్లాడుకుని, కారు (ఏపీ07ఈ3839)లో కూకట్‌పల్లికి బయలుదేరారు. కొంతదూరం వెళ్లాక.. తాను కారు నడుపుతానంటూ అగ్రజ్‌రెడ్డి ముందుకు వచ్చి, పార్ట్‌టైమ్ డ్రైవర్‌ను వెనకసీట్లో కూర్చోబెట్టారు. జేఎన్‌టీయూ రోడ్డులో రాంగ్‌రూట్లో వెళ్లారు. అదే వేగంతో.. అటుగా ద్విచక్రవాహనంపై వస్తున్న కూకట్‌పల్లి జయనగర్‌లో ఉంటున్న రాజస్థానీయులు బన్వరీలాల్, ధురుచంద్‌లను ఢీకొన్నారు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలైన ధురుచంద్ పరిస్థితి విషమంగా ఉండగా.. బన్వరీలాల్‌కు కాలు విరిగింది. తుంటి ఎముక ఫ్రాక్చర్ అయ్యింది. అదే సమయంలో రాత్రి విధుల్లో ఉన్న ఎస్సై శ్రీనివాసులు అటుగా వెళ్తూ.. రోడ్డు ప్రమాదాన్ని గుర్తించారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి.. పారిపోయేందుకు యత్నిస్తున్న అగ్రజ్‌రెడ్డి, కార్తీక్, తేజలను అదుపులోకి తీసుకున్నారు. బ్రీత్ అనలైజర్లలో వారు మద్యం సేవించినట్లు తేలడంతో.. రాణాకు తీసుకెళ్లారు. అక్కడ అగ్రజ్‌రెడ్డి, కార్తీక్ కలిసి హైడ్రామాకు తెరతీశారు. కారు తన పేరిట ఉండడంతో.. ప్రమాదానికి తానే కారణమంటూ కార్తీక్ పోలీసులకు వాంగ్మూలమిచ్చాడు. ఇటీవల పంజాగుట్ట కేసును దృష్టిలో పెట్టుకున్న పోలీసులు.. సీసీకెమెరాల ఫుటేజీ తెప్పించి నిర్ధారిస్తామంటూ నిందితులకు చెప్పారు. దీంతో కార్తీక్ ప్రమాదానికి అగ్రజ్‌రెడ్డి కారణమని చెప్పారు. నిందితులపై ఐపీసీలోని సెక్షన్ 185(ఏ), మోటారు వాహన(ఎంవీ) చట్టంలోని 337, 119, 177 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కేపీహెచ్‌బీ పోలీసులు వివరించారు. సీసీటీవీ ఫుటేజీలోనూ అగ్రజ్‌రెడ్డి కారును నడిపినట్లు తేలిందన్నారు. కాగా.. ప్రమాదంలో గాయపడ్డ యువకుల పరిస్థితి విషమంగా ఉందని, పేద కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుల బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదంలో పెద్ద పులులు!



ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దు అడవుల్లో రెండ్రోజుల వ్యవధిలో 2 పెద్దపులుల మృతి

» గత 8 నెలల్లో మొత్తంగా 9 పులుల మృత్యువాత

» అన్నీ ఆడపులులే.. మహారాష్ట్ర నుంచి సంతానోత్పత్తి కోసం రాక

» మృతికి ఇలాకాపై ఆధిపత్య పోరే కారణం అంటున్న అధికారులు

» దీనిపై విమర్శలు..

» పులుల రాకపై స్థానికుల ఫిర్యాదు.. పట్టని అధికారులు

» నెపాన్ని 'ఆధిపత్య పోరు' ఖాతాలో వేసి చేతులు దులుపుకొంటున్న వైనం



పెద్ద పులి కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, జనవరి 8: ఆసిఫాబాద్ జిల్లాకు సరిహద్దునే ఉన్న బల్లార్షా-చంద్రాపూర్-అహిరి అడవుల్లో పెద్ద పులుల భద్రతపై ఆందోళనలు నెలకొన్నాయి. కొన్నాళ్లుగా ఇక్కడ పులులు మృత్యువాతపడుతుండటం అనుమానాలకు తావిస్తోంది. రెండ్రోజుల్లో రెండు పెద్ద పులులు మృతిచెందడం చర్చనీయాంశమవుతోంది. శనివారం రాత్రి కాగజ్‌నగర్‌కు సమీపంలోని దరిగాం అటవీప్రాంతంలో ఎస్-15 అనే రెండేళ్ల వయసున్న పులి.. సోమవారం ఎస్-9 అనే ఆరేళ్ల పులి మృతి చెంది ఉండటాన్ని అధికారులు కనుగొన్నారు. గత ఎనిమిది నెలల్లో ఆసిఫాబాద్, మహారాష్ట్ర సరిహద్దుల్లోని బల్లార్షా-చంద్రాపూర్-అహిరి అడవుల్లో తొమ్మిది పెద్ద పులులు ఇదే తరహాలో మృతిచెందాయి. చనిపోయినవన్నీ కూడా ఆడపులులే. సంచరిస్తున్న ఇలాకా మీద ఆడపులల మధ్య ఆధిపత్య పోరు, ఫలితంగా పరస్పరం తలపడటమే మృతికి కారణమని అధికారులు చెబుతున్నారు. ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేకుండా వారు ఈ నిర్ధారణకు అనుమానాలకు తావిస్తోంది. పైగా ఇలాకా విషయంలో మగ పులుల మధ్యే ఆధిపత్య పోరు ఉంటుందని, ఆడపులుల మధ్య ఉండదని వన్యప్రాణ నిపుణులు చెబుతుండటం గమనార్హం. ఒక ప్రాంతంలో సంచరిస్తున్న మగపులి.. అక్కడికి మరో మగపులి వస్తే.. దానితో తలపడుతుందని.. ఈ పోరు కొన్నిసార్లు రెండిట్లో ఒకదాని మృతికి కారణమూ అవుతుందని అంటున్నారు. ఆడపులులు మాత్రం అరుదైన సందర్భాల్లో తమ పిల్లలను కాపాడుకునేందుకే మరో పులితో తలపడుతుంటాయని, వాటి మధ్య ఆధిపత్య పోరు ఉండదని స్పష్టం చేస్తున్నారు. రెండు పులుల కళేబరాల అవశేషాలను పరీక్షల కోసం అధికారులు ల్యాబ్‌కు పంపారు.

విషాహారంతోనేనని అనుమానాలు

ఆసిఫాబాద్ జిల్లా కడంబా అటవీప్రాంతం పులుల ఆవాసానికి అనుకూలంగా ఉంటుంది. ఫలితంగా ఇక్కడికి మహారాష్ట్ర నుంచి గర్భం దాల్చడానికి ఆడ పులులు ఎక్కువగా వస్తుంటాయి. పిల్లలను మగపులుల బారి నుంచి రక్షించుకునేందుకు అనువైన భౌగోళిక అనుకూలతలు ఉండటంతో ఇక్కడ సంతానోత్పత్తి చేసేందుకు ఇష్టపడతాయి. జల వనరులు సహజసిద్ధమైన రాతి గుహలు, వెదురు, ఆహారం కోసం లెక్కలు మిక్కిలి శాకాహార జంతువులు ఉండటం కడంబా రిజర్వు ఫారెస్టులో పులుల సంఖ్య పెరిగేందుకు దోహదపడుతోంది. 2015 నుంచి మహారాష్ట్ర నుంచి ఇక్కడికి పెద్ద పులుల రాక పెరిగింది. అప్పట్లో ఫాల్గుణ అనే పెద్దపులి కడంబా అటవీ ప్రాంతంలోని రాతి గుహల్లో తొలిసారిగా సంతానోత్పత్తి చేసింది. తర్వాత ఎస్-1 అనే సిరీస్‌లోని మరో ఆడ పులి కూడా తడోబా నుంచి ఇక్కడికి వలస వచ్చింది. ప్రస్తుతం ఈ రెండిటి సంతానమే ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు పొరుగునే ఉన్న బల్లార్షా ప్రాంతంలోనూ సంచరిస్తున్నాయి. ఇటీవల ఒక ఆడ పులి తన రెండు పిల్లలతో కలిసి తరుచూ ఆవాస ప్రాంతాల సమీపంలోకి వచ్చి పోతుండటం, పశువులపై దాడి చేస్తుండటం వంటి ఘటనలు జరిగాయి. ఈ క్రమంలో దరిగాం గ్రామానికి చెందిన పశువుల కాపర్లు, రైతులు పులుల సంచారంపై ఇటీవల అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అటవీశాఖ సిబ్బంది.. పులల జోలికి వెళ్లొద్దని అక్కడి జనాలకు చెప్పి చేతులు దులుపుకొన్నారు. అయితే అధికారులు తమ గ్రామాన్ని ఖాళీ చేయిస్తారేమోనన్న అనుమానంతో పెద్దపులుల సంచారాన్ని నిరోధించేందుకు అక్కడి జనమే పులలపై విష ప్రయోగం చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. పైగా పేరు చెప్పేందుకు సిద్ధపడని ఓ అధికారి ఇదే విషయాన్ని వెల్లడించడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ప్రస్తుతం ఆసిఫాబాద్ జిల్లాలో ఎనిమిది పెద్దపులులు సంచరిస్తున్నట్టు అధికారులు అంచనా వేస్తుండగా 2021లో వేసిన అంచనా ప్రకారం 16 పెద్దపులులు ఇక్కడే పుట్టి పెరిగినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఎనిమిది పులుల్లో ఇటీవల కాలంలోనే 3 మృతి చెందడంతో క్రమంగా కడంబా అటవీప్రాంతం పెద్ద పులులకు ప్రాణసంకటంగా మారుతోంది. ఇక్కడ పులుల సంరక్షణ కోసం ప్రత్యేక బ్రీడింగ్ కేంద్రం ప్రకటించాలన్న ప్రతిపాదనలకు మోక్షం లభించటం లేదు.

ఆచరణలోకి రాని పులుల సంరక్షణ ప్రాజెక్టు

ఆసిఫాబాద్ జిల్లాలో పెద్ద పులుల సంఖ్యను పెంచేందుకుగాను నిర్ణయించిన పులుల సంరక్షణ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడం లేదు. కడంబా అటవీప్రాంతాన్ని ప్రత్యేక జోన్‌గా ప్రకటించి పులుల సంరక్షణతోపాటు శాకాహార జంతువుల సంఖ్యను పెంచేందుకు పచ్చగడ్డి మైదానాల ఏర్పాటు, నీటి కుంటల నిర్మాణం, పెద్ద పులుల సంరక్షణ, పునరుత్పత్తి సదుపాయాల వంటి అంశాలతో జోగురామన్న మంత్రిగా ఉన్నప్పుడు ప్రాజెక్టు టైగర్ పేరిట కార్యచరణ తయారు చేశారు. ఇది కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో శిక్షణ పొందిన ప్రత్యేక 50మంది వన్యప్రాణి నిపుణులతో స్పెషల్ టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేయాలని తలపెట్టారు. కానీ ప్రభుత్వం నిధులు సమకూర్చక పోవటంతో ఈ ప్రతిపాదనలు అమల్లోకి రాలేదు.

మంత్రి పేషీలోనే కొలువు?

» ఉద్యోగానికి రాకున్నా 'హాజరు'.. దానితో జెన్‌కోలో జీతం

» ఆరున్నరేళ్లలో మొత్తం రూ.54 లక్షల దాకా వేతనం

» మాజీ సీఎం మేనల్లుడి భార్య ఉద్యోగంలో కొత్త కోణం

» ఆ కుటుంబంలోని మరో మహిళకూ ట్రాన్స్‌కో కొలువు!

హైదరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాతపరీక్షలకు హాజరు కాకపోయినా.. అసలు ఏ పరీక్షా రాయకున్నా అడ్డదారిలో జెన్‌కోలో ఉద్యోగం పొందిన మహిళ ఉదంతంలో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. మాజీ సీఎం మేనల్లుడి భార్య అయిన ఈమెకు 2017 జూలై 29న జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) ఉద్యోగం ఇవ్వగా.. ఏకంగా ఆరున్నరేళ్ల విద్యుత్ శాఖ మంత్రి పేషీలో డిప్యూటేషన్‌పై పనిచేసినట్లు చూపిన వైనం తాజాగా తేలింది. అయితే, ఆరున్నరేళ్లలో ఒక్క రోజు కూడా ఆమె ఉద్యోగానికి రాకపోయినా.. ఉద్యోగం చేసినట్లుగా మంత్రి పేషీ అటెండెన్స్ సర్టిఫికెట్ ఇచ్చింది. దానితో జెన్‌కోలో వేతనం అందుకుంది. ప్రభుత్వం మారగానే ఆమెను రిలీవ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇలా.. అడ్డదారుల్లో కొలువే కాదు విధులకు హాజరు కాకున్నా రూ.54 లక్షల దాకా వేతనం అందుకోవడం గమనార్హం. మాజీ సీఎం మేనల్లుడి భార్య కావడంతో ఆమె జోలికి ఏ అధికారీ వెళ్లలేదు. ఇదేకాక మాజీ సీఎం కుటుంబంలోని సిద్దిపేటకు చెందిన మరో మహిళకు 2017లో ట్రాన్స్‌కోలో ఉద్యోగం ఇచ్చినట్లు తాజాగా బయటపడింది. ఈమెను కాంట్రాక్టు ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ (ఈఏ)గా నియమించి, ఆర్టిజన్ల విలీన క్రమంలో ట్రాన్స్‌కోలోకి తీసుకున్నారు. అనంతరం అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా ఆర్టిజన్ల కోటాలో ఉద్యోగం ఇచ్చారు. కాగా, మాజీ సీఎం కుటుంబానికి చెందిన ఈ ఇద్దరు మహిళలూ బీటెక్ పట్టభద్రులే. వీరి నియామకాలపై పలువురు సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద దరఖాస్తు చేయగా వివరాలు ఇవ్వడానికి అధికారులు నిరాకరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విచారణ చేపట్టాలని కోరుతున్నారు. మరోవైపు ట్రాన్స్‌కో, జెన్‌కో యంత్రాంగం దీనిపై ఇంకా స్పందించలేదు.

రికార్డులు మాయం..

ఓవైపు ఒక్కటొక్కటిగా అక్రమాలు వెలుగులోకి వస్తుండగా.. మరోవైపు ఆ రికార్డులన్నీ అధికారులు మాయం చేసినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. రికార్డులన్నీ దాచి ఉంచాలని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ లిఖితపూర్వక ఆదేశాలివ్వగా.. అవి వచ్చాక యాదాద్రి థర్మల్ కేంద్రంతో పాటు ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందానికి సంబంధించిన రికార్డులు మాయం చేసినట్లు తెలిసింది.

హెచ్ఐవీలో ఐదో స్థానంలో రాష్ట్రం

» తెలంగాణలో 1.59 లక్షల మందికి ఎయిడ్స్

» మహారాష్ట్ర ఫస్ట్.. రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్

» దేశంలో 24.67 లక్షల మంది బాధితులు

» గణాంకాలు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం



హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో లక్షకు పైగా హెచ్ఐవీ కేసులున్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఉంది. మన రాష్ట్రంలో 1.59 లక్షల మంది ఎయిడ్స్ రోగులు ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు సంకల్ప్ బుక్‌లెట్-2023 పేరుతో ఐదో ఎడిషన్ నివేదికను ఇటీవల నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్(న్యాకో), కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా విడుదల చేశాయి. దేశంలో అత్యధిక ఎయిడ్స్ కేసులున్న రాష్ట్రంగా మహారాష్ట్ర నిలిచింది. అక్కడ 3.88 లక్షల మంది హెచ్ఐవీ రోగులున్నారు. ఇక 3.22 లక్షల మందితో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో కర్ణాటక (2.74 లక్షలు), తమిళనాడు(1.65 లక్షలు), తెలంగాణ (1.59 లక్షల మంది), గుజరాత్(లక్ష) ఉన్నట్లు వార్షిక నివేదిక వెల్లడించింది. దేశంలోని హెచ్ఐవీ కేసుల్లో 72 శాతం ఈ ఆరు రాష్ట్రాల్లోనే ఉన్నాయి. ఇక దేశవ్యాప్తంగా 24.67 లక్షల మంది హెచ్ఐవీ రోగులున్నట్లు కేంద్రం వెల్లడించింది. ప్రపంచంలోనే అత్యధిక ఎయిడ్స్ కేసులున్న రెండో దేశంగా ఇండియా నిలిచిందని నివేదిక తెలిపింది.

ఈశాన్య రాష్ట్రాల్లో విజృంభణ..

ఈశాన్య రాష్ట్రాల్లో ఎయిడ్స్ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల్లో కేసులు పెరుగుతున్నట్లు వెల్లడించింది. మరణాల రేటు కంటే కొత్త ఇన్ఫెక్షన్ల రేటు ఎక్కువగా ఉందని పేర్కొంది. మణిపూర్, మిజోరం, నాగాలాండ్‌లో ప్రతీ లక్ష మందిలో 900 మంది హైరిస్క్ గ్రూప్(మహిళా సెక్స్ వర్కర్లు, హిజ్రా/ట్రాన్స్ జెండర్లు, మేల్ హోమోలు, ఇంజెక్షన్ల ద్వారా డ్రగ్స్ తీసుకునేవాళ్ల)లో ఉన్నట్లు తెలిపింది. హెచ్ఐవీ ఎక్కువగా మహిళా సెక్స్ వర్కర్లు, హిజ్రా/ట్రాన్స్ జెండర్లు, మేల్ హోమోలు, ఇంజెక్షన్ల ద్వారా డ్రగ్స్ తీసుకునేవాళ్లలో కనిపిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. జైళ్లలోని ఖైదీల్లో కూడా హెచ్ఐవీ ఇన్ఫెక్షన్ ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. ట్రక్ డ్రైవర్లు, వలసదారులు, హైరిస్క్ వర్గాల నుంచి సాధారణ ప్రజలకు హెచ్ఐవీ వ్యాపిస్తున్నట్లు పేర్కొంది.

వేశ్యల సంఖ్యలో రెండో స్థానంలో ఏపీ..

దేశవ్యాప్తంగా మహిళా సెక్స్ వర్కర్ల గణాంకాలను న్యాకో విడుదల చేసింది. 2022 సమాచారం ప్రకారం భారత్‌లో 9,95,499 మంది మహిళా సెక్స్ వర్కర్లు ఉన్నారు. 1,53,337 మందితో కర్ణాటక తొలి స్థానంలో.. 1,19,367 మందితో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నాయి. ఆ తర్వాత మహారాష్ట్ర (95,351), ఢిల్లీ (88,399), తెలంగాణ(75,381), తమిళనాడు (60,775), మధ్యప్రదేశ్(53,455), ఉత్తరప్రదేశ్ (40,480), అసోం(39,721), గుజరాత్(37,118) ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రతి లక్ష జనాభాకు 450 మంది మహిళా సెక్స్ వర్కర్లు ఉన్నాయి. ఇది దేశంలోనే అత్యధికం. జాతీయ సగటు 73గా ఉంది. ఇక హైరిస్క్ గ్రూపులో ఉన్న డ్రగ్స్ తీసుకునే వారి సంఖ్య పంజాబ్‌లో ఎక్కువగా(45,098 మంది) ఉంది. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్(35,411), ఢిల్లీ(32481) ఉన్నాయి. దేశవ్యాప్తంగా హైరిస్క్ గ్రూప్‌లో 96,193 మంది హిజ్రాలు, 3,51,020 మంది స్వలింగ సంపర్కులు, 2,88,717 మంది మాదక ద్రవ్యాలు తీసుకునే వారు ఉన్నారు.

తెలంగాణలో ఇలా..

తెలంగాణలో గర్భిణుల్లో హెచ్ఐవీ వ్యాప్తి అంచనా 0.18 శాతం, వేశ్యలలో 1.81 శాతం, స్వలింగ సంపర్కులలో 2.07, హిజ్రాలలో 4, మాదక ద్రవ్యాలు తీసుకునే వారిలో 0.40 శాతంగా ఉంది. మన రాష్ట్రంలో ప్రతి లక్షకు 250-325 మంది హైరిస్క్ జనాభా ఉన్నారు. అలాగే మహిళా సెక్స్ వర్కర్లలో 1.65 లక్షల మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించగా.. 206 మందికి పాజిటివ్‌గా తేలింది. ఇక ఏఆర్‌టీ కేంద్రాల్లో ఎయిడ్స్‌కు చికిత్స అందించే విషయంలో మన రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది.

అయినవారే కడతేరుస్తున్నారు..!

» 2023లో రాష్ట్రవ్యాప్తంగా 789 హత్యలు

» ఆస్తి వివాదాలు, మనస్పర్థలతో దారుణాలు

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హత్య కేసులు పెరుగుతున్నాయి. 2022తో పోలిస్తే.. 2023లో వీటి పెరుగుదల 15శాతంగా ఉంది. అయితే.. సుపారీ కిల్లర్ల హత్యల కంటే.. నమ్మినవారు, అయినవారు చేస్తున్న హత్యలే అధికంగా ఉండడం ఆందోళనకర విషయం. ఆస్తికోసమో, ప్రేమ కోసమో, భార్యాభర్తల వివాదంతోనో, పాతకక్షలతో.. క్షణికావేశంలో హత్యలు చేస్తున్నారు. కుటుంబ పరువు తీశారంటూ పెద్దలే కులోన్మాద హత్యలకు పాల్పడుతున్నారు. పల్లె.. పట్నం అని తేడాలేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా హత్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 2023లో మొత్తం 789 హత్య కేసులు నమోదయ్యాయి. ఈ గణాంకాలను బట్టి.. రాష్ట్రంలో సగటున ప్రతి 12 గంటలకో హత్య జరుగుతోంది.

ఇటీవల వెలుగు చూసిన దారుణాలెన్నో..

- ఉప్పల్‌కు చెందిన సుగుణమ్మకు సొంతిల్లు ఉంది. దాన్ని విక్రయిద్దామంటూ కొడుకు అనీల్, కోడలు తిరుమల పోరుపెట్టినా.. ఆమె వినలేదు. చచ్చేదాకా ఇంటిని అమ్మేదిలేదంటూ తేల్చిచెప్పడంతో.. ఆస్తి కోసం సుగుణమ్మను కడతేర్చారు.
- కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గుజ్జుల్ తండాకు చెందిన వసంతరావు తన కొడుకు సురేశ్‌ను కంటికి రెప్పలా పెంచాడు. గుండెలపై ఎత్తుకుని పెంచిన కొడుకును.. చిన్నపాటి వాగ్వాదంతో క్షణికావేశంలో గుండెలపై పొడిచి చంపాడు. ఆ తర్వాత తప్పు తెలుసుకుని, పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.
- జోగులాంబ-గద్వాల జిల్లా అయిజకు చెందిన భార్గవ్.. తన భార్యపై అనుమానంతో రెండేళ్ల కుమారుడు నందకిశోర్‌కు ఎలుకల మందు, నిద్ర మాత్రలు ఇచ్చి, హతమార్చాడు.

2023 వివరాలు

కుటుంబ వివాదాలు	176
లైంగిక అసూయ	136
ఆస్తివివాదాలు	89
పాతకక్షలు	73
ప్రేమ వ్యవహారాలు	18
సుపారీ హత్యలు	8
పరువు హత్యలు	2
ఇతరత్రా కారణాలు	287
మొత్తం	789


ఆస్తులపై మమకారం బంధాల్లో లోపిస్తోంది

గతంలో వస్తువులకంటే మనుషుల పట్ల అభిమానం, ఆపేక్ష ఉండేది. ఇప్పుడు వస్తువులు, ఆస్తులపై అభిమానం పెరిగింది. దారుణాలన్నింటికీ ఈ మార్పే ప్రధాన కారణం. ఆస్తులకు ఇచ్చిన విలువ మనుషులకు లేకుండా పోతోంది. గతంలో ఇంటి పెద్ద ఎవరో ఒకరు పిల్లల నడవడికను కనిపెట్టుకుని ఉండి తప్పొప్పులను వివరించి చెప్పేవారు. ఇప్పుడు పిల్లలకు విలువలు, బంధాలు, బంధుత్వాల గురించి చెప్పే పరిస్థితి లేదు. విద్యావిధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. నేరాలకు పాల్పడే వారికి సత్వరం కఠిన శిక్షలు పడేలా చట్టంలో మార్పులు తెస్తే తప్ప.. పరిస్థితిలో మార్పు రాదు.

- విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ మీనా హరిహరన్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 9 జనవరి 2024
diksuchi@andhrajyothy.com



హైదరాబాద్ నిక్మర్‌లో పీజీ ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్(నిక్మర్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి ఫుల్ టైం ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్‌లు. ఏడాది, రెండేళ్ల వ్యవధి గల ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఏడాదికి రెండు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ (పీజీ ఎన్‌క్యాట్) 2024, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, రేట్ ఆఫ్ అప్లికేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. నిర్దేశిత డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి ప్రోగ్రామ్‌లో పది శాతం అభ్యర్థులకు నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ అడ్వాన్స్‌డ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ హెల్త్, సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ద్వితీయ శ్రేణి మార్కులతో రెగ్యులర్ డిగ్రీ(ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/మేనేజ్‌మెంట్/ఎకనామిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/అగ్రికల్చర్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ(ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/కామర్స్/ఫైనాన్స్/బ్యాంకింగ్/మేనేజ్‌మెంట్/ఎకనామిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

పీజీ ఎన్‌క్యాట్ 2024: పరీక్షని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. దీనికి 180 మార్కులు నిర్దేశించారు. ఇందులో క్వాంటిటేటివ్ అండ్ అనలిటికల్ ఎబిలిటీ నుంచి 72 మార్కులకు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 36 మార్కులకు, వెర్బల్ అండ్ జనరల్ ఎబిలిటీ నుంచి 72 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

- గ్రూప్ డిస్కషన్‌కు 20 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 మార్కులు, రేటింగ్ ఆఫ్ అప్లికేషన్‌కు 70 మార్కులు ప్రత్యేకించారు.
- సీయూఈటీ(పీజీ)/క్యాట్/మ్యాట్/ఎక్స్ఏటీ/ఎన్‌మ్యాట్/ఏటీఎంఏ స్కోర్ ఉన్నవారు పీజీ ఎన్‌క్యాట్ 2024 రాయనవసరం లేదు.
- పీజీ ఎన్‌క్యాట్ 2024 స్కోర్‌కు 60 శాతం; గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల స్కోర్లకు 16.67 శాతం; రేటింగ్ ఆఫ్ అప్లికేషన్‌కు 23.33 శాతం వెయిటేజీ ఇస్తారు.

నిక్మర్ స్కాలర్‌షిప్‌లు: పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ స్థాయిల్లో కనీసం 95 శాతం మార్కులు సాధించినవారికి 80 శాతం ట్యూషన్ ఫీజు; 90 శాతం మార్కులు సాధించినవారికి 60 శాతం ట్యూషన్ ఫీజు; 85 శాతం మార్కులు సాధించినవారికి 40 శాతం ట్యూషన్ ఫీజు; 80 శాతం మార్కులు సాధించినవారికి 20 శాతం ట్యూషన్ ఫీజును స్కాలర్‌షిప్ కింద చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- ★ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- ★ **పీజీ ఎన్‌క్యాట్, జీడీ, ఇంటర్వ్యూలు:** ఫిబ్రవరి 12 నుంచి 18 వరకు
- ★ **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఫిబ్రవరి 21
- ★ **ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** మార్చి 20
- ★ **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూలై 15 నుంచి
- ★ **వెబ్‌సైట్:** https://nicmar.ac.in/hyderabad

సైన్స్‌లో పీహెచ్‌డీకి జెస్ట్

సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రవేశాలకు ఉద్దేశించిన జాయింట్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్ట్(జెస్ట్) 2024 నోటిఫికేషన్ వెలువడింది. తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ) దీనిని నిర్వహిస్తోంది. ఈ స్కోర్ వ్యాలిడిటీ ఏడాది. ఇందులో ఏఆర్ఐఈఎస్, బోస్ ఇన్‌స్టిట్యూట్, హెచ్‌బీఎన్ఐ, హెచ్ఆర్ఐ, ఐసీటీఎస్, ఐజీసీఏఆర్, ఐఐఏ, ఐఐఎస్సీ, ఐసర్ సంస్థలు, ఐఐఎస్‌టీ, ఐఎంఎస్సీ, ఐఓపీ, ఐపీఆర్, ఐయూసీఏఏ, జేఎన్‌సీఏఎస్ఆర్, ఎన్‌బీఆర్‌సీ, నైసర్, ఎన్‌సీఆర్ఏ - టీఐఎఫ్ఆర్, పీఆర్ఎల్, ఆర్ఆర్‌సీఏటీ, ఆర్ఆర్ఐ, ఎస్ఐఎన్‌పీ, ఎస్ఎన్‌బీఎన్‌సీబీఎస్, టీఐఎఫ్ఆర్-టీసీఐఎస్, టీఐఎఫ్ఆర్, యూజీసీ-డీఏఈ సిఎస్ఆర్, వీఈసీసీ వంటి ప్రధాన సంస్థలు పాల్గొంటున్నాయి. జెస్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా ఈ సంస్థల్లో ప్రవేశాలు కల్పిస్తారు. వీటిలో కొన్ని సంస్థలు అందిస్తున్న ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు. ప్రతి సంస్థకూ నిర్దేశిత అర్హత నిబంధనలు ఉన్నాయి. వాటి వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లలో చూడవచ్చు.



స్పెషలైజేషన్‌లు: ఫిజిక్స్, థియరిటికల్ కంప్యూటర్ సైన్స్, న్యూరోసైన్స్, కంప్యూటేషనల్ బయాలజీ

అర్హత: పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/ఆప్టిక్స్ అండ్ ఫొటోనిక్స్/ఆస్ట్రానమీ/ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/బయోఫిజిక్స్/బయోకెమిస్ట్రీ/కెమిస్ట్రీ/కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/ఎంటెక్-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/రేడియో ఫిజిక్స్/మేథమెటిక్స్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఆప్టిక్స్ అండ్ ఫొటోనిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఎస్సీ/పోస్ట్ బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్/బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు, ఎంసీఏ అభ్యర్థులకు కూడా కొన్ని సంస్థలు అవకాశం కల్పిస్తున్నాయి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థులూ అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఆసక్తిగలవారు ఎన్నిసార్లయినా ఈ పరీక్ష రాయవచ్చు.

జెస్ట్ 2024 వివరాలు: ఈ పరీక్షని ఫిజిక్స్, థియరిటికల్ కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒక విభాగంలో మాత్రమే పరీక్ష రాయాలి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం 3 గంటలు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో 15 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి మూడు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో 10 ప్రశ్నలు ఇస్తారు. ఆప్షన్స్ ఇవ్వరు. వీటికి ఒక నెంబరు సమాధానంగా ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. ఈ ప్రశ్నలకు రుణాత్మక మార్కులు లేవు. మూడో పార్ట్‌లో 25 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానం తప్పుగా గుర్తిస్తే మూడోవంతు మార్కు కోత విధిస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద బ్లాక్/బ్లూ పెన్‌తో గుర్తించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ కేటగిరీ పురుషులకు రూ.800; మహిళలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 24
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం
- **జెస్ట్ 2024 తేదీ:** మార్చి 3
- **వెబ్‌సైట్:** jest.org.in

Joint Entrance Screening Test

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-2, 3 ప్రత్యేకం
ఇండియన్ సొసైటీ

బంధుత్వం(కిన్‌షిప్)

సంస్థ అంటే ఒక క్రమపూర్వకమైన సామాజిక సంబంధాల వ్యవస్థ. సామాజిక ప్రమాణాలు, విలువలపై ఆధారపడిన అవ్యవస్థీకృతమైన సమూహమే సామాజిక సంస్థ. ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి ఒక తరం నుంచి మరో తరం వరకు జాగ్రత్తగా కొనసాగే ప్రామాణిక వ్యవస్థే సామాజిక సంస్థ. ప్రతి సమాజంలోనూ ప్రాథమికంగా ఉండేవి బంధుత్వం, వివాహం, కుటుంబం, మతం, విద్య, ఆర్థిక, రాజకీయ సంస్థలు.

బంధుత్వం ఒక సామాజిక సంస్థ



బంధుత్వం: సమాజంలో మానవుడు ఒంటరిగా జీవించలేడు. జన్మించింది మొదలుకొని మరణించే వరకు వ్యక్తి అనేక మందితో సంబంధాన్ని కలిగి ఉంటాడు. సమాజంలో ఉన్న వ్యక్తుల మధ్య ఏదో ఒక రకమైన సంబంధం కొనసాగుతూ ఉంటుంది. అయితే రక్తం లేదా వివాహం ఆధారంగా ఏర్పడే బంధాలు దగ్గరగా ఉంటాయి.

రక్త బంధుత్వం: భార్య, భర్త ఇద్దరికీ, వారి సంతానానికి మధ్య ఏర్పడిన పరస్పర బంధాలను 'రక్త బంధుత్వం' అని పిలుస్తారు. ఒకే దంపతులకు పుట్టిన బిడ్డలందరి మధ్య రక్త సంబంధం ఉంటుంది. ఈ సంబంధాన్ని తెలిపేదే 'ఏక రక్త సంబంధం'.

బంధుత్వాలను భిన్న సమాజాలలో భిన్న రీతులుగా అనుసరిస్తున్నారు. ఉదాహరణకు తమిళనాడులోని నీలగిరి కొండల్లో నివశిస్తున్న 'తోడా' సమాజంలో స్త్రీ ఒక వ్యక్తితో సంతానం కలిగి...తదనంతరం మరో వ్యక్తిని వివాహం చేసుకుంటే అతడినే ఆ స్త్రీ పూర్వ సంతానికి కూడా తండ్రిగా అక్కడి సమాజం గుర్తిస్తుంది. ఈ తరహా బంధుత్వాన్ని సామాజిక బంధుత్వం(సోషియాలజికల్ కిన్‌షిప్) అంటారు. సామాజిక బంధుత్వాన్ని మాత్రమే 'వాస్తవ బంధుత్వం' అంటారు. ఇటువంటి వాస్తవ బంధుత్వాన్ని బట్టి కూడిన వారిని బంధువులు(కిన్స్) అంటారు.

ద్వితీయ బంధువులు: ఒక వ్యక్తికి సంబంధించిన ప్రాథమిక బంధువులకు చెందిన ప్రాథమిక బంధువులు, ఆ వ్యక్తికి ద్వితీయ బంధువులు అవుతారు.(భార్య ప్రాథమిక బంధువు, ఆవిడ తల్లిదండ్రులు-సోదర, సోదరీమణులు ద్వితీయ బంధువులు)

తృతీయ బంధువులు: ఒక వ్యక్తి ద్వితీయ బంధువులకు చెందిన ప్రాథమిక బంధువులు... ఆ వ్యక్తికి తృతీయ బంధువులు అవుతారు.

ఉదా:- భార్య తాలూకు బావ(తోడల్లుడు తృతీయ బంధువు అవుతాడు. మొదటి వ్యక్తి తాలూకు భార్య ప్రాథమిక బంధువు, ఆవిడ అక్క ద్వితీయ బంధువు, అక్క భర్త తృతీయ బంధువు)

వర్గాత్మక వ్యవస్థ: వర్గాత్మక వ్యవస్థలో వివిధ సంబంధీకులు అందరినీ ఒకే వర్గంలో చేర్చడంతో పాటు ఒకే పదంతో వారిని సంబోధిస్తారు. ఉదా:- మామ ఒక వర్గాత్మక పదం.

వర్గాత్మక వ్యవస్థలో బంధువులను సంబోధించే పద్ధతులను బట్టి బంధుత్వ పదాలను మూడు రకాలుగా పేర్కొనవచ్చు. అవి.. పదాలు, అన్వయ పదాలు, టెక్నానమీ.

ఎ) సంబోధన పదాలు: ఒక వ్యక్తి తన బంధువులతో సంభాషించేటప్పుడు వాడే పదాలు 'సంబోధన' పదాలు.

ఉదాహరణలు:-

1. ఒక వ్యక్తి తన చెల్లెలితో సంభాషించేటప్పుడు 'సోదరి' అని వాడుతారు.
2. ఒక వ్యక్తి తన తండ్రితో సంభాషించేటప్పుడు 'నాన్న' అని వాడతారు.

బి) అన్వయ పదాలు: ఒక వ్యక్తి మూడో వ్యక్తితో ఒకానొక తన బంధువు గురించి చెప్పేటప్పుడు ఉపయోగించే బంధుత్వ పదమే 'అన్వయ పదం'. ఉదాహరణకు ఒక వ్యక్తి తన నాన్న సోదరుని గురించి మూడో వ్యక్తికి చెప్పినప్పుడు మా 'చిన్నాన్న' అని వర్ణిస్తాడు. అంటే 'చిన్నాన్న' అన్వయ పదం.

వివరణాత్మక పదాలు: రెండు లేదా అంతకన్నా ఎక్కువ ప్రాథమిక పదాలు కలిసినందు వల్ల ఒక కొత్త పదం ఏర్పడినప్పుడు దానిని వివరణాత్మక పదం అంటారు. ఉదాహరణకు నాన్న+అమ్మ=నాన్నమ్మ.


బంధుత్వం ఆచరణలు(కిన్‌షిప్ యూసేజెస్): బంధు సమూహాలలో వ్యక్తుల మధ్య వివిధ రకాలైన బంధుత్వాలు ఉంటాయి. ఒక్కో రకమైన బంధుత్వం ఒక్కో రకమైన ప్రవర్తనను తెలియజేస్తుంది. సమాజం మొతమ్మీద చూస్తే... బంధు సమూహాలలోని వ్యక్తుల మధ్య కొన్ని నిర్దిష్టమైన ప్రవర్తనలు కనిపిస్తాయి. వాటినే బంధుత్వ ఆచరణలు అంటారు. వాటిలో ఆరు ప్రధానమైనవి. అవి... పరిహాస సంబంధాలు, వైదొలుగు నడవడి, మాతులాధికారం, పితృష్వాదికారం, సాంకేతిక సంబోధన, కుహనా ప్రసూతి.



జి.వీరా స్వామి,
సీనియర్ ఫ్యాకల్టీ.

మద్రాస్ ఐఐటి, డేకిన్ వర్సిటీ ఉమ్మడిగా రీసెర్చ్ అకాడమీ

మద్రాస్ ఐఐటీ, ఆస్ట్రేలియాకు చెందిన డేకిన్ యూనివర్సిటీ కలిసి ఉమ్మడిగా రీసెర్చ్ అకాడమీని ఆరంభించాయి. 'ఐఐటీ మద్రాస్ డేకిన్ యూనివర్సిటీ రీసెర్చ్ అకాడమీ'గా మలిచారు. ఉమ్మడి పర్యవేక్షణ, మెరిటోరియస్ స్కాలర్‌షిప్స్‌తో గ్లోబల్ రీసెర్చ్‌కు శ్రీకారం చుట్టారు. సార్క్ అలాగే ఆసియన్ దేశాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్లు- ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించే దిశగా పరిశోధనలు చేస్తారని మద్రాస్ ఐఐటీ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. క్లీన్ ఎనర్జీ, క్రిటికల్ టెక్నాలజీస్, క్లయిమేట్ చేంజ్, హెల్త్‌కేర్ టెక్నాలజీస్ తదితరాలకు ప్రాధాన్యం ఇస్తారు. రెండు విశిష్ట సంస్థలు ఉమ్మడిగా నాలుగేళ్ళ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తాయి. ఇందులో భాగంగా ముప్ఫయ్ స్కాలర్‌షిప్‌లను అందిస్తారు. పరిశోధనలు మరింత అర్థవంతంగా ఉండేందుకుగాను అకడమిక్, ఇండస్ట్రీ నెట్‌వర్క్‌ను కూడా ఏర్పాటుచేయనున్నారు. తమ పరిశోధకులకు ఇచ్చేందుకు డేకిన్ వర్సిటీ పది, ఐఐటీ మద్రాస్ ఇరవై స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేశాయి.



వెబ్‌సైట్స్: https:// www.iitm.ac.in/ www.deakin.edu.au/

లిటిల్స్



రాజెవరు?


అనగనగా ఒక రాజు. ఆ రాజుకు వారసులు లేరు. దీంతో బంధువులకు కాకుండా బయట ప్రతిభ గల రాజ వంశీయులకు రాజ్యాధికారాన్ని అప్పచెప్పాలనుకున్నాడు. ఇతను పిచ్చివాడన్నారు బంధువులు. రాజుగారు యువరాజును ఎంపిక చేసే సభకు రావాలిసిందిగా దేశమంతా దండోరా వేయించారు. అందరూ సభకు వచ్చారు. ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. రాజు రానే వచ్చాడు. ముగ్గురు యువకులను ప్రవేశపెట్టండి మహామంత్రిగారూ అన్నారు గట్టిగా. ఆ ముగ్గురు యువకులు వచ్చి నిలబడ్డారు.

రాజుగారు అటూ ఇటూ చూశారు. సభలో నిశ్శబ్దం. 'జీవితానికి ఆనందం అవసరం. అదే అంతిమ పరమావధి. అది లేకుంటే జీవితం నిస్సారం అవుతుంది. మనకు కళలు అవసరం. నేను ఇచ్చిన ఇరవై వేల బంగారు నాణేలను కళల అభివృద్ధి కోసం కేటాయించిన సూరసేనుణ్ణి అభినందిస్తున్నా' అన్నాడు. అందరూ చప్పట్లు కొట్టారు. సూరసేనుణ్ణి తన స్నేహితులు, సభికులు మెచ్చుకున్నారు.


ఆ తర్వాత చంద్రసేనుణ్ని చూస్తూ.. 'రాజ్యం ప్రశాంతంగా ఉండాలి. అప్పుడే ఆనందం. హాయిగా ఉండే ప్రజలున్నప్పుడే రాజు బావున్నట్టు. నేను ఇచ్చిన ఇరవై వేల బంగారు నాణేలతో యుద్ధ విద్యలు నేర్చుకున్న ఇతడు గొప్పవాడు' అన్నాడు. అందరూ చప్పట్లు. 'ఇలాంటి వారు ఉన్నప్పుడు శత్రు రాజుల గుండెల్లో భయం పరిగెడుతుంది' అన్నాడు. అందరూ హోరున చప్పట్లు.

రాజుగారు మూడో వ్యక్తిని చూశాడు. అతని పేరు వీరసేనుడు. 'రాజు అనేవాడు గురువు లాంటి వాడు. తండ్రిలాంటి వాడు. ప్రజలకు కూడు, గూడు, గుడ్డను ఇవ్వాలి. నేను కృష్ణగిరి ప్రాంతం వెళ్లి చూశాను. ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. నేను ఇచ్చిన ఇరవై వేల బంగారు నాణేలను డెబ్భయ్ వేల బంగారు నాణేలుగా చేసిన ఇతడే మన దేశానికి కాబోయే రాజు' అని ప్రకటించాడు. సభ చప్పట్లతో దద్దరిల్లింది. రాజుగారి తెలివికి అందరూ సంతోషపడ్డారు.

దారి కనుక్కోండి



చుక్కలు కలిపి బొమ్మ గీయండి



సరైన నీడ ఏది?



రంగులు వేయండి



డైలీ సుడోకు - 199

							2	8
		2	5		3	1		9
		1	9			3		
7				6				
	1						4	
				5				2
		4			6	9		
9		5	3		1	2		
3	6							

సుడోకు - 198 సమాధానం

2	9	8	7	1	6	4	5	3
1	4	7	8	5	3	6	2	9
3	5	6	4	9	2	8	1	7
5	8	4	6	3	9	1	7	2
7	2	1	5	8	4	3	9	6
9	6	3	1	2	7	5	4	8
4	7	5	9	6	8	2	3	1
8	1	2	3	7	5	9	6	4
6	3	9	2	4	1	7	8	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.